
భక్తి యోగం

వామన పురాణాంతర్గత వేంకటాచల మహాత్యం




ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

http://ebooks.tirumala.org



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

వామన పురాణాంతర్గత

శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

రచయిత్రి

డా. తులసి సావిత్రి

తులసి ప్రచురణలు, తిరుపతి

2008.

Sri Vamana Puranantargata Venkatachala Mahatmyamu

By

Dr. T. Savithri

First Edition 2008
Copies - 1000
Price - **Rs.100/-**

For Copies
Sri K. Madhva Muni Rao
303, Sridevi Apartments, K.B. Layout
TIRUPATI - 517 501.
(0877-2233207.

D.T.P. By
R.Venkatesan
Cell : 9949206505
Tirupati.

Printed at
Kusuma Graphics
20-3-15/D, Siva Jyothi Nagar
TIRUPATI - 517 501.

అంకితం




వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।

వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

వామనపురాణము అ.37-శ్లో.41

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు మత ధార్మిక సంప్రదాయ గ్రంథముల ప్రచురణకు ఇచ్చు ఆర్థిక సహాయముచే ఈ గ్రంథము ముద్రించబడినది.

ఈ గ్రంథ ప్రచురణ తర్వాత గ్రంథమును గూర్చి ఎటువంటి తగాదాలు వచ్చినా, ఏ విధమైన విమర్శలు వచ్చినా, చట్టరీత్యా ఫిర్యాదులు వచ్చినా వాటికి పరిష్కరించుటలో రచయితదే బాధ్యత అని తెలియవలయును



శ్రీ లక్ష్మీనృసింహ పరబ్రహ్మణే నమః

శ్లో ॥ ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖమ్
నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహమ్ ॥

అభినందనమ్

శ్రీ వేంకటాద్రి నిలయః కమలా కాముకః పుమాన్ ।

అభఙ్గు రవిభూతిర్నస్తరంగయతు మంగళమ్ ॥

భగవంతుడు మహావిష్ణువు ప్రతి యుగమునందు (కృత,త్రేతా, ద్వాపర) వివిధ రూపములలో (మత్స్య,కూర్మ,వరాహాదులు) అవతరించుచూ అధర్మపరులైన రాక్షసాదులను సంహరించుచు సాత్వికస్వభావులైన ముని పుంగవులను సజ్జనులను రక్షించుచున్నాడు. ఈ ప్రకారము ధర్మ సంస్థాపన చేయుచున్నాడు.

'కలౌ వేంకటనాయకః' అను వచనమును అనుసరించి శ్రీమన్నారాయణుడు ఈ వేంకటాచలము నందు అర్చావతార రూపముతో శ్రీ వేంకటేశ్వరుడను నామముతో ఉద్భవించెను. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడగు శ్రీనివాసుడు దుష్టజనశిక్షణ శిష్టజనరక్షణ చేయుచు మహిమాన్వితుడు సకలాభీష్టప్రదుడై ఏడుకొండలందు విరాజిల్లుచున్నాడు. అందువలననే దేశ విదేశముల నుండి భక్తజనులు ఇచ్చటకి వచ్చి శ్రీనివాసుని భక్తితో దర్శించి సేవించి తమకు ఇష్టమైన వరములను పొందుచున్నారు. శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహముచే భక్తులు ఇహలోకమునందు సుఖమును పరలోకమునందు మోక్షమును పొందుచున్నారు.

మన సంస్కృత వాఙ్మయము నందు 18 పురాణములు కలవు. అవి సాత్విక,రాజస,తామస రూపములలో విభజించబడ్డాయి. శ్రీ వేంకటాచల మాహాత్మ్యమును వివరించు విషయములు వరాహాది 11 పురాణములలో లభించుచున్నవి. వీటికి సంబంధించిన బహు గ్రంథములు ముద్రితములు.

శ్రీమతి టి. సావిత్రి యమ్.ఏ., సంస్కృత సాహిత్యం మరియు వేదాంత విషయమును ప్రధానాంశముగ అధ్యయన మొనర్చి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యెను. ఈమె చాలాకాలమునుండి తి.తి.దేవస్థానము వారిచే నిర్వహించబడు భక్తి సాహిత్య గ్రంథముల ప్రచురణ విభాగమునందు (Co-Ordinator Publications) పరిశోధకసహాయకురాలిగా ఉద్యోగము చేయుచున్నది. శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో సేవ చేయుచు శ్రీ వేంకటేశ్వర సాహిత్యమునందు శ్రద్ధను ఆసక్తిని ప్రదర్శించుచు నా పర్యవేక్షణలో సంస్కృత విభాగమునందు "శ్రీవామనపురాణాంతర్గతస్య శ్రీ వేంకటాచల మాహాత్మ్యస్య పరిశీలనాత్మకం అధ్యయనమ్" అను అంశమును స్వీకరించి పిహెచ్.డి., ఉపాధి కొరకు ప్రవేశించి పరిశోధనను సమగ్రముగా చేసి సాఫల్యమును పొందెను. ఈ పరిశోధనగ్రంథమును లిఖించుటలో శ్రీమతి సావిత్రిచే అనేక సంస్కృతాంగ్ల ఆంధ్ర గ్రంథములు పరిశీలించి ఉపయోగించబడినవి.

ప్రస్తుతము తెలుగులో రచించిన 'వామనపురాణాంతర్గత శ్రీవేంకటాచల మాహాత్మ్యము' సావిత్రిచే నాలుగు అధ్యాయములుగా విభజించబడినది. మొదటి అధ్యాయములో వరాహాది 11పురాణములలో గల శ్రీ వేంకటాచల మాహాత్మ్య విషయముల పరిచయము విస్తరముగా కావించబడినది. రెండవ అధ్యాయంలో శ్రీ వేంకటాచల క్షేత్రప్రసిద్ధి శ్రీవేంకటేశ్వర వైభవ వర్ణన చేయబడినది. మూడవ అధ్యాయము నందు శ్రీ వేంకటాద్రి క్షేత్రములోని ప్రయాగాది 10 తీర్థముల మాహాత్మ్యము వర్ణించబడినది మరియు 35 తీర్థములు ప్రతిపాదించబడినవి. నాల్గవ అధ్యాయమునందు శంకరుడు, స్కందుడు మొదలైన దేవతలు, అగస్త్యుడు మొదలైన మహర్షులు, శంఖుడు, ఉపరిచరవసువు మొదలగు మహారాజుల వృత్తాంతములు స్పష్టీకరించబడినవి.

ఈ గ్రంథమును ముద్రించుటకు తిరుమల తిరుపతి దేవస్థానము నుండి ఆర్థిక సహాయమును పొంది సావిత్రిచే ఇప్పుడు ముద్రించ బడుచున్నదను విషయము మిక్కిలి ఆనందమును కలుగజేయుచున్నది. శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహముచే పండిత పామర జనుల ఉపయోగము కొరకు, సమాజహితమును కాంక్షించుచు ఇటువంటి సారస్వత వ్యాసంగములను శ్రీమతి సావిత్రి నిర్విఘ్నముగా నిర్వహించు గాక, అందరి అభినందనలకు పాత్రురాలు అగు గాక, యని ఆశీస్సులను తెలియజేస్తున్నాను. శ్రీపద్మావతీ సమేత శ్రీనివాసుడు వారి కుటుంబమునకు శుభపరంపరలను ప్రసాదించుగాక.

ఆచార్య కె.హయగ్రీవశర్మ
సంస్కృత విభాగము
యస్.వి. యూనివర్శిటీ
తిరుపతి.

ముందు మాట

మన భారతదేశం అనేక పుణ్యక్షేత్రాలకు నిలయం. అందులో కలియుగ వైకుంఠమని ప్రసిద్ధిని పొందిన వేంకటాచల (తిరుమల) క్షేత్రం ప్రథమ గణ్యమైంది. వేంకటాద్రికి సమానమైన క్షేత్రం ప్రపంచంలో లేదు. వేంకటేశ్వరునికి సమానమైన దైవము లేదు, ఉండడు. అట్టి అనన్య పవిత్రమైన క్షేత్ర తీర్థ దైవతముల మహిమలను వివరించే గ్రంథమిది.

ఈ గ్రంథం "వామన పురాణాంతర్గత శ్రీవేంకటాచల మాహాత్మ్యము" ను గురించి శ్రీమతి. సావిత్రి విస్తృత పరిశోధనచేసి సంస్కృత భాషలో రచించిన సిద్ధాంత గ్రంథమునకు తెలుగు అనువాదం. ఆమెకు ఈ గ్రంథ రచన వలన డాక్టరేటు డిగ్రీ లభించింది. డా. టి.సావిత్రికి అభినందన మందార మాలలు.

ఇతిహాసము, పురాణము, కావ్యముల వలె క్షేత్ర మాహాత్మ్య గ్రంథములు కూడ ఒక సాహిత్య ప్రక్రియ. మాహాత్మ్య గ్రంథమున క్షేత్ర (స్థల), దైవ, తీర్థముల మాహాత్మ్యములు కలగలసి యుండుటచే వస్తు వైవిధ్యముతో రమణీయముగ ఉండును. ఆ క్షేత్రము, ఆ తీర్థము అత్యంత పాపహరమనియు, మోక్షప్రదమనియు, ఆ దైవము భక్తసులభుడనియు, శరణాగత రక్షణ పరాయణుడనియు వెల్లడించుట మాహాత్మ్య కావ్యముల యొక్క సూత్రాత్మయగు భావము. ఈ ప్రధాన భావము అనేక కథలచేత వైవిధ్యముగా వర్ణించుటచే గ్రంథము విస్తరించును. ఈ మాహాత్మ్య గ్రంథముల పరమ ప్రయోజనము మోక్షమునకు, పాపపరిహారమునకు అత్యంత సులభమార్గముగ భగవద్భక్తిని ఆకర్షవంతముగ వర్ణించి, ప్రచారము చేయుటయే.

క్రీ.శ. 1491లో పసిండి వేంకటత్తురైవరు అను శ్రీవారి అర్చక స్వామి వరాహ, వామన, స్కాందాది 11 పురాణములలో నున్న వేంకటాచల క్షేత్ర, దైవత, తీర్థముల మాహాత్మ్యములను వర్ణించే అధ్యాయములను సంగ్రహించి 'తిరువేంకటు మాహాత్మ్యము' అను పేరుతో సంకలన గ్రంథం రూపొందించినాడు. స్వయం వ్యక్తమైన శ్రీనివాసుని అర్చావతారమునకు పౌరాణిక మూలమును, ప్రశస్తిని నిరూపించుటయే పసిండి వేంకటత్తురైవరు ఉద్దేశ్యమై యున్నది. అతడే శ్రీవారి సన్నిధిలో దేవతా ప్రీతికొరకు తిరువేంకట మాహాత్మ్య గ్రంథమును నిత్యము పారాయణము చేయుటకు ఏర్పాటుచేసి 27-6-1491 తేదీన శాసనం వేయించినాడు (తి.తి.దే శాసనములు 2-95). ఈ గ్రంథమునకు వేంకటాచల మాహాత్మ్యము, శ్రీనివాసపురాణము అను నామాంతరములు గలవు. ఈ గ్రంథము వేంకటాచల మాహాత్మ్యము అను పేరుతో 24-07-1884 తేదీన తి.తి.దేవస్థానముల విచారణకర్త అయిన మహంతు భగవాన్‌దాసుచే ప్రకటించబడింది.

పసిండి వేంకటత్తురైవరు తాళ్ళపాక అన్నమాచార్యులకు సమకాలికుడు. అన్నమాచార్యులు కూడ సంస్కృతములో వేంకటాచల మాహాత్మ్య కావ్యమును రచించియున్నట్లు "దివ్యభాష నా వేంకటాద్రి మాహాత్మ్య మంతయు"అను తాళ్ళపాక చిన్నన్న (అన్నమాచార్యుల మనుమడు, పెద తిరుమలాచార్యుల కుమారుడు) రచించిన "అన్నమాచార్య చరిత్ర" అను ద్విపద కావ్యం (పుట:46) లో తెలిపియున్నాడు. అన్నమాచార్యుల గ్రంథం లభించలేదు.

ఈ గ్రంథంలో నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. రచయిత్రి డా|| టిసావిత్రి మొదటి అధ్యాయంలో వేంకటాచల మాహాత్మ్య గ్రంథాన్ని పరిచయం చేస్తూ వరాహ వామన స్కాందాది 11 పురాణాలలో గల వేంకటాచల మహిమలను, కథలను, విశేషాంశములను సంగ్రహంగా సమీక్షించారు. పిమ్మట వామనపురాణ

భాగాన్ని పరిశోధనాత్మకంగా పరిశీలించారు. రెండవ అధ్యాయంలో వేంకటాచల క్షేత్రవైభవాన్ని విస్తృతంగా సమీక్షించారు. నేటి తిరుమల శ్వేతవరాహ విష్ణుదేవునిచే ఆజ్ఞాపింపబడిన గరుత్మంతుడు వైకుంఠము నుండి భూమికి తెచ్చిన వేంకటమను పేరుగల విష్ణుదేవుని క్రీడాద్రి అని తెలియజేశారు. వేంకటాద్రిపై శ్రీమన్నారాయణుని సాక్షాత్కారమును చూసి బ్రహ్మాది దేవతలు, అగస్త్యాది మహర్షులు తదితరులు చేసిన భగవంతుని స్తోత్రములను విపులంగా వివరించారు. అనంతరం బ్రహ్మదేవుడు మొట్టమొదట చేసిన శ్రీనివాసుని మహోత్సవమును సాంగోపాంగముగా, సమగ్రముగా వర్ణించారు. ఈ మహోత్సవము బ్రహ్మ ప్రారంభించుట చేత, పరబ్రహ్మకు జరుగుటచేత, తొమ్మిది రోజులు జరుగుటచేత బ్రహ్మోత్సవమని పిలువబడుచున్నది. పంచబేరములను వివరించారు. భోగ శ్రీనివాసమూర్తి వెండి విగ్రహమును పల్లవరాణి సామవై పెరుందేవి క్రీ.శ. 8-6-966 శుక్రవారం నాడు తిరుమల దేవాలయంలో తిరువిలాన్ కోయిల్ లో (ప్రస్తుతం బంగారు వాకిలి దాటిన తర్వాత వున్న స్నపన మండపం) ప్రతిష్ఠించింది (తి.తి.దే. శాసనాలు, - I -8,9). ఆనాటి నుండి తిరుమల వేంకటేశ్వర స్వామికి శుక్రవారం అభిషేకం చేయడం ప్రారంభమైంది. మలయప్పస్వామి క్రీ.శ. 1339 నుండి ఉత్సవమూర్తిగ ఉన్నారు. అంతకు ముందు ఉగ్రశ్రీనివాసమూర్తి ఉత్సవమూర్తిగ ఉండేవారు.

మూడవ అధ్యాయంలో సప్తగిరులలో ఉన్న తీర్థములను, వాటి మహిమలను వెల్లడించే కథలను వివరించారు. శివుని బ్రహ్మహత్యా పాతకమును పరిహరించిన ప్రయాగ తీర్థ మహిమను కూడ వివరించారు. (ప్రయాగ తీర్థ మాహాత్మ్యంతోనే వేంకటాచల మాహాత్మ్య గ్రంథంలోని వామన పురాణ భాగం ప్రారంభమవుతున్నది.) కపిలాది సప్త దశ తీర్థ మహిమలను, కథలను విపులంగా వివరించారు. నాల్గవ అధ్యాయంలో స్కందుని (కుమార స్వామి) చరిత్ర, విష్వక్సేనుని

చరిత్ర, వాయుదేవుని వృత్తాంతము, సుదర్శనచక్ర వృత్తాంతము, అగస్త్య శంఖరాజ, ఉపరిచర వసువు వృత్తాంతములు విస్తృతంగా వివరించారు. గ్రంథము వాయుదేవ కృత శ్రీనివాస స్తోత్రముతో సంపూర్ణమవుతున్నది. ఈ స్తోత్రము వేంకటేశ్వరుని భక్తులు, వాయుదేవుని భక్తులు నిత్యము పారాయణము చేయదగిన భగవదనుగ్రహమును ప్రసాదించే స్తోత్రరాజము.

డా. సావిత్రి వేంకటేశ్వరుని వైభవమును, వేంకటాద్రిక్షేత్ర, తీర్థముల మహిమలను, వాటిని వెల్లడించే కథలను సమగ్రంగా, సంక్షిప్తంగా వివరించారు. వేంకటేశ్వరుని అనుగ్రహమునకు పాత్రులైనారు. భక్తులకు మహోపకారం చేశారు. అంత కంటె ఏమికావాలి?

డా. కె.వి. రాఘవాచార్య
వేంకటేశ్వర సాహిత్య పరిశోధకుడు

మనవి

శ్రీవేంకట లసచ్ఛైలవాసీ దాసీకృతామరః ।
ఛాయయా పాతు మాం నిత్యం శ్రీనివాస సురద్రుమః ॥

శోభాయమానంగా వెలుగొందుతున్న శ్రీవేంకట పర్వతముపై నివసిస్తూ సమస్త దేవతలను దాసులుగా చేసుకున్న శ్రీనివాసుడనే కల్పతరువు తన నీడతో సదా మనలను కాపాడు గాక!

భారతదేశం అనేక ప్రసిద్ధ పుణ్యక్షేత్రములతో విరాజిల్లుతున్నది. ఈ క్షేత్రముల ప్రభావము వలన భారతీయ సంస్కృతి ఇప్పటికీ నిత్య నూతనంగా శోభిస్తున్నది. ఆస్తికత్వం అభివృద్ధిచెందింది. భగవంతుడు, ఇతర దేవతలు అనేక అవతారములను ధరించి వచ్చి భారతదేశ సంస్కృతీ పరంపరలను రక్షిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇటువంటి అవతారములలో శ్రీనివాసుని దివ్యావతారం ఒకటి. ఈ కలియుగంలో భగవంతుడైన శ్రీవేంకటేశ్వరుడు వేంకటాచలంపై అర్చామూర్తిగా అవతరించాడు.

శ్రీనివాసుని గురించి ఆయన వెలసిన పర్వతమును గురించి అనేక పురాణాలు వర్ణించినాయి. వాటిలో వామన పురాణము ఒకటి. దీనిలో 25 అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యం వర్ణించబడింది. దానిని నేను 4 శీర్షికల క్రింద విభజించి, 4 అధ్యాయములుగా వివరించియున్నాను.

మొదటి అధ్యాయములో 11పురాణములలో ఉన్న శ్రీ వేంకటాచల మాహాత్మ్య పరిచయమును, రెండవ అధ్యాయములో శ్రీ వేంకటాచల వైభవమును, మూడవ అధ్యాయమునందు అందలి తీర్థవైభవమును, నాల్గవ అధ్యాయమున భక్తుల, ఋషుల ఉపాఖ్యానములను వివరించినాను.

పూజ్యులు మా గురువర్యులు కీర్తిశేషులు యస్.బి. రఘునాథాచార్యులు గారు సంస్కృతములో వామన పురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యమును గురించి పరిశోధన చేయమని సూచించినారు. వారి సూచన మేరకు నేను శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయములో ఇదే విషయముపై సంస్కృతములో పిహెచ్.డి., కొరకు పరిశోధన చేపట్టాను. అక్కడ సంస్కృత విభాగము నందు ఆచార్యులుగా పనిచేయుచున్న శ్రీ కురుమద్దాలి హయగ్రీవ శర్మగారు నా పరిశోధనకు మార్గదర్శకత్వం వహించి, తగు సూచనలు, సలహాలిచ్చి ప్రోత్సహించారు. తత్ఫలితంగా నాకు 2005లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంవారు సంస్కృతంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇందుకు కారకులైన కీ.శే. యస్.బి. రఘునాథాచార్య గారికి, ఆచార్య హయగ్రీవ శర్మ గారికి నా కృతజ్ఞతాభివాదములను తెలియ జేస్తున్నాను.

ఈ పుస్తకమును తయారుచేయుటలో శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయము నందు జ్యేష్ఠ పరిశోధనాధికారిగా పనిచేయుచున్న, డా. కెవి. రాఘవాచార్యులుగారు, నా సహోద్యోగులు డా. వి.గోపాల కృష్ణమూర్తిగారు, డా. డి.భారతిగారు అనేక విధాల సహాయ సహకారముల నందించినారు. వారికి నా కృతజ్ఞతా సుమములను సమర్పిస్తున్నాను. ఈ గ్రంథమును డి.టి.పి చేసిన శ్రీ ఆర్. వేంకటేశన్ గారికి నా అభినందనలు. అందముగా ముద్రించిన కుసుమ గ్రాఫిక్స్ వారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహాయమందించిన తిరుమల తిరుపతి దేవస్థానాధికారులకు నా కృతజ్ఞతలను తెలియజేసుకుంటున్నాను.

శ్రీనివాసుని కృపాకటాక్షములతో ఈ గ్రంథము వెలుగు చూసినది. ఆ శ్రీనివాస పాదారవిందములకు నా ఈ చిన్నికృతిని అంకితమిస్తూ ....

నమః శ్రీ వేంకటేశాయ శుద్ధ జ్ఞాన స్వరూపిణే
వాసుదేవాయ శాంతాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

క్ర.సం	విషయ సూచిక	పుట

మొదటి అధ్యాయము

రెండవ అధ్యాయము

మూడవ అధ్యాయము

నాలుగవ అధ్యాయము

స్మృత్యంజలి

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు నమస్సుమాంజలి



శ్రీ తులసి నరసింహాచార్య | శ్రీమతి తులసి లక్ష్మీదేవమ్మ

మొదటి అధ్యాయం

ఓం

మొదటి అధ్యాయం

శ్రీ వేంకటాచలమాహాత్మ్య పరిచయము

మన భారతదేశము పవిత్ర నదీనదములకు, పర్వతములకు, క్షేత్రములకు నిలయము. శ్రుతి, స్మృతి, ఇతిహాస పురాణములందు భగవంతుడైన మహావిష్ణువు యొక్క మహిమా విశేషములు అనేక విధములుగా వర్ణించబడినవి. నూట ఎనిమిది దివ్య క్షేత్రములలో శ్రీ వేంకటాచలక్షేత్రము ప్రధానంగా పరిగణించబడినది. భగవంతుడైన శ్రీ వేంకటేశ్వరుని గురించి, వేంకటాచలము యొక్క మహత్త్వము గురించి మహాపురాణములలో, ఉపపురాణములలో చెప్పబడినది.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథము నందు వరాహ,పద్మ,గరుడ, హరివంశ (శేషధర్మ), బ్రహ్మాండ, మార్కండేయ, వామన, బ్రహ్మ, స్కాంద, ఆదిత్య, భవిష్యోత్తర పురాణములలోని భాగములు సంకలనము చేయబడినవి. వరాహాది పది పురాణముల మూలగ్రంథములలో వేంకటాచల మాహాత్మ్య విషయములు కనిపించుట లేదు. స్కాంద పురాణములో మాత్రమే వేంకటాచలమాహాత్మ్యము లభించుచున్నది. తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురించిన శ్రీ వేంకటాచల మాహాత్మ్యము నందు 157 అధ్యాయములు, 10,771 శ్లోకములు కలవు.

భగవాన్ శ్రీనివాసుడు దివ్యావతారమూర్తి. ఆయన నివాసస్థానము శ్రీ వేంకటాచలము. ఆయన శ్రీవైకుంఠముపై విరక్తి చెంది స్వామి పుష్కరిణీ తీరంలో లక్ష్మీదేవితో కూడి విహరిస్తూ భక్తజనులను అనుగ్రహిస్తున్నాడు. భగవంతుడైన శ్రీనివాసుడు కలియుగ ప్రత్యక్షదైవము. అసంఖ్యాకులైన భక్తజనులు ప్రతిదినము ఆయనను సేవిస్తున్నారు. ఆ మహామహిమాత్ముడు, ఆపద్బాంధవుడు, భక్తపరాధీనుడు నైన శ్రీ వేంకటేశ్వరుని యొక్క ఆయన నివాస భూమియైన

శ్రీ వేంకటాచలము యొక్క మాహాత్మ్యము శ్రుతి స్మృతీతిహాస పురాణాదులలో అనేక విధములుగా ప్రస్తుతించడం జరిగింది.

శ్రీ సాళువ నరసింహరాయని కాలంలో (క్రీ.శ. 1445-1492) శ్రీ వేంకటేశ్వరుని అర్చకుడైన శ్రీ పసింది వేంకటత్తురైవర్ శ్రీ వేంకటాచల మాహాత్మ్యమును మొదటిసారిగా 27-6-1491న శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో పారాయణం చేసినాడు. ఈ సంప్రదాయము రాజైన నరసింగరాయని ప్రోత్సాహముతో ఏర్పాటు చేయబడినది. ఈ మాహాత్మ్యమునకు 'శ్రీనివాస పురాణ' మనే నామాంతరమున్నది. ఈ మాహాత్మ్యము తమిళంలో 'తిరువేంగడ మాహాత్మ్య' మనే పేరుతో ప్రసిద్ధి చెందినది.

వరాహాది పురాణ భాగములలో చెప్పబడిన శ్రీ వేంకటాచల మాహాత్మ్య విశేషములను సంక్షిప్తముగా పరిశీలిద్దాం.

1.1. వరాహ పురాణము :

అష్టాదశ పురాణములలో వరాహ పురాణము పదకొండవది. దీనిలో ముప్పది అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము వర్ణించబడినది. వేంకటాచల మాహాత్మ్యము శ్రీ వరాహకల్పవృత్తాంతముతో ప్రారంభమగుచున్నది.

ఇందులో స్వామిపుష్కరిణీ మాహాత్మ్యము, శంఖనృపతి వృత్తాంతము, ఆత్మారామ చరితం, కుమారధారా ప్రాశస్త్యము, కాపిలాది సప్తదశ తీర్థ మాహాత్మ్యము, శ్రీ వేంకటేశ్వర మహోత్సవము, శ్రీ వేంకటాద్రీశ వైభవ ప్రశంస, పాండవ-జరాహర-ఫల్గుణ-జాబాలి-సనకసనందన- కాయరసాయన తీర్థ మాహాత్మ్యములు, దశరథ వృత్తాంతము, బ్రహ్మాది మహర్షులు శ్రీ వేంకటాచలమునకు వచ్చుట, భేరుండాసుర సుదర్శనసేనల యుద్ధము, అష్టాంగయోగ స్వరూప నిరూపణము మొదలగు విషయములు వర్ణించబడినవి.

1.2. పద్మ పురాణము :

ఈ పురాణము మహాపురాణములలో రెండవది. ఈ పురాణములోని పదకొండు అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము వర్ణించబడినది.

ఇందులో శ్రీ వేంకటాచల వర్ణనము, ఆకాశగంగా మాహాత్మ్యము, పద్మసరోవర వర్ణనము, దాని తీరములో గల దివ్యారామ వర్ణనము, దివ్యారామంలో శుకమహర్షి యొక్క తపోఽనుష్ఠానము, స్వామి పుష్కరిణీ ప్రాశస్త్యము, శ్రీవరాహావతార వృత్తాంతము, శ్రీనివాసావతరణము, భగవద్విమానావిర్భావము, నీలకంఠాశ్రమ వర్ణనము, పాండవ తీర్థ మాహాత్మ్యము, నారాయణగిరి ప్రభావము, పద్మసరోవర మాహాత్మ్యము, లక్ష్మీ ప్రాదుర్భావము, శుకమహర్షి వృత్తాంతము, బ్రహ్మాదులు చేసిన శ్రీమహావిష్ణుస్తుతి మొదలైన అంశములు ప్రతిపాదించబడినవి.

1.3. గరుడ పురాణము :

ఈ పురాణము మహాపురాణములలో పదునేడవది. ఇందులో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము అరుంధతీ వసిష్ఠ సంవాద రూపంలో నున్నది.

ఇందు వసిష్ఠమహర్షి వర్ణించిన శ్రీ వేంకటాచల మాహాత్మ్యము, ఆకాశగంగ-పాపనాశనము-తుంబుర తీర్థముల ప్రాశస్త్యము, అరుంధతి తపస్సు కొరకు తుంబురు తీర్థమునకు వెళ్ళుట, అరుంధతి చేసిన భగవత్స్తుతి, భగవంతుడు చెప్పిన శ్రీ వేంకటాచల-తుంబురు తీర్థ మాహాత్మ్యములు మొదలైన అంశములు వివరించబడినవి.

1.4. హరివంశము (శేషధర్మము) :

మహాభారతము యొక్క ఖిలపర్వములో హరివంశము వర్ణించబడినది. ఇది భీష్మ యుధిష్ఠిర సంవాద రూపంలో ఉన్నది. దీనిలో శ్రీ వేంకటాచలం వృషగిరిగా కీర్తించబడినది.

భగవంతుని సేవించుట కొఱకు నారదాదులు శ్రీ వేంకటాచలమునకు వెళ్ళుట, శ్రీ వేంకటాచలమునందు నివసించెడి మహాజనుల చరిత్ర వర్ణనం, శ్రీనివాసుని సేవించుమని భీష్ముడు యుధిష్ఠిరుని ప్రేరేపించుట మొదలగు విషయములు ఇందు ఒకే అధ్యాయంలో చెప్పబడినాయి.

1.5. బ్రహ్మాండ పురాణం :

మహాపురాణములలో చివరి పురాణము. ఈ పురాణంలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము భృగు నారద సంవాద రూపంలో పదకొండు అధ్యాయములలో వివరించబడినది.

ఇందులో శ్రీ వేంకటాచలమునకు ఉన్న పేర్లు, అనంతుడు భగవంతుని క్రీడాపర్వతముగ రూపొందుట, వ్యాఘ్రపాదుని వృత్తాంతము, నారాయణుడనే విప్రుని వృత్తాంతము, క్రీడాచల వర్ణనము, వృషభాసుర వృత్తాంతము, వృషభాసురునికి శబరవేషధారి అయిన భగవంతునికి జరిగిన యుద్ధము, అంజనాదేవి శ్రీ వేంకటాద్రిలో తపస్సుచేసి ఆంజనేయుడనే కుమారుని కనుట, క్రీడాద్రికి 'అంజనాద్రి' అను పేరు వచ్చుట, శ్రీనివాస మహోత్సవము, చోళరాజు వృత్తాంతము, చక్రవర్తి శబరునితో పాటు వరాహదర్శనార్థమై శేషాచలమునకు వెళ్ళుట, కృష్ణశర్మ అను బ్రాహ్మణుని వృత్తాంతము, 'అస్థికూటము' అను సరోవర మాహాత్మ్యము, సింహోదుడను రాక్షసుని వృత్తాంతము మొదలైన అంశములు ప్రతిపాదించబడినవి.

1.6. మార్కండేయ పురాణం :

ఈ పురాణము మహాపురాణములలో ఏడవది. ఈ పురాణంలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యం ఐదు అధ్యాయాలలో వర్ణించబడినది.

ఇందులో మార్కండేయుని తీర్థయాత్ర,మార్కండేయుడు శుద్ధుడను అగస్త్యశిష్యునితో శ్రీ వేంకటాచలమునకు వచ్చుట, అగస్త్యుడు వర్ణించిన శ్రీ వేంకటాచల

వైభవము, శ్రీనివాసుని సేవించుటకు బ్రహ్మరుద్రాదులు శ్రీ వేంకటాచలమునకు వచ్చుట, బ్రహ్మరుద్రాదులు శ్రీనివాసుని స్తుతించుట, కుమారధారా మాహాత్మ్యము, వృద్ధ బ్రాహ్మణ వృత్తాంతము, కుమారధారాతీర్థంలో స్కందుడు తపస్సు చేయుట, తపస్సుచేత తారకాసురవధ వలన ప్రాప్తించిన బ్రహ్మహత్యాపాతకము నుండి స్కందుడు విముక్తుడగుట, స్కందుడు చేసిన శ్రీనివాసస్తుతి, భగవంతుడు కుమారధార స్నానకాలమును నిర్ణయించుట మొదలైన ముఖ్యవిషయములు వివరించబడినవి.

1.7. బ్రహ్మ పురాణము :

మహాపురాణములలో ఈ పురాణము మొదటిది. ఈ పురాణంలో రెండు ఖండములున్నవి. పూర్వ ఖండములో పది అధ్యాయములలోను, ఉత్తర ఖండములో రెండు అధ్యాయములలోను శ్రీ వేంకటాచల మాహాత్మ్యము ప్రతిపాదించబడినది. కొంతమంది ఉత్తర ఖండమును మరొక పురాణముగా పరిగణించడం వలన శ్రీ వేంకటాచల మాహాత్మ్యము పన్నెండు పురాణాలలో ఉన్నదని భావిస్తారు.

ఈ పురాణములో దుర్వాసుడు దిలీపునికి చెప్పిన శ్రీ వేంకటాచల వైభవము, వాయు శేషుల పరస్పర బలపరీక్ష, వేంకటాద్రిలో శేషుడు చేసిన తపస్సు, భగవంతుడు స్వామి పుష్కరిణీతీరంలో నివసించు కారణము, శంఖనృపతి వృత్తాంతం, స్వామి పుష్కరిణి మొదలగు సప్త తీర్థ వర్ణనం, శ్రీ వేంకటాచలంపైన ఉన్న అరవై ఎనిమిది తీర్థముల మహిమలను వర్ణించుట, తొండమాన్‌రాజు వృత్తాంతము, బ్రహ్మప్రార్థనతో శ్రీనివాసుడు చెప్పిన శ్రీవరాహ ప్రథమ దర్శన వృత్తాంతం, స్వామిపుష్కరిణీ తీర్థం మధ్యలో నున్న ధనదాది తొమ్మిది తీర్థముల వర్ణనం, విష్ణువర్ధనుడను బ్రాహ్మణుని వృత్తాంతము, శ్రీ వేంకటాద్రిపై వేదద్విజాడు దీపములను వెలిగించుట, సర్పాబద్ధోపాఖ్యానము, బ్రహ్మాజ్ఞతో వసిష్ఠాదులు

శ్రీ వేంకటాచలమునకు వచ్చుట, ఘోణాతీర్థంలో భగవంతుని కోసం తుంబురుడు చేసిన తపస్సు, భగవదాజ్ఞానుసారం అగస్త్యుడు వర్ణించిన తుంబురు తీర్థ మాహాత్మ్యము మున్నగు విషయములు పొందుపరచబడినవి.

1.8. ఆదిత్య పురాణము :

ఉప పురాణములలో ఆదిత్యపురాణ మొకటి. ఈ పురాణం సూత, శౌనకసంవాద రూపంలో ఉన్నది. ఇందులో అయిదు అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్య విషయములు వర్ణించబడినవి.

శ్రీనివాసవైభవం, దేవశర్మ వృత్తాంతము, శ్రీ శ్రీనివాస దివ్య మంగళ విగ్రహ సౌందర్యవర్ణనం, దేవశర్మ చేసిన శ్రీనివాసస్తుతి, భగవంతుని విశ్వరూప వర్ణనం, శ్రీనివాసుడు దేవశర్మకు వరదానము లిచ్చుట మొదలగు విషయములు ఇందు వర్ణించబడినవి.

1.9. భవిష్యోత్తర పురాణము :

ఉప పురాణములలో భవిష్యోత్తర పురాణమొకటి. ఈ పురాణం సూత,శౌనక సంవాద రూపంలో ఉంది. దీనిలో పదునైదు అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యము వర్ణించబడినది.

ఇందు వృషభాచల ప్రభావము, ఈ పర్వతమునకు వృషభాచలము-అంజనాచలము-శేషాచలము-వేంకటాచలమను పేర్లు వచ్చిన విధము, సాత్త్విక దేవతా పరీక్షార్థం భృగువు సత్యలోకాదులు వెళ్ళుట, శ్రీ స్వామి పుష్కరిణీ మాహాత్మ్యము, వేంకటాచలమునకు భగవంతుడు వచ్చుట, ఆకాశరాజు కోటలో బ్రహ్మరుద్రులు ఆవు,దూడ రూపంలో నివసించుట, శ్రీ వేంకటాచలమునకు అయోధ్య మధురాదులతో సామ్యమును వర్ణించుట, భూమినుండి పద్మావతి ఆవిర్భవించుట, పద్మావతీ శ్రీనివాసుల సమాగమము, పద్మావతి చెప్పిన

భగవంతుని లక్షణములు, భగవద్భక్తుల లక్షణములు, పద్మావతీ శ్రీనివాసుల పరిణయము, ఆకాశరాజుకు శ్రీనివాసుడు తనయందు ఎల్లప్పుడు భక్తియుండునట్లు వర మొసంగుట, తొండమాన్, వసుదానులు రాజ్యవిషయములో పరస్పరం కలహించుకొనుట, తొండమానుడు భగవంతునికి దివ్యమైన ఆలయమును నిర్మించుట, బ్రహ్మదేవుడు శ్రీనివాసుని మహోత్సవమును వర్ణించుట, కూర్మద్విజుని వృత్తాంతము, కుర్వగ్రామంలో గల భీముడను కుమ్మరి వృత్తాంతము, ఫలస్తోత్రాధ్యాయము మొదలైన విషయములు వివరించబడినవి.

1.10. స్కాంద పురాణం :

అష్టాదశ మహాపురాణములలో స్కాంద పురాణము పదమూడవది. ఈ పురాణమును బ్రహ్మాది దేవతల సమక్షంలో ఈశ్వరుడు పార్వతికి, పార్వతి కార్తికేయునికి, కార్తికేయుడు నందికి, నంది అత్రి కుమారునికి, అత్రి కుమారుడు వ్యాసునికి, వ్యాసుడు సూతునికి, సూతుడు ఋషులకు చెప్పినారు. ఈ విధంగా ఈ పురాణం లోకంలో ప్రసిద్ధిని పొందింది.

శ్రీ స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలో శ్రీ వేంకటాచల మహాత్మ్యం నలుబది అధ్యాయములలో వివరించబడినది. అందు భగవంతుని శ్వేత వరాహావతార వర్ణనం, వరాహస్వామి యొక్క మహామహిమత్వం, ఆతని వైభవం, వరాహమంత్రమును అనుష్ఠించు విధానము, దాని ఫలితము ధరణీ వరాహ సంవాద రూపంలో అభివర్ణించబడినవి.

శ్రీ వేంకటాచల క్షేత్రాదివర్ణనం, బ్రహ్మచే ప్రారంభించబడిన బ్రహ్మోత్సవవర్ణన, శ్రీ వేంకటేశ్వర వైభవము, శ్రీ వేంకటేశ్వరుని అష్టవిధ భక్తి, భగవంతుడు చేసిన భూతసృష్ట్యాదివర్ణన, భరద్వాజ మహర్షి చెప్పిన శ్రీ వేంకటాచల మాహాత్మ్య విశేషములు, పుత్రుని కొరకు అంజనాదేవి తపస్సుచేయుట, శ్రీ వ్యాసమహర్షి ఆకాశగంగ స్నానకాలమును నిర్ణయించుట, శ్రీ వ్యాసమహర్షి శ్రీ వేంకటాచలంలో చేయదగిన

దానములను చెప్పుట, భూమి నుండి పద్మావతి ఆవిర్భవించుట, శ్రీ నారదమహర్షి పద్మావతికి సాముద్రిక లక్షణములను చెప్పుట మొదలగు విషయములు వర్ణించబడినవి.

ఇంకను వేటకొరకు శ్రీనివాసుడు పుష్పాటవికి బయలుదేరుట, పద్మావతిని చూచి శ్రీనివాసుడు మోహించుట, శ్రీనివాసుడు వకుళాదేవికి పద్మావతీ పరిణయ కారణములను చెప్పుట, ఆకాశరాజు నగరమునకు వకుళమాలిక వెళ్ళుట, పద్మావతి చెలికత్తెలు వకుళమాలికకు పద్మావతీ వృత్తాంతమును చెప్పుట, పద్మావతి చెప్పిన భగవద్భక్తలక్షణములు, వకుళమాలిక చెప్పిన మీదట ధరణీదేవి మొదలగువారు పద్మావతీ శ్రీనివాసుల వివాహము నిశ్చయించుట, శుకమహర్షి శ్రీనివాసునికి ఆ విషయమును నివేదించుట, శ్రీనివాసునికి లక్ష్మీదేవి మొదలగువారు వివాహాలంకారము చేయుట, శ్రీనివాసుడు బ్రహ్మాదులతో కూడి ఆకాశరాజు నగరమునకు బయలుదేరుట, పద్మావతీ శ్రీనివాసుల పరిణయము, శ్రీనివాసుని కృపతో ఆకాశరాజుకు భక్తిరూప వరప్రాప్తి కలుగుట, శ్రీ వేంకటాచలంలోని తీర్థ మాహాత్మ్య వర్ణనం, శ్రీ వేంకటాచలము సర్వ పుణ్య తీర్థములకు ఆధారము మొదలైన విషయాలు వర్ణించబడినవి.

ఈ పురాణంలో పందొమ్మిది తీర్థములు వర్ణించబడినాయి. స్వామి పుష్కరిణి–కుమారధార–తుంబురు తీర్థం–రామకృష్ణ తీర్థం–చక్ర తీర్థం–జాబాలి తీర్థం–పాపవినాశన తీర్థం–ఆకాశగంగ– కటాహ తీర్థం– సువర్ణముఖరీ మొదలైనవి వివరించబడినవి.

ఇందులో ఇరువదిరెండు ఉపాఖ్యానములు చెప్పబడినవి. వసువను నిషాదుని వృత్తాంతము, తొండమానుడను రాజు వృత్తాంతము, భీముడనే భక్తుని వృత్తాంతము, కాశ్యప –పరీక్షితుల వృత్తాంతము, ధర్మగుప్తచరిత్రము, అర్జునుని తీర్థయాత్రా వృత్తాంతము, భరద్వాజ మహర్షి వృత్తాంతము, అగస్త్య

మహర్షి వృత్తాంతము, శంఖనృపతి వృత్తాంతము, రామానుజుడను బ్రాహ్మణుని వృత్తాంతము, సుందరుడను గంధర్వుని చరితము, కేశవుడను బ్రాహ్మణుని వృత్తాంతము మొదలైన విషయములు ప్రతిపాదించబడినవి.

1.11. వామన పురాణము :

వామన పురాణం మహాపురాణములలో పదునాల్గవది. ఈ పురాణంలో ఇరవదిఐదు అధ్యాయములలో శ్రీ వేంకటాచల మాహాత్మ్య విషయములు వివరించబడినవి.

ఇందు ప్రయాగమాహాత్మ్యము, స్కందునికి శంకరుడు బ్రహ్మహత్యావిముక్తి ఉపాయమును చెప్పుట, తపస్సు కొరకు స్కందుడు శ్రీవేంకటాచలమునకు వెళ్ళుట, శ్రీ వేంకటాచలంలో స్కందుడు తపస్సు చేయుట, సుదర్శనము శంకరుని వద్దనుండుట, చక్రాది పదిహేడు తీర్థముల మాహాత్మ్యము, వాయుదేవుడు భగవంతుని గూర్చి తపస్సు చేయుట, శేషాచలం తూర్పు దిక్కునందు అగస్త్యాది మహర్షులు అద్భుతవస్తువులను దర్శించుట, అగస్త్యాది మహర్షులు శేషాచలం దక్షిణదిశలో శంకరుని సేవించుట, అగస్త్యాదులకు విష్వక్సేనుడు భగవద్దర్శనోపాయమును చెప్పుట, శ్రీ వేంకటాచలంపై ఉన్న పుణ్యతీర్థవర్ణన, కపిల తీర్థమునకు పశ్చిమ భాగంలో నున్న పంచతీర్థ మాహాత్మ్యము, స్వామి పుష్కరిణీ మున్నగు సర్వతీర్థ మాహాత్మ్యము, శంఖనృపతి వృత్తాంతము, ఉపరిచరవసు వృత్తాంతము, బ్రహ్మదేవుడు-రుద్రుడు- సప్తర్షులు మొదలగువారు భగవంతుని స్తుతించుట, బ్రహ్మాదులకు భగవంతుడు అభీష్టవరముల నొసంగుట, మహర్షులు భగవంతుని దివ్య విమానమును దర్శించుట, శేషాద్రికివాయవ్య భాగంలో నున్న నారాయణాద్రిని వర్ణించుట, దేవజిత్తు మొదలగు అసురులు చేసిన లోకోపద్రవమును చెప్పుట, విష్వక్సేనుడు అసురులతో యుద్ధము చేయుట, భవిష్యత్తులో రాగల భగవంతుని దివ్యవిమానమును వర్ణించుట, స్వామి పుష్కరిణీతీరంలో చేయదగిన అన్నదానం

మొదలైన వాటిని చెప్పుట, వామదేవునికి బ్రహ్మదేవుడు స్వామిపుష్కరిణీ మాహాత్మ్యమును చెప్పుట, బ్రహ్మదేవుడు శ్రీ వేంకటాచలాధీశునకు చేసిన మహోత్సవ వైభవమును వర్ణించుట, స్వామి పుష్కరిణిలో మూడున్నర కోట్ల తీర్థములు వచ్చి చేరు కాలమును నిర్ణయించుట, స్వామి పుష్కరిణి తీర్థములో స్నానమాచరించుటకై శ్రీ వేంకటాచలమునకు జనక మహారాజు వచ్చుట మొదలగు విషయములు వర్ణించబడినవి.

రెండవ అధ్యాయం

రెండవ అధ్యాయం
శ్రీ వేంకటాచల వైభవం

ఈ అధ్యాయంలో వామనపురాణములో పేర్కొన్న శ్రీ వేంకటాచల క్షేత్రము యొక్క అతి ప్రాచీనత్వము, భగవదాజ్ఞతో గరుడుడు వైకుంఠము నుండి క్రీడాద్రిని తీసుకురావడం, ఆవిర్భవించిన భగవంతుని దివ్య మంగళ విగ్రహ వర్ణనం, భగవత్సేవకై బ్రహ్మరుద్రాదులు శ్రీ వేంకటాచలాన్ని చేరడం, బ్రహ్మ-రుద్ర-సప్తర్షులు, సనకాది పరమ యోగిపుంగవులు, ఇంద్రాది దిక్పాలకులు, శ్వేత ద్వీప వాసులైన సిద్ధులు చేసిన స్తుతించిన భగవంతుని స్తోత్రాలు, బ్రహ్మాదులకు భగవంతుని విశ్వరూప దర్శనం, మహర్షుల దివ్య విమాన దర్శనం, నారాయణాద్రి వర్ణనం, బ్రహ్మ వర్ణించిన శ్రీ వేంకటాచలాధీశ మహోత్సవ ప్రశంస మొదలైనవి వర్ణించ బడినాయి.

2.1. ప్రాచీన క్షేత్రం :

28 మహాయుగాలకు పూర్వమే కలి యుగంలో శ్రీ వేంకటాచలంపై వేంకటేశ్వరుడు స్వయంవ్యక్త రూపంతో ఆవిర్భవించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. పురాణముల ననుసరించి మహా యుగ కాల పరిమితి 43,20,000 సంవత్సరాలు. ఈ ప్రకారంగా తిరుమల క్షేత్రంలో శ్రీనివాసుడు 43,20,000x28=12,09,60,000 సంవత్సరాలకు పూర్వమే భక్తులను అనుగ్రహించుటకు ఆవిర్భవించినట్లు తెలుస్తున్నది[1].

---

1. డా|| రమేశన్ గారు The Tirumala Temple అను గ్రంథంలో తిరుమల శ్రీ వేంకటేశ్వర దేవాలయానికి సంబంధించిన అనేక విషయాలను , భౌగోళికస్థితుల, చారిత్రకపరిస్థితుల ప్రకారం, స్థలపురాణాల ప్రకారం వివరించినారు. అక్కడి దేవాలయ నిర్మాణం, గర్భాలయంలోని శ్రీ వేంకటేశ్వరుని మూలవిరాట్టు, మిగిలిన విగ్రహాల స్వరూప వర్ణనం, దేవాలయంలో చేస్తున్న ఉత్సవములు, పూజావిశేషాల గురించి, విజయనగర రాజుల నుంచి మహాంతుల కాలం వరకు దేవస్థానం యొక్క కార్యనిర్వహణ పరిపాలనారీతులు మొదలైన అనేక అంశాల గురించి వివరించడం జరిగింది.

ఈ విషయము వరాహ, వామన, భవిష్యోత్తర, బ్రహ్మ, బ్రహ్మాండ, పద్మ పురాణముల ద్వారా తెలియుచున్నది.

భూమండలంలో ఎన్ని తీర్థాలున్నాయో అన్ని తీర్థాలు శ్రీ వేంకటాచలంలో ఉన్నాయి. దేవదేవుడైన శ్రీ మహావిష్ణువు వైకుంఠమును వదలి వేంకటాచల క్షేత్రములో అర్చావతార రూపంలో వెలయుటకు ఇక్కడికి వేంచేసినాడు. వేంకటాచల క్షేత్రము సకల జీవుల సంచిత పాపకర్మలను దహింప చేసి, పుణ్య కర్మల ద్వారా పవిత్రతను చేకూరుస్తుంది[2].

ఆ పవిత్ర పర్వత శ్రేష్ఠంపై నివసిస్తున్న శంఖ చక్ర ధరుడు, ప్రకాశమానుడు, పీతాంబర ధరుడు, కౌస్తుభాలంకృత వక్షస్థలం కలవాడు, భక్తులకు అభయప్రదుడు. దేవాదిదేవుడు, విశాలాక్షుడు, వేదవేద్యుడు, ఆదిపురుషుడు అయిన శ్రీనివాసుని సేవించుటకు అంగ,కోసల, కర్ణాటక, కాశీ, గుర్జర,చోళ, కేరళ,పాండ్య దేశాల వారు ప్రతి సంవత్సరం వస్తూంటారు. దేవతలు, ఋషులు, సిద్ధులు, సనకాదులైన యోగులు శ్రీనివాససేవార్థం వస్తూంటారు[3].

శ్రీదేవి, భూదేవీ సమేతుడైన శ్రీమన్నారాయణుడు పవిత్రమైన వృషాచలంలో తన నివాసం కనిపించక వృక్ష సమూహములతో కూడిన, ఆరు ఋతువుల

---

2. ఈ విషయము విష్ణుభక్తులలో అగ్రగణ్యుడైన నమ్మాళ్వార్ పేర్కొన్నట్లు టి.కే.టి. వీరరాఘవాచార్యులు రచించిన 'History of Tirupati' అనే గ్రంథంలో చెప్పబడింది.
3. శ్రీ. ఆర్. రామ్మూర్తి శర్మ రచించిన 'ఆదిత్య పురాణాంతర్గత శ్రీ వేంకటాచలమాహాత్మ్యము' యొక్క ఉపోద్ఘాతంలో శ్రీ వేంకటాచల క్షేత్ర ప్రసిద్ధి, మాహాత్మ్యం, భగవద్వైభవ విశేషాలు వివరించడం జరిగింది.

శ్రీ. టి. రాఘవయ్య రచించిన 'తిరుమల తిరుపతి వేంకటేశ్వర వైభవము'లో సప్తగిరుల ఔన్నత్యాన్ని, ప్రకృతి రమణీయతను, తీర్థాలు, సరస్సులు శిలోన్నతిగతులను వివరించి చెప్పడం జరిగింది.

సంయోగముతో స్వామి పుష్కరిణీ తీరంలో కోటి మన్మథ రూపుడై, పదహారేళ్ళప్రాయుడై తిరుగుతున్నాడు. చాలాకాలం తరువాత గరుడుడు స్వర్ణరత్నమండితమైన శ్రీ వేంకటాచలాన్ని తీసుకొని వైకుంఠానికి వెళ్ళవలెనని భావించాడు. అది తెలుసుకున్న నారాయణుడు చిరునవ్వుతో గరుడునితో పక్షిరాజా! ముఖ్యమైన కారణం చెబుతాను, విను. మనమంతా ఈ పర్వతంపైన నివసిద్దాం. శేషుడా! నీవు గరుడుని క్రింద పర్వతరూపం ధరించి నిలువుము. నేను జగద్రక్షణ కారణంతో ప్రళయ కాలాంతం వరకు ఇక్కడే నివసిస్తాను.

తావన్నిత్యం మమ ప్రీత్యై శైలమాశ్రిత్య సర్వతః ।
ఆకల్పాన్తం వసామీహ జగత్పాలన కారణాత్ ॥ అని పలికాడు.

2.2. భగవదాజ్ఞచే గరుడుడు వైకుంఠం నుండి క్రీడాద్రిని తెచ్చుట :

ప్రళయ కాలంలో లోకమంతా జలమయమయింది. ఆ సమయంలో భూమి నీటిలో మునిగింది. అప్పుడు శ్రీమహావిష్ణువు స్వయముగ శ్వేత వరాహ రూపాన్ని ధరించి, ప్రళయ జలంలో మునిగి, హిరణ్యాక్షునితో యుద్ధం చేసి, అతనిని వధించి, భూదేవిని రక్షించి బ్రహ్మదేవుని మరల సృష్టిచేయుటకు ఆజ్ఞాపించాడు. అనంతరం భక్తులను అనుగ్రహించుటకు, జగద్రక్షణకు శ్వేత వరాహ రూపుడైన మహావిష్ణువు ఈ లోకంలో కొంతకాలం నివసించుటకు ఇష్టపడినాడు. శ్రీ మహావిష్ణువు ఆజ్ఞతో గరుత్మంతుడు వైకుంఠమునకు వెళ్ళి శేషరూపము, అతి పవిత్రము, దర్శనమాత్రం చేత మోక్షదాయకమునైన 'నారాయణగిరి' అనేపేరుగల క్రీడాద్రిని తెచ్చి భగవంతుడు సూచించిన స్థలంలో స్థాపించినాడు. శ్వేత వరాహ రూపుడైన విష్ణువు స్వామి పుష్కరిణి పడమటి తీరంలో ఉన్న దేవాలయంలో నిలిచినాడు. అచిరకాలంలోనే స్వామి పుష్కరిణికి దక్షిణ భాగంలో ఒకానొక విమానంలో శంఖ చక్రధరుడైన శ్రీనివాసుడు నివసిస్తాడు. అందువలన నీవు కూడా నా ప్రీతి కొరకు ఈ పర్వతాన్నాశ్రయించి నివసించు. ప్రతి యుగంలోను ఈ వృషాద్రి అనేక పేర్లను కలిగి ఉంది.

కృతే వృషాద్రిం వక్ష్యన్తి త్రేతాయాం గరుడాచలమ్ ।
ద్వాపరే శేషశైలం చ వేంకటాద్రిం కలౌ యుగే ॥

కృత యుగంలో ఈ పర్వతం వృషాద్రి అని, త్రేతా యుగంలో గరుడాద్రి అని, ద్వాపర యుగంలో శేషాద్రి అని, కలి యుగంలో వేంకటాచలమని పిలువబడింది. 'వేం'కారమంటే 'అమృత బీజ'మని 'కట'మంటే 'ఐశ్వర్య'మని అర్థం. అమృతై శ్వర్యములను ప్రసాదించేది కావున 'వేంకటాద్రి'గా పిలువబడుతున్నది.

వేంకారో ఽ మృతబీజన్తు కటమైశ్వర్యముచ్యతే।
అమృతైశ్వర్య సంఘత్వాద్వేంకటాద్రి రితి స్మృతః ॥

ప్రతి యుగంలోను ఋషులు, సామాన్యప్రజలు ఈ నారాయణాద్రిని అనేక పేర్లతో పిలుస్తారని చెప్పి, ఆదిశేషుని, గరుత్మంతుని ఆదేశించి శ్రీనివాసుడు శ్రీదేవితో కూడ దేవ,మానవ రాక్షసులకు ఆరాధ్యుడై స్వామి పుష్కరిణీ తీరంలో నివసిస్తున్నాడు.

2.3. దివ్య మంగళ విగ్రహావిర్భావం :

కుంభసంభవుడైన అగస్త్యుని నుండి వినిన దాన్ని చెబుతున్నానని జనకునుద్దేశించి వామదేవుడు చెప్ప నారంభించాడు. అవ్యక్తరూపుడైన శ్రీమన్నారాయణుని రూపము ఉదయించుచున్న సూర్యుని వంటి మంగళప్రదాలైన నేత్రములతో కూడినది, రత్నములతో చెక్కబడిన విచిత్రములైన కిరీటాలతో కూడినది, ప్రసన్నమైన అనేక ముఖములతో కూడినది, పగడములతో, మణులతో చెక్కబడిన బంగారు కుండలములతో, అనేక రత్నఖచితాలైన ఆభరణములతో అలంకరింపబడినది, శంఖము వంటి మెడ,విశాల వక్షస్థలము, దీర్ఘబాహువులు కలిగినది, అనేకాయుధములను ధరించినది, నల్లనై దీర్ఘమై, అప్రాకృతములైన మధ్యాహ్న సూర్యుని వలె వెలిగేటటువంటి,మృదువైన స్పర్శగల గోళ్ళ మొనలు కలిగినది, శుభ రేఖలు కలిగి, అరుణ వర్ణము కలిగి, సమానంగా మృదువుగా

ఏనుగు తొండములను పోలియుండి, సప్త సముద్రములు, సప్త కులపర్వతములతో కూడినట్టి పాతాళాది లోకములు కలది, దేవ రాక్షస మనుజులతో కూడినది, సప్త లోకములతో కూడినది, సప్త ద్వీప సంయుతము, సకల చరాచరములతో నిండిన బ్రహ్మాండమును పరిరక్షించేవి, రాక్షస సంహారము చేసేవి, విష్ణుభక్తుల దుఃఖమును పోగొట్టేవి, ఏ భుజ బలము నాశ్రయించి దేవతలు రాక్షస భయము లేక ఉన్నారో అటువంటి శ్రీమన్నారాయణుని బాహువులు ఉదయాచలము నుండి ఉదయించుచున్న సూర్యకిరణముల వలె ప్రకాశించిన రత్న సమూహములతో ప్రకాశిస్తున్న శరీరమును, ఎఱ్ఱగా వుండి అందమైన నేత్రములు కలిగి కోమలత్వము కలిగిన కుండలములతో ప్రకాశించే అందమైన గండస్థలములు కలిగి శోభనమై, ప్రకాశించే లలాటము కలిగి, సుందరములైన ధనుస్సు వంటి ప్రకాశించే కనుబొమలతో, ఐరావతమనే ఏనుగు యొక్క తొండములవలె బలిసిన తొడలతో, ప్రకాశించే మణులు, రత్నములతో ధ్వనించే అందెలు కలిగిన మంచి బంగారంతో చేసిన యజ్ఞోపవీతముతో, వేలమంది సూర్యుల వంటి కాంతి కలిగి, మహైశ్వర్యకరమై, మేరుపర్వతమును పోలిన, నల్లని కొండవలె ఎత్తైన వక్షస్థలము కలిగి, దీర్ఘమై, విశాలమైన నేత్రములు కలిగి పీతాంబరమును ధరించి దివ్య చందనముతో భుజములపై నుండి వ్రేలాడే దివ్య వైజయంతి మాల కలిగి, మెరపులతో ప్రకాశించే మేఘముల వరుస వలె శ్రీమన్నారాయణుని దివ్య దేహము విరాజిల్లింది.

ఇంకను బంగారుమయమై, కాంతివంతములు, మంగళకరములు, అందమైన కాంతులు గల చిరుగజ్జెల వరుసలతో ధ్వనిచేస్తూ, మణుల కాంతులతో పది దిక్కులను ప్రకాశింపజేస్తూ, ఎఱ్ఱనై, అనేకవేల సూర్యుల వలె రాజిల్లునదై, ఉదయిస్తూ చంద్రుని వలె తెల్లనై కొనలయందు ఎఱ్ఱబారిన గుండ్రని గోళ్ళు కలిగిన ఎత్తైన పాదపద్మములతో శోభించేవాడు, అంకుశము, ధ్వజము, చక్రము, పద్మము, శంఖము, వజ్రముల గుర్తులు పాదముల క్రింది భాగములో కలవాడు, సూర్యకిరణముల వలె తేజోవంతములైన ముత్యముల, వజ్రముల కాంతులతో పాదముల వరకు వ్రేలాడు దండలు గలవాడు,

వివిధ రకముల రత్నములతో పొదగబడిన ఉంగరములు కల చేతివ్రేళ్ళు కలవాడు, ఉంగరముల వలె గుండ్రంగా చుట్టుకొని మిక్కిలి నల్లవిగ, అతి మృదువుగా వుండి అందంగా కనిపించే కిరీటం నుండి బయటకు వచ్చిన ముంగురులతో, మేఘములతో కప్పబడిన చంద్రుని వలె నుండు ముఖము కలవాడు, అనేక రకములైన రత్నములతో కూడిన బంగారు యజ్ఞోపవీతమును ధరించినవాడు, దివ్య మాలికలతో ప్రకాశించేవాడు, అనేకాభరణాలతో అలంకరింప బడినవాడు, విశాల నేత్రుడు, ఆశ్చర్యకరమైన తన తేజస్సుతో అన్ని దిక్కులను ప్రకాశింపజేసేవాడు, తూర్పున ఉదయించే సూర్యుని వలె అన్ని దిశల నుండి బంగారుమయ తేజస్సులతో ప్రకాశించేవాడు నైన శ్రీమన్నారాయణుని తేజోవంతమైన రూపము అద్భుతమై ప్రకాశించింది.

కనులు మిరుమిట్లు గొలిపే ఆ కాంతిని మునులు గాని, దేవతలు గాని చూడలేకపోయారు. అతని నుండి వెలువడిన తేజస్సుతో దేవాసుర గంధర్వ సముపేతమైన జగత్తంతా తపింప చేయబడింది. ఆ రూపము సూర్య సమాన తేజస్సు కలిగి, బంగారు మయమై, వేల కొలది భూషణములతో కూడి యున్నది. చేతులలో తీక్షణాలైన ఆయుధాలు మండుతూ ప్రకాశిస్తున్నాయి. చలిస్తూ, నిర్మలములై, చూచుట కింపైన దీర్ఘములైన చూపులనే బాణములు, కనుబొమలనే ధనుస్సు నుండి వెలువడుచున్నవి. ఎర్రని పద్మనేత్రములు తేజోవంతాలై చక్కని కాంతి కలిగి శోభాయుక్తమైన రెప్పలతో ప్రకాశిస్తున్నాయి. అటువంటి శ్రీమన్నారాయణుని చూపుతో వేల కొలది రాక్షసులు, దానవులు భయపడి అరుస్తూ యమలోకమును చేరినారు. మానవులు ఈ చూపుతోనే పొంద శక్యముగాని దేవత్వమును, యితరాలైన కోరికలను, మోక్షమును పొందుతున్నారు. ఏ చూపు కొరకు విష్ణుభక్తులు రాత్రింబగళ్ళు ఎదురు చూస్తున్నారో ఆ చూపులు చక్కని కాంతితో ప్రకాశిస్తున్నాయి. ఆ దేవ దేవుని చేతిలో ప్రళయకాలాగ్ని సమాన కాంతి గలవైన వేల కొలది ఆయుధములు మహాబలవంతులు, దేవతలకు శత్రువులైన

రాక్షసులకు భయము గొల్పుతూ భక్తులకు అభయ మిస్తున్నాయి. చరాచరాత్మక ప్రపంచము తనకు శరీరముగా కల ఆ శ్రీమన్నారాయణుడు అనేక వర్ణములు కల కిరీట మాలికలతో ప్రకాశిస్తున్నాడు.

2.4. మహర్షుల నమస్సులు :

దేవతలు, మునీంద్రులు, సిద్ధులు, చారణులు, యోగులు, గంధర్వులు, విద్యాధరులు, యక్షులు, వాలఖిల్యులు, తపస్సంపన్నులు, నాగేంద్రులు, రాక్షసులు,కింపురుషులు ఆశ్చర్యకరమైన శ్రీమన్నారాయణుని రూపమును పూర్వము చూడలేదు. అటువంటి దివ్యమైన రూపమును అగస్త్యాది మహర్షులు దర్శించారు. అనేక విధములైన రత్నములతో పొదగబడిన కిరీటముతో ప్రకాశిస్తూ, వ్యాపిస్తున్న సుందర వదనము కలిగి, వ్రేలాడుతున్న కుండలములతో అలంకరింప బడిన ముఖమును తమ నేత్రములతో తాగుతున్న వారివలె రెప్పపాటు లేక సంతోషముతో చూస్తూ, మిక్కిలి ఆర్తితో, కలవరపాటు గల మనస్సుతో వెంటనే శ్రీమన్నారాయణుని చూసి భక్తి వినమ్రులై శిరములతో నమస్కరించారు. బృహస్పతి, అగస్త్యుడు, శుక్రాచార్యుడు, మనువు మొదలగువారు గరుడారూఢుడై మేరుపర్వత శిఖరముపై నీలమేఘము వలె ఉదయించిన శ్రీమన్నారాయణుని భక్తితో నమస్కరిస్తూ అనుగ్రహించమని అనేక విధముల ప్రార్థించారు.

ఈ సందర్భంలో ఆకాశములో ఉన్నవారు పాంచజన్యమును పోలిన బంగారాభరణములతో కూడిన వందలు, వేలకొలది శంఖములను పూరించారు. స్వర్ణ రత్న ఖచితమైన మద్దెలలు మొదలైన వాద్యములను మ్రోగించారు. గొప్ప శంఖనాదములతో వాయిద్యముల ధ్వనులతో జగత్తంతా నిండిపోయింది. రాక్షసులందరు చంచల చిత్తులైనారు. నారాయణాద్రిలో నివసించే వారంతా సంతోష భరితులై ప్రశాంతచిత్తు లైనారు. వేంకటాచలంలో నివసించే సింహ, పక్షి, మృగాదులు ఆ శబ్దం విని వెంటనే గుంపులుగా లేచినై.

2.5. బ్రహ్మరుద్రాదులు భగవంతుని సేవించుటకై వేంకటాచలమునకు వెళ్ళుట :

ఆ గొప్ప శబ్దాన్ని విని లోకపితామహుడైన బ్రహ్మ శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమైనట్లు తెలుసుకొని అతని సన్నిధానమునకు మునులు, దేవతలు, గంధర్వులతో కూడి బయలుదేరాడు. త్రినేత్రుడు, త్రిపురాసుర సంహారియైన ఈశ్వరుడు జ్వలిస్తున్న సూర్య సమాన కాంతితో జటా సమూహములతో కూడి భగవదావిర్భావము తెలుసుకొని భగవంతుని దర్శించుటకు దూర్వాసునితో, నందినీ ధేనువుతో కూడి విష్ణుసన్నిధికి చేరాడు. దేవతలకు ప్రభువైన ఇంద్రుడు కూడా ఆ శబ్దాన్ని విని శ్రీమన్నారాయణుని దర్శించుటకు దేవతలతో తరలి వచ్చాడు. వీరుడైన విష్వక్సేనుడు శంఖధ్వనిని విని వెంటనే లేచి పరాక్రమవంతులు, నిర్మలాంతఃకరణులైన ఏడు మంది మంత్రులతో కూడి భగవంతుని సమక్షమునకు వచ్చాడు. సనక సనందాది యోగులు, సప్తర్షులు ఆ శబ్దమును విని అక్కడికి చేరారు.

వాయవ్య దిగ్భాగంలో పర్వత శిలాతలంపై కూర్చొని చూచువారి కాశ్చర్యము కలిగించే ఏ పురుషుని చూచినారో అతడు కూడా శంఖధ్వనిని విని నారాయణుని సన్నిధికి చేరాడు. ప్రజాపతియైన బ్రహ్మ, పూజ్యుడైన శంకరుడు, జ్ఞానాది గుణ సంపన్నుడైన విష్వక్సేనుడు, దేవలోకాధిపతియైన దేవేంద్రుడు, మననశీలులైన సప్తర్షులు, సనకాది యోగీంద్రులు, మునులు చూచినవాయవ్య దిశలోని పురుషుడును శ్రీమన్నారాయణుని సన్నిధి చేరి మిక్కిలి భక్తితో సంతుష్టాంతరంగులై గరుడారూఢుడైన శ్రీమన్నారాయణుని దర్శించారు. మేరు పర్వత శిఖరముపై నీల మేఘము వలె నున్న విశ్వమూర్తి, విశ్వవ్యాపియైన శ్రీమన్నారాయణుని 'దేవా! సర్వోత్కృష్టుడవై యుండు'మని పలుకుతూ వెంటనే నేలపై బడి లేచి శిరస్సు వంచి నమస్కరించారు. 'పరాత్పరా! అనుగ్రహించుము, అనుగ్రహించు'మని మరల మరల ప్రార్థిస్తున్న బ్రహ్మాది దేవతలు, తపస్వులులైన మునీంద్రులు, శ్వేత ద్వీప

నివాసులైన సిద్ధులు, ప్రళయ కాల మార్తాండుని వలె ప్రకాశిస్తున్న శ్రీమన్నారాయణుని ప్రకాశముతో తపింప చేయబడి అతని రూపాన్ని తమ నేత్రములతో చూచుటకు అశక్తులై కనులు మూసుకున్నారు.

2.6. బ్రహ్మదేవుడు చేసిన స్తుతి :

ఈ విధంగా దేవాది దేవుడైన విష్ణువు యొక్క తేజస్సుతో పీడింపబడి బ్రహ్మ దేవ నాయకుడు, నాశరహితుడు, గరుత్మంతు నధిష్ఠించిన వాడునైన శ్రీమన్నారాయణుని ఈ విధంగా నుత్తించాడు -

"జగత్ప్రభూ! వేయి ముఖములు, నేత్రములు కలవాడా! సుందరములై, దివ్యములైమెరయుచున్న వేయి కిరీటములు ధరించిన పురుషోత్తమా! నమస్కారము. సుందరములై, దివ్యములై యినుపకట్లు గల గడియల వలె నున్న భుజములు కలిగి, ప్రపంచ నియంతవై అన్నిటా వ్యాపించియున్న నీకు నమస్కారము. అణువులలో అణువుగా, గొప్పవైన వాటిలో గొప్పవాడిగా ఉన్నవాడవు, వరాల నిచ్చేవాడవు, పరమేశ్వరుడవు, శ్రీమన్నారాయణుడవైన నీకు నమస్కారము. యోగీంద్రులచే సేవింపబడే వాడవు, జనలోకనివాసి, సర్వపోషకుడవైన నీకు నమస్కారము. పరాత్పరుడవు, పురాణపురుషుడవు, దేవాధిపతివి, ప్రాకృత సత్త్వ రజస్తమో గుణములు లేని నారాయణా! నీవు అనుగ్రహించుము. ప్రాణులన్నింటికి శుద్ధి నొసంగేవాడవు, సకల ప్రాణులచేత అంగీకరింప బడినవాడవు, ఈ ప్రపంచంలో ప్రాణుల కృత్యముల కన్నిటికి సాక్షిగా నుండేవాడవునైన నీకు నమస్కారము. చలించే విశాల నేత్రములు కలవాడవు, సకల శాస్త్రములచే పవిత్రుడవని, సర్వేశ్వరుడవని చెప్పబడే నీకు నమస్కారము. సకల ప్రాణులకు అంతరాత్మగా నుండువాడవు. కారణములకు కారణమైన వాడవు, సర్వలోక స్వామియైన నీకు నమస్కారము. వేదముల అంతము తెలుసుకున్నవాడవు, ప్రజలకు రక్షకుడవు నీవే. మునీంద్రులు కాని, దేవతలు కాని, రాక్షసులు కాని,

నేను గాని రుద్రుడు గాని నీ స్వరూపము తెలియజాలము. నీవే ప్రసిద్ధమైన గమ్యస్థానము. ఇంద్రాది దేవతలు కూడా నీవే అన్నిటికి మూల మన్నారు. నేను నీ శుద్ధమైన శాశ్వత స్థానమును స్తుతింపలేను. అచ్యుతా! సర్వేశ్వరా! నీ గుణములను నేను వర్ణించలేను. నీ కరుణా కటాక్షములచే నన్ను కరుణించు".

2.7. శివుడు చేసిన స్తుతి :

బ్రహ్మ స్తుతించిన తరువాత శివుడు అవ్యక్తరూపుడు, తన భక్తులను సంసార సాగరమున పడనీయనివాడు, పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని ఈవిధంగా స్తుతించాడు –

"ఉత్కృష్టులైన బ్రహ్మాదులకు, నికృష్టులైన మానవులకు ప్రభువైనవాడవు, పురాణ పురుషుడవు, దుర్మార్గులైన రాక్షసులను సంహారించినవాడవు, జగత్తును సృష్టించి, పాలించే వాడవు, తొమ్మిది మంది బ్రహ్మలను సృష్టించిన వాడవు, శాంత దృష్టికలవాడవు, భక్తుల ఆపదల బాపి, అభీష్టము నిచ్చేవాడవు, పరబ్రహ్మ స్వరూపుడవైన నీకు నమస్కారము. నిత్యమైనవాడవు, అంతటా వ్యాపించి యుండువాడవు, బ్రహ్మ రుద్రులకు ప్రభువైన వాడవు, సకల ప్రాణుల కధిపతియైన వాడవు, ప్రధానకారణభూతుడవు, సర్వ ప్రాణిసృష్టికి కారణమైనవాడవు, నిత్యసూరులు ఏ శాశ్వతమైన ఉత్కృష్టస్థానమును సేవిస్తున్నారో ఆ పరస్థానము పరబ్రహ్మము నీవే కదా! వేయి మంది సూర్యులతో సమానమైన తేజోవంతుడవైన నీకు నమస్కారము. మునీంద్రులు అనేక వందల సంవత్సరములు నిన్ను పూజించి నీ అనుగ్రహము వల్ల ఉపాస్యమైన నీలో లీనమవుతున్నారు. ఇంద్రుడు కూడా నూరశ్వమేధ యాగములతో నిన్నే పూజించి దేవాధిపతి అయ్యాడు. బ్రహ్మ వేయి అశ్వమేధ యాగములతో అర్చించి, శారీరక మానసిక దుఃఖము లేని దివ్యమైన బ్రహ్మపదమును పొందెను. నేను సర్వమేధ యాగము చేత నిన్ను ఆరాధించి దేవతలెవరూ పొందలేని దేవాధిపత్యాన్ని పొందితిని. జగదాధారుడవైన నీవు

జగత్తునకు ఉపాయము, ఫలమును అయినవాడవు. నీవే జగత్స్రష్ట, జగత్సంహర్త. శోకవ్యాధిని పోగొట్టి మోహమును తొలగించే వాడవు. మహామాయా స్వరూపుడవు, సహస్ర వదనుడవు, సహస్రాక్షుడవు, సకల లోక నాథుడవు, సర్వలోక రక్షకుడవైన ఓ మహావిష్ణూ! చీకటి వృక్షముల రంగును పోలిన రంగును కలిగి, అనేక బాహువులు, ముఖములు, నేత్రములు కల, పలు విధ రత్నములచే కూడి ప్రకాశించే కిరీటములతో ఒప్పుచున్న నీ రూపమునకు నమస్కారం".

2.8. మహర్షులు చేసిన స్తుతి :

ఆ తరువాత మహర్షులు భగవంతుని ఈ విధంగా స్తుతించారు – "కృష్ణావతారా! పరబ్రహ్మ! షడ్గుణపూర్ణా! పరమాత్మా! సకల ప్రాణి కోటిని రక్షించుటలో గొప్ప నైపుణ్యము కలవాడా!సర్వజ్ఞుడా! వసుదేవ పుత్రుడా! భక్తాభీష్టముల నెరవేర్చువాడా! తామరరేకుల వంటి నేత్రములు కలవాడా! జగదాధారా! అచ్యుతా! నాశరహితా! ఇంద్రియముల నియమించువాడా! సర్వము శరీరము వలె అభిమానించి అంతటను వ్యాపించేవాడా! పద్మముల మాలికను ధరించిన వాడా! నీకు నమస్కారము. వేయి పడగలతో ప్రకాశిస్తూ, స్వచ్ఛమైన వేయి మంది సూర్యులతో సమాన కాంతి కలిగిన శేషపాన్పుపై యోగనిద్రతో విరాజిల్లుతున్న జ్ఞాన శక్త్యాది కల్యాణ గుణములు గలవానికి నమస్కారము. నిత్యసూరులు కాని, యోగీంద్రులు కాని ఏ రూపమును చూడజాలకున్నారో అటువంటి పాలసముద్రమున పవళించియున్న లోకనాథునకు నమస్కారము. దుఃఖపీడితులమైన మేము శరణు పొంద దగినవాడవు, సకల లోక నియంతవు నైన నిన్ను శరణు కోరుతున్నాము. నమస్కరించినవారి ఆపదలను బాపువాడా! వేయి సూర్యులతో సమాన కాంతి గల స్వామీ! మమ్ములను రక్షించు. కాంతులతో దేదీప్యమానమై వెలుగుతున్న నీ ఈ రూపమును చూడలేము. మందస్మిత వదనారవిందా! కరుణారస సంప్లావిత నేత్రా! నీవే శరణ్యుడవు. దేవాధిపతివి, ప్రళయకాలాగ్నిహోత్ర

సమాన పరాక్రమోపేతుడవు, జ్వలించు చున్న ముఖనేత్రములు కలిగిన వాడవు, వేదములచే నైన తెలియ శక్యము కాని స్వరూపుడవు, పురాణ పురుషుడవునైన నీకు నమస్కారము".

2.9. సప్తర్షులు చేసిన స్తుతి :

తేజోవంతుడైన బృహస్పతి, భగవద్భక్తుడైన ఉపరిచరవసువు, పరాక్రమశాలురైన ఇంద్రాదులతో కూడి సప్తర్షులు భగవంతుని ఈ విధంగా స్తుతించారు -

"సకల జగదంతర్యామీ! నీవే బ్రహ్మలో అంతర్యామిగా వుండి సృష్టించే వాడవు, రుద్రునిలో వుండి సంహరించే వాడవు, సూర్యచంద్రులలో అంతరాత్మగా వుండి వెలిగించేవాడవు, అశ్వినీ దేవతలకు వాయువునకు అంతర్యామిగా వున్నవాడవు, వేయి సూర్యులను పోలిన చక్రము చేతియందు ధరించిన నీకు నమస్కారము. ఎల్లప్పుడు శంఖమును- కిరీటమును-కౌస్తుభమును ధరించువాడవు, నల్లని మేఘము వంటి శరీరము కలవాడవు, పరబ్రహ్మవునైన నీకు నమస్కారము. శ్రేష్ఠమైన ఖడ్గము-గద-చాపము-శక్తి- చిల్లకోలను హస్తముల యందు ధరించిన వాడవు, ప్రకాశించే ఆయుధములను ధరించిన వాడవు, జాజ్వల్య మానమైన శరీరము కలవాడవు, సర్వయజ్ఞ భోక్తవు, ఫలప్రదుడవు, మెరుస్తున్న కుండలములు ధరించినవాడవు, పద్మము నాభియందు కలవాడవు, విశ్వరూపుడవు, ఉత్కృష్ట-నికృష్ట ప్రాణులకు అధిపతివి, శత్రు భయంకరమైన శరీరము కలవాడవు, కాలనేమి, హిరణ్యాక్ష, హిరణ్యా కశిపులను సంహరించిన నరసింహుడవు, పుట్టుక లేని వాడవు, కమలము నాభియందు కలవాడవు. వరాల నిచ్చువాడవు. శార్ఙ్గము ధరించిన వాడవు. ఆయుధములన్నిటితో కూడిన దోషరహితమైన నీ విశ్వరూపమునకు నమస్కరిస్తున్నాము. గొప్పదైన నీ అనాది రూపమును బ్రహ్మ అయినా తెలుసుకోలేడు".

2.10. సనకాదులు చేసిన భగవత్స్తుతి :

సప్తర్షులు స్తుతించిన తరువాత సనకాది యోగీంద్రులు భగవంతుని ఈ విధంగా స్తుతించారు –

"యజ్ఞస్వరూపా! అక్షరుడా! శంఖధారీ! అవ్యయా! చక్రధారీ! పుండరీక విశాలాక్షా! పరమాత్మా! అచ్యుతా! భూదేవిని కోరమొనపై ధరించినవాడా! సర్వోత్కృష్టుడవై విరాజిల్లుము. సకలాభీష్టప్రదాతా! అందరి హృదయములలో అంతరాత్మగా విలసిల్లువాడా! బ్రహ్మ పుట్టుటకు కారణమైన పద్మమును నాభియందు కలవాడా! ఎవరిచేత కూడా జయింపబడని వాడా! నీ భక్తులకు పూజ్యత నొసంగువాడా! మోహింపజేయు నీ మాయతో దేవతలు కూడా మోహితులవుతున్నారు. వివిధ రత్న జటితమైన బంగారు కిరీటము కలవాడవు, ఎవరిచే గాని తెలియ బడజాలని రూపము కలవాడవు, యోగులచే ధ్యానింపబడు వాడవు, సర్వజ్ఞుడవు, ఆది బ్రహ్మవు, పరబ్రహ్మ స్వరూపుడవు, వరప్రదాతవు, వేదములచే గాని యితర ప్రమాణములచే గాని తెలియబడని వాడవు, శ్రీదేవిని వక్షస్థలంలో ధరించినవాడవు, శ్రియఃపతివి, ఇంద్రియములను నిగ్రహించినవాడవు, భక్తులకు మోక్షము నిచ్చువాడవు, లోకపాలురను రక్షించువాడవు, పీతాంబరధారివి, పురుషోత్తముడవు, విశ్వరూపుడవు, సకల లోకనివాసివి. జగన్నియామకుడవు, పద్మలోచనుడవు. లోకంలో నీవు అంతర్యామిగా లేని వస్తువు ఒకప్పుడైనా లేదు. స్వచ్ఛమైన సూర్యుని వలె ప్రకాశించే కిరీటము, హారములచే విరాజిల్లుచున్నవాడవు, చక్కని ఊరువులు కలవాడవు. జరాది దోషములు లేనట్టిది, నిర్మలము, శోకరహితము, దేవ మనుష్యాదులచే ఇంతకు ముందెన్నడూ చూడబడనిది, మెరుపువలె మెరుస్తున్న, గొప్ప తేజోవంతమైన నీ రూపమునకు నమస్కారము".

2.11. ఇంద్రాది దిక్పాలకులు చేసిన స్తుతి :

సనకాదులు స్తుతించిన పిమ్మట దేవేంద్రాది దిక్పాలకులు సకల ప్రాణులకు ధారక పోషకముల నిచ్చి వృద్ధిచేయించు సంకల్పము కలవాడైన శ్రీమన్నారాయణుని శిరస్సులతో నమస్కరించి ఈ విధంగా స్తుతించారు –

"విశ్వరూపుడవు, పీతాంబరధారివి, జగదాధారుడవు, శార్ఙ్గ ధరుడవు, నందక ఖడ్గధారివి, మధు కైటభ హారివి, రాక్షసులను ప్రళయ కాలాగ్ని చక్రముతో సంహరించినవాడవు, సమస్త కల్యాణ నిధివి, వరములు కోరేవారికి వరప్రదాతవు, యోగులకైనా కనిపించని వాడవు, భక్తిచేత మాత్రమే దర్శన మిచ్చేవాడవు, పరబ్రహ్మ స్వరూపుడవు, యజ్ఞ స్వరూపుడవు, ఎల్లప్పుడు శుభకరుడవు, శ్రీవత్సాంకితుడవు, పరాక్రమోపేతులైన రాక్షసులకు భయంకరుడవు, నిత్యము శుభాల నిచ్చేవాడవు, మా కందరికి స్వర్గాన్నిచ్చేవాడవు, శ్రేష్ఠుడవు, చలించనివాడవు, నాశ రహితుడవు, శరణు పొందదగినవాడవు, క్షీరసాగరశాయివి, యోగ రూపుడవు, దామోదరుడవు, క్షయవృద్ధి హీనుడవు, నిర్గుణుడవు, ఇదమిత్థంగా చెప్పలేని సాటిలేని శరీరివి. అచింత్యుడవు, అజరామరుడవు, ప్రాకృత రూపము లేనివాడవు, నిర్మలుడవు, సర్వ నియంతవు, నిశ్చలుడవు, సర్వ వ్యాపివి, ఉత్కృష్ట స్థానము నీవే. నీ పూర్వ యథార్థ రూపము తెలియదు. ఇపుడు మాకు ప్రత్యక్షమొనరించిన రూపమును కూడా తెలియలేము. ప్రపంచమును అన్ని విధాలా చూడ గలిగినవాడా! సృష్టిస్థితి లయ కారకుడా! సర్వవ్యాపీ! జగద్రూపా! అనుగ్రహించుము".

2.12. శ్వేత ద్వీపవాసులు చేసిన స్తుతి :

ఇంద్రాదులు స్తుతించిన తరువాత, శ్వేత ద్వీపవాసులైన సిద్ధులు ఆవిర్భవించిన దేవదేవుని ఈ విధంగా స్తుతించారు –

"ఆది పురుషుడవు, అందమైన తొడలు, భుజములు కలవాడవు, పుట్టుకలేనివాడవు, దేవాదిదేవుడవు, సృష్టికర్తవు, అనాది యైన శ్రీమన్నారాయణునికి

మేము నమస్కరిస్తున్నాము. ఏ వరాహ రూపియైన భగవంతుని కోరల మొనలతో ఉద్ధరింప బడిన భూమాత దేవ దానవ సహితమైన ప్రపంచాన్ని భరిస్తున్నదో, భక్తుల కభీష్ట ప్రదాత ఎవరో, సర్వాంతర్యామియై ఎవరు విరాజిల్లుతున్నారో, ఎవరి అనుగ్రహంచేత సకలైశ్వర్యములు లభ్యమవుతున్నాయో, అటువంటి శ్రీమన్నారాయణునికి నమస్కరిస్తున్నాము. రాక్షసాంతకుడవు, శ్రేష్ఠుడవైన నీ రూపము ఈ ప్రపంచమంతా వ్యాపించింది. ప్రపంచమునకు ఐశ్వర్యదాయకుడవై, సర్వేశ్వరుడవైన నిన్ను స్తోత్రము చేస్తున్న మేము నీకు నమస్కరిస్తున్నాము. అనంత శక్తిమంతుడవైన నీ చేత ఈ ప్రపంచమంతా మ్రింగి వేయ బడింది. జ్ఞానంవల్ల మాత్రమే తెలియబడు యథార్థస్వరూపుడవైన నీకు నిత్యము నమస్కరిస్తున్నాము. సర్వవ్యాపివి, పూజ్యుడవు, జగద్రక్షణోపాయ చింతనమనే నిద్రలో నున్న నీచే సృష్టిసమయములో నీ నాభికమలమున నున్న బ్రహ్మాండమంతా నీటిలో లీలా పరికర మయ్యేటట్లు విడువబడింది. అటువంటి దేవాదిదేవుడవైన నీకు నమస్కరిస్తున్నాము. ఈ ప్రపంచమంతా దుష్ట తలంపులు గల క్రూర రాక్షసులచే వ్యాపింప బడినప్పుడు ఘోర యుద్ధంలో వారిని వెంటనే సంహరించిన సర్వేశ్వరునికి నమస్కరిస్తున్నాము. బ్రహ్మాది దేవతలు గాని, ఇతరులు గాని, మేము గాని, ఏ పరమ పదము తెలుసుకొనలేకున్నామో, వృద్ధి క్షయము వంటి వికారములు లేని ఆ పరమ పదమును అనుగ్రహించి రక్షించుము".

బ్రహ్మాది దేవతలు, నిర్మలాంతఃకరణులైన అగస్త్యాది మునీంద్రులు, శ్వేతద్వీప వాసులైన సిద్ధులు, బృహస్పతి, ఉపరిచరవసువు, శుక్రాచార్యుడు, దుర్వాసుడు, సప్తర్షులు, సనకాది యోగీంద్రులు మరల మరల నమస్కరిస్తూ సర్వేశ్వరుని చూచుటకు శ్రీమన్నారాయణుని సమీపించి ఆసీనులైనారు. పద్మపత్ర నేత్రుడు, ఆజానుబాహువు, గరుడవాహనారూఢుడు, దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుడు తన తేజస్సుతో ప్రకాశించే సూర్యుని వలె తన కాంతులతో ప్రకాశిస్తూ వారి మధ్యలో చిరునవ్వుతో వెలుగొందాడు.

ఆ సమయంలో దివ్యాభరణ భూషితులైన నాగకన్యలు భగవంతుని దివ్య కృత్యములను పాడారు. గంధర్వపతులు కొందరు రావణాది రాక్షస సంహారాన్ని కీర్తించారు. ఇంకొంతమంది గంధర్వులు కంస కేశి జరాసంధ సాళ్వాది రాక్షస సంహారమును, బాణ దుర్యోధనాది దుష్టశిక్షణను కొనియాడారు. హిరణ్యకశిపువధను శ్లాఘించారు. కొంతమంది గంధర్వులు రామ కృష్ణాద్యవతారములలో ఆచరించిన కృత్యములను,బ్రహ్మాది స్థావరముల జగత్సృష్టిని, శ్రీమన్నారాయణుని సన్నిధిలో గానం చేశారు. వందల కొలది అప్సరసలు నృత్యం చేస్తూ కనిపించారు. అనేకులు దేవదేవుని కీర్తిస్తూ నిలుచున్నారు. ఇతరులు వాద్యములతో పది దిక్కులు మారు మ్రోగేటట్లు చేశారు.

2.13. బ్రహ్మాదులు భగవంతుని విశ్వరూపమును దర్శించుట :

ఆశ్చర్య మనస్కులైన అగస్త్యుడు మొదలైన మహర్షులందరు శ్రీమన్నారాయణుని ఆశ్చర్యకరమును, తామరరేకులవంటి నేత్రములను కలిగిన దివ్య రూపమును తిలకించారు. ఆ రూపము గిరులతోను, గ్రామములతోను, నదులతోను, అడవులతోను,పాతాళలోకముతోను, దేవ,రాక్షస,మనుజ సంఘములతోను,సప్త లోకములతోను, సప్త ద్వీపములతోను, యక్షనాగరాక్షసులతోను, దేవేంద్రపురియైన అలకాపట్టణముతోను, చరములైన పశుపక్ష్యాదులతోను, అచరములైన వృక్షములు శిలలు అడవులతోను, మహానాగులు మొదలైనవాటితోగూడి ఆశ్చర్యకరమైయున్నది. వారంతా ఇంతకు మునుపెన్నడు చూడని, ప్రపంచాన్నంతటిని చూచి ఆశ్చర్యానందములలో ఓలలాడారు. చలించిన నేత్రములతో, చిత్తములతో, శిథిలమైన అవయవములతో అందరు భయభ్రాంతులైనారు. వారినందరిని శాంతములై, నిర్మలములై, మంగళప్రదములైన తామర రేకుల వంటి నేత్రములతో శ్రీమన్నారాయణుడు తిలకించాడు. శ్రీమన్నారాయణుని ప్రసన్నమైన తీక్ష్ణమైన కరుణా కటాక్షములు బ్రహ్మ రుద్రులపై ప్రసరించినంతనే వారంతా మోహమును,

భయమును వీడి శాంతచిత్తులైనారు. అనంతరము సర్వ లోకనియంత, విశ్వరూపధారి అయిన శ్రీమన్నారాయణుడు బ్రహ్మాదిసకల దేవతలు వినుచుండగా మేఘగర్జన వలె చెవులకు ఆనందం కలిగించేదై, ప్రియకరమైన వాక్కుతో జగత్తునంతా ప్రతిధ్వనింప చేస్తూ 'తేజోవంతులైన మీరు నన్ను కోరదగినదంతా నిస్సంకోచంగా కోరుకోండి. ఆలోచించ నవసరం లేదు. భూలోకంలోని మానవు లందరు నన్ను దర్శించి, స్వాభీష్టములను పొందుతారు. అంతేకాక త్వరితగతిన పొందుటకశక్యమైన మోక్షము కూడ లభిస్తుంది. నా దర్శన మయినంతనే ఏ ప్రాణి కూడా అభీష్టములను పొందక యుండదు. అందువల్ల మీ అభీష్టములను తెలుప'మని పలికినంతనే బ్రహ్మాది సకల దేవతలు, మునులు 'దేవా! నీ దర్శనభాగ్యముతో కృతార్థుల మైనాము. నీ అనుగ్రహము లేనిదే నీ దర్శనము లభించదు. మేము నిన్ను సేవించాలని సంచరిస్తూ, నీ పాదస్పర్శతో పవిత్రమైన నీ నివాస భూమియైన ఈ నారాయణాద్రిలో నిన్ను చూచి

"సంసారాత్ మోక్షమిచ్ఛన్తో దేవా! త్వత్పాదమాశ్రితాః ।
ముక్తిం ప్రయచ్ఛ దేవేశ! సంసారాత్ భీతివర్ధనాత్ ॥"

సంసారం వల్ల విరక్తిచెంది మోక్షమును కోరుతూ, నీ పాదపద్మముల నాశ్రయించితిమి. భయమును వృద్ధిపరచు సంసారము నుండి మోక్షమును ప్రసాదించు' మని ప్రార్థించారు.

పురుషోత్తముడు, మూడు కాలముల యందుండు సమస్త ప్రాణులకు ప్రభువు, శరణ్యుడు అయిన శ్రీమన్నారాయణుడు తన్నే అభీష్టముతో ప్రార్థించిన ఆ యభీష్టము నెరవేరుటలో సందేహములేదని, తానుగ్రహించుటతో మోక్షము సులభంగా లభించునని, ప్రళయ కాలంలో తన అనుగ్రహంతో ముక్తిని పొందుతారని అంత వరకు తన కథను వింటూ, ఇతరులకు వినిపిస్తూ తపస్సు నాచరించమని వారి నాదేశించాడు.

సకల ప్రాణుల అంతర్యామియైన నారాయణుడు 'చేదిరాజా! నీకు ఇంతకు పూర్వమే అచిరకాలంలోనే మోక్షాన్ని పొందుతావని వరమిచ్చితిని. పూర్వము ప్రహ్లాదుడు నా చేత రక్షింప బడినాడు. ఈ మూడు లోకాలలోను హిరణ్యకశిపుని పుత్రునితో సమానమైన భక్తుడు లేడు' అని ఉపరిచరవసువుకు చెప్పి పరమ భక్తుడైన అగస్త్యుని చూసి 'బ్రాహ్మణోత్తమా! నీ భక్తితో నేను సంతుష్టుడనైతిని. నీ అభీష్టమును కోరుకో. పొందశక్యము కానిదైనను నేను అనుగ్రహిస్తాను. సందేహించవద్దు' అని పలుకగానే అగస్త్యుడు సంతోషించి, శిరస్సుతో నమస్కరించి అంజలి ఘటించి పులకితగాత్రుడై, పరబ్రహ్మ అయిన శ్రీమన్నారాయణుని ఈ విధంగా ప్రార్థించాడు.

2.14. అగస్త్య మహర్షి ప్రార్థన :

ఈ నారాయణాద్రిపై వందల కొలది సంవత్సరములు నుండి సంచరించుచున్నాను. పురాణపురుషుడవు, పుట్టుక లేనివాడవు, సుస్థిరుడవు, పుండరీకాక్షుడవైన నీ జాడ తెలిసికొనలేక మిగుల దుఃఖించితిని. సర్వేశ్వరుడవైన ఓ పురుషోత్తమా! మా అదృష్టవిశేషముచేత నీవు దర్శన మిచ్చితివి. నీ అనుగ్రహముతో నా యభీష్టమును పొందగోరుచున్నాను. జరిగిన, జరుగబోవు, జరుగుచున్న కాలములలో సర్వప్రాణులకు తెలియుట కశక్యమైన ఉత్తమగతితో తెలియ శక్యమైనదానిని తెలియగోరుచున్నాను. అనేక వేలసార్లు విన్నను దేవతలకైనను తెలియని ఆ ఉత్తమగతి నాకు గోచరించు నట్లనుగ్రహించుము. నీపై నాకత్యంత నిర్మలమైన భక్తి ఉండు గాక!

2.15. భగవంతుని వరప్రదానము :

అగస్త్యుని ప్రార్థనను విన్న లోకభర్తయైన సర్వేశ్వరుడు చిరునవ్వు నవ్విస్తూ మేఘగంభీరవాక్కుతో 'అగస్త్యా! ఈ పర్వతం పై నీవు చేసిన పూజకు నేను సంతుష్టుడనై నీవు కోరినదంతా ఒసంగితిని' అని చెప్పగా వెంటనే

అగస్త్యుడు 'త్వం చ దృశ్యో వసేహేశ సర్వేషాం ప్రాణినామపి'। 'స్వామీ! నీవు సకల ప్రాణులకు దృష్టిగోచరుడవై ఈ పర్వతముపై నివసింపు'మని ప్రార్థించెను. భగవంతుడు అతని ప్రార్థనను విని 'అహం దృశ్యో వసామీహ శ్రీభూమిసహితోఽనఘ'। పాపరహితా! నేను శ్రీ భూదేవులతో సకల ప్రాణుల దృష్టిగోచరుడనై ఉంటాను. దివ్యము, ఆకాశములో నున్నది, అచింత్యమైనది, అనేక రత్నములతో కూడిన ఈ నారాయణాద్రిని అధిరోహించి పాపహరమైన స్వామి పుష్కరిణిని సేవించి, స్నాన మాచరించి, ఆ తీరమున నున్న నేనధిష్ఠించిన, నాకు ఆనందదాయకమైన, పాపములన్నిటిని పోగొట్టునదైన పుణ్యవిమానమున నున్న నన్ను నాయందే మనస్సును లగ్నం చేసి నన్నర్చించిన మానవులకు గాని, మునీంద్రులకు గాని దుర్లభమైన కోరికలను తీరుస్తాను. భక్తితో నా పర్వతముండు దిక్కునకు వందల కొలది యోజనముల దూరము నుండి నమస్కరించే జనులు నా అనుగ్రహముతో పాపములు నశించి పరమ పదమును పొందుతారు. ప్రతి దినము శుభకరమైన స్వామి పుష్కరిణిని సేవించువారు ఇహ పర సౌఖ్యములను పొందుదు రనుటలో సందేహము లేదు.

భక్త్యా మామర్చయిష్యన్తి మయి సన్న్యస్తమానసాః ।
దదామీప్సితమాన్ కామాంస్తేషామపి సుదుర్లభాన్ ॥
యే నరాః కుర్వతే విప్ర యోజనానాం శతేష్వపి ।
ప్రణామం దిశ ముద్దిశ్య భక్త్యా మత్పర్వతోత్తమే ॥
తే నరా మత్ప్రసాదేన పాపరాశిం వ్యపోహ్య వై ।
ప్రాప్నువన్తి పదం పుణ్యం అప్రవిష్టం దురాత్మభిః ॥
య ఏనాం సేవతే నిత్యం స్వామిపుష్కరిణీం శుభామ్ ।
సోఽపి భుక్తిమవాప్నోతి ముక్తిం చాపి న సంశయః ॥

(36 అ 64 To 67)

2.16. మహర్షులు భగవంతుని దివ్యవిమానమును సందర్శించుట :

శ్రీమన్నారాయణుడు బదులిచ్చిన తరువాత మునులు లోక ప్రసిద్ధి గాంచిన స్వామి పుష్కరిణికి దక్షిణ తీరంలో సూర్యునితో సమాన కాంతి గల దివ్య విమానమును దర్శించారు. పరమాద్భుతము, సూర్య సదృశమైన ఆ విమానము శ్రీమన్నారాయణునికి నివాసస్థానమై, దివ్యము, నిత్యము, ఆశ్చర్యకరమైన తెల్లని మేఘమువలె ప్రకాశిస్తున్నది. అనేక శిఖరములతో అలంకరింపబడి వివిధ రత్నములతో కూడి ముత్యాల సరములతో కూర్చబడి తన కాంతితో పది దిక్కులను ప్రకాశింపచేస్తూ, దేదీప్యమానముగ విరాజిల్లుతున్న అనేక రత్న సమలంకృతమై, మిక్కిలి ఎత్తుగా నుండి చూడ నశక్యమై, చూచేవారికి ఆనందము కలిగిస్తున్నది.

ఆ పర్వతముపై సంచరిస్తున్న మునీంద్రులు కాని, ఇంద్రాది దేవతలు కాని ఇంతకు మునుపెన్నడూ దానిని చూచి యుండలేదు. ఆ పర్వతముపైననే సంచరిస్తున్న వారితో కలిసి మునీంద్రులందరూ ఇదేమిటి? ఇక్కడే సంచరిస్తున్నప్పటికీ మనమీ విమానమును చూడలేదు! అనుకొని ఆశ్చర్యకరముగా కనిపిస్తున్న ఆ విమానమును, శ్రీనివాసుని, సంతోషముతో వికసిత నేత్రులై సేవించి, ఇది ఎంత ఆశ్చర్యకరముగా ఉంది! ఈ విమానమును మహాత్ముడైన శ్రీహరే దాచివేయుటచేత మనము చూడలేదు. ఆశ్చర్యము, పవిత్రము, సూర్యునితో సమాన ప్రకాశము కలిగిన ఈ విమానము స్వామి పుష్కరిణీ తీరములో ఉన్నప్పటికి పుణ్య పురుషులతో కూడిన మనము చూడలేకపోతిమి. సిద్ధులచే సేవింపబడిన ఈ దివ్య విమానము విష్ణువు చేతనే అంతర్హితము చేయబడినది. ఈ విధంగా దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుని సన్నిధానములో మునులందరు పరస్పరం మాట్లాడుకొనసాగిరి.

బ్రహ్మాదులు చూచుచుండగనే సురేశ్వరుడు, పరాత్పరుడు, పరమాత్మ భక్తులకు సర్వస్వము అయినవాడు, లోకములను సృష్టించి తన కరుణాకటాక్ష

వీక్షణములతో చూచేవాడు, సకల లోకములకు, దేవతలకు ఆధారమైనవాడు, సకల లోక నియంత, పరమాత్మ, తేజశ్శాలి, అనంత కల్యాణగుణ నిర్భరుడు, పురుషోత్తముడు, పద్మ పత్రనేత్రుడైన ఆ శ్రీహరి అంతర్ధానము చెందగా దేవతలు, బ్రహ్మర్షులు, తపోధనులైన మునీంద్రులు, సిద్ధులు, నిర్మలాంతః కరణులైన మహర్షులు, బృహస్పతి, మనువు, సనకాది యోగులు, శ్వేతద్వీపనివాసులు, సప్తర్షులు, భగవంతుని దర్శించటానికి వచ్చిన అందరు ఆశ్చర్యచకితులై అంతర్హితుడైన శ్రీమన్నారాయణునికి పదే పదే నమస్కరించి, దీనహృదయులై పది దిక్కులా పరిశీలించసాగిరి.

అప్పుడు బ్రహ్మాదులు అంతర్హితుడైన శ్రీమన్నారాయణునికి నమస్కరించి ఇలా అన్నారు–"మహాతేజశ్శాలియైన భగవంతుని మాహాత్మ్య మత్యంత మాశ్చర్యకరమైనది. అతని తేజస్సు బ్రహ్మాండమంతా వ్యాపించింది. అతడు ధరించిన చక్రాద్యాయుధములు మొత్తం జగత్తును సాగరములను ఎండింపచేస్తున్నట్లు ప్రకాశిస్తున్నాయి. నిర్మలమైన శ్రీహరి కటాక్షములు పది దిక్కులను ప్రకాశింపజేస్తూ, తమ తేజస్సులతో అనేక ప్రకారములుగా విరాజిల్లుతున్నవి.

శ్రీమన్నారాయణుని బాహువులు ఏనుగు తొండముల వలె పరస్పరం పోటీ పడుతున్నట్లు అందమైన కాంతి కలిగి విలసిల్లుతున్నాయి. విష్ణువు యొక్క ముఖములు పూర్ణచంద్రసమానములై, నిర్మలములై, దివ్యములై, రత్నకుండలములతో శోభిల్లుతున్నాయి. శ్రీహరిపాదములు చంద్రమండలము వలె తెల్లని కాంతిగల గోళ్ళతో నిర్మలముగా ప్రకాశిస్తున్నాయి. అట్టి పరమాత్మ ఈ పర్వతముపై నివసిస్తున్నాడు. అందువలన అత్యంత తేజస్సుతో కూడి ఉన్న ఈ పర్వతరాజము యొక్క మాహాత్మ్యమేమని వర్ణించెదము? నిర్మలమైన తేజమున్నను మనమంతా కలిసి కూడా ఈ పర్వత మాహాత్మ్యమును నూరు సంవత్సరాలైనా వర్ణించలేము.

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

శ్రీ వేంకటాచలమునకు సమానమైన క్షేత్రము ప్రపంచంలో ఎక్కడా లేదు. శ్రీవేంకటేశునితో సమాన దైవము గత కాలంలోనూ లేడు. రాబోవు కాలంలోనూ ఉండబోడు.

నాస్తి పుణ్యతమం తీర్థం స్వామిపుష్కరిణీ సమమ్।
సమ మస్తీతి యో బ్రూయా త్తత్సమో నాస్తి పాతకీ ॥

యాశ్చ సప్త మహాపుర్యః కీర్త్యన్తే ముక్తిదాయకాః ।
తే వేంకటాద్రి పర్యన్తగ్రామ కోట్యంశశక్తయః ॥

స్వామి పుష్కరిణికి సమాన తీర్థమున్నదని ఎవరైతే చెబుతారో వారు పాపాత్ములు. మోక్షదాయకాలని కీర్తించే ఏడు మహానగరాలు శ్రీ వేంకటాచల సమీప గ్రామం యొక్క కోటియంశముతో సమానమైనవి[4].

ఈ విధంగా బ్రహ్మాది దేవతలు అనేక విధములుగ చర్చిస్తూ సంతుష్టాంత రంగులైస్వామి పుష్కరిణిలో స్నానమాచరించి ఆ తీర్థమును సేవించి మహాద్భుతమైన విమానమును దర్శించిరి.

పూర్వము బ్రహ్మాది దేవతలు కూడ చూడని ఆ శ్రీమన్నారాయణుని దివ్య విమానమున నిర్మలమైనసూర్యకాంతిని పోలిన చతుర్బాహుని, చరాచరములకు ప్రభువై దివ్య కుండలములు ధరించి, నిలచియున్నవానిని, అచ్యుతుని, అనేక ఆభరణములతో అలంకరింపబడిరత్నఖచిత కిరీటములతో అలరారుతున్న

4. శ్రీభవిష్యోత్తర పురాణాంతర్గతమైన శ్రీవేంకటాచల మాహాత్మ్యములో వేదవ్యాసునిచే శ్రీవేంకటాచలానికి అయోధ్యా మధురాది సప్త మహా క్షేత్రములకు సాదృశ్యం అద్భుతంగా వర్ణించబడింది.

శంఖచక్రాయుధధరుని, సకల ప్రాణుల వరదుని, విచిత్రములైన దివ్య రత్నములతో కూడిన కంకణములతో విరాజిల్లుతున్న దివ్యమైన పీతాంబరాన్ని ధరించిన శాంతుని దివ్య రత్నములతో అలంకృతమైన ప్రణతార్తిహరుని, ముల్లోకముల కలంకారభూతుడై మెరుస్తున్న మణులతో వ్యాపింప బడిన సుందర హారములతో విరాజిల్లుతున్న వానిని, నూపురములతో ప్రకాశిస్తున్న పాదములు కలవానిని, పద్మముల వంటి నేత్రములు కలవానిని, తన ప్రక్కనే ఉన్న సౌందర్యవతులైన తన పత్నులు శ్రీదేవి భూదేవులచే సేవింప బడుతున్న శ్రీమన్నారాయణుని బ్రహ్మాదులంతా దర్శించారు. వారంతా ఆశ్చర్య వికసిత నేత్రులై, సంతుష్టులై, భూమిపై శిరస్సు లానించి నమస్కరించి, సృష్టికర్తయైన శ్రీనివాసుని సంతోషాంత రంగ నేత్రులై స్తోత్రములతో స్తుతించారు. అప్పుడు ప్రజ్వలిస్తున్న చక్రధారియైన శ్రియఃపతి విమానమునుండి క్రిందికి దిగగా అందరూ కలిసి నమస్కరించి విమానమునకు ప్రదక్షిణ చేసి ఆ పర్వతాన్ని ప్రశంసిస్తూ వచ్చినవారు వచ్చినట్లుగనే వెడలిపోయిరి. బ్రహ్మ కూడా ఆకాశములో సంచరించు దేవతలతో కలిసి వారంతా పొగడుతుండగా తన లోకమునకు బయలుదేరెను.

2.17. భగవంతుని దివ్య విమానము అంతర్ధాన మగుట :

అంజనాద్రిలో నివసించే మునులకు అంతర్ధానమైన విమానచరిత్ర నంతా తెలియ జేయాలని, మహాశ్చర్యకరము, పవిత్రమునైన చరితమును తెలుపమని జనకుడడుగగా వామదేవుడు చెప్పసాగెను.

అద్భుతము, మునిసేవితమైన ఆ విమానము మహా విష్ణువు యొక్క దివ్య మాయతో విలాసముగా అంతర్ధాన మొందింపబడినది. ఇలా చేస్తే ఈ మునీంద్రు లందరు, పర్వత శిఖరమున చాలా కాలము సంచరిస్తారని ముందుగా భగవంతుడు సంకల్పించాడు. మహాత్ములైన మునీంద్రులకు భగవంతుడు తన మాయతో దివ్యమైన విమానమును మరల దర్శింపజేశాడు. సకల పాపహరము,

సకల లోక విఖ్యాతము, అసాధారణము, ఆద్యంత రహితము, శ్రీదేవితో పాటు వైకుంఠము నుండి వచ్చినది, శ్రీమన్నారాయణుడు విహరించునదైన ఆ విమానమును శ్రీమన్నారాయణుని దివ్యానుగ్రహముతో చూడగల్గినారు. భగవంతుని ఆ దివ్యలీల అత్యద్భుతముగా నున్నది.

2.18. అగస్త్యాది మహర్షులు స్వామి పుష్కరిణీ తీరములో భగవంతుని ఉపాసించుట :

శుద్ధ జ్ఞానస్వరూపుడు, ప్రపంచము నందంతటను వ్యాపించినవాడు, పరబ్రహ్మ అయిన గోవిందుడు అంతర్హితుడైనంతనే అగస్త్యాది మహర్షులు ఏమి చేసినారో చెప్పుమని జనకుడు అడుగగా వామదేవుడు ఇలా చెప్పసాగాడు -

సకల పాపహరము, పవిత్రము అయిన స్వామి పుష్కరిణీ పవిత్రజలంలో ప్రతి నిత్యమూ స్నానం చేస్తూ అహర్నిశలూ పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీమన్నారాయణుని ధ్యానించుదామని మునులందరు ఆ విమానంలో పన్నెండు సంవత్సరములు నివసించారు.

శ్రీమన్నారాయణుని ఆరాధించే ప్రయత్నములో తీవ్రమైన తపస్సు చేస్తూ, అహర్నిశలు స్వామి పుష్కరిణిని సేవిస్తూ, మోక్షప్రదము, శ్రేష్ఠము, మోక్షేచ్ఛ కల పూర్వీకులైన విజ్ఞులచేత అర్థార్థుల చేత, ఇతర కోరికలు కోరువారిచేత, వారి వారి కోరికలు ఫలించటానికై జపించబడినది, సృష్ట్యాదిని ప్రజలందరిని సృష్టించాలని బ్రహ్మ, అట్లే ప్రళయ కాలంలో ప్రజలను సంహరించ వలసిన కాలము సమీపించగా చంద్రశేఖరుడైన శివుడు ఏ మహా మంత్రమును జపించి గొప్పశక్తిని పొందారో, ఏ మంత్రముతో సమాన మంత్రము లేదో, వేదవిహితములు, మంగళప్రదములునైన మంత్రము లన్నిటిలో ఏ మంత్రముచే అన్ని పాపముల నుండి విముక్తులవుతున్నారో, ఏ మంత్రోచ్చారణతో అన్ని కోరికలను పొందుతున్నారో, అటువంటి సర్వ పాప హరము, సకల దుఃఖనాశనము అయిన

'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్ర రత్నమును పన్నెండు సంవత్సరములు జపించారు.

ఈ విధంగా పన్నెండు సంవత్సరములు పూర్తి కాగానే అగస్త్యాది మహర్షులు శంఖ చక్రధరుడు, చతుర్భుజుడు, కిరీటధారి, శ్రీదేవి భూదేవీ సహితుడు ఉదయించుచున్న కాంతి కలవాడు, సకల జగత్ప్రభుపైన శ్రీమన్నారాయణునికి నమస్కరించి, విమానమునకు ప్రదక్షిణ చేసి ఆ పర్వత శ్రేష్ఠము నుండి వెళ్ళుటకు సిద్ధమయ్యారు.

ఇంతలో మునీంద్రులంతా చూస్తుండగనే మునుల చేత సేవించ బడిన ఆ విమానము విష్ణువు యొక్క దివ్య మాయతో అంతర్ధానమయింది. అనంతరము మునులందరూ ఆశ్చర్య చకితులయినారు. మహానుభావుడు, దేవాదిదేవుడు, ఆశ్చర్యకరమైన పనులు చేయునటువంటి, శ్రీమన్నారాయణునిచే పుణ్యపురుషులు సేవించు ఈ విమానము ఇంతకు పూర్వము రహస్యముగా నుంచబడి మరల దృష్టిగోచర మయ్యేటట్లు శ్రీహరి మాయ చేతనే అంతర్ధానము నొందింప బడటమనేది మిక్కిలి ఆశ్చర్యము కలిగించు చున్నది. విమానాధిపతియైన శ్రీమన్నారాయణుని దర్శిస్తే ఆ విమానము సాక్షాత్కారమయింది. ఈ విధముగా మహర్షులు ఆశ్చర్యచకితులై అనేక విధముల చర్చించుకుంటూ అచ్చటనే నిలిచారు.

2.19. నారాయణాద్రి వర్ణనము :

వేంకటాచలము యొక్క వాయవ్య దిగ్భాగంలో పూర్వము మునీంద్రులచేత దర్శింపబడిన భగవంతుడు ఎక్కడ ఉన్నాడని జనకమహారాజు అడుగగా వామదేవుడు ఇలాచెప్పాడు–

"'నారాయణాద్రి' అనే పేరుగల ఆ పర్వతముపై సాక్షాత్తు నారాయణుడు దివ్యమైన మహాశ్చర్యకరమైన రూపమును ధరించి నివసిస్తున్నాడు. శ్వేత ద్వీప

నివాసులు, శంఖ చక్రములను ధరించిన- వారైన మునీంద్రులందరు నారాయణాద్రి పై కలిసి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరిని జపిస్తూ చాలాకాలం విమానంలోనే నివసించారు. శ్రీమన్నారాయణుని మిక్కిలి భక్తితో పూజిస్తూ అతని అనుమతి పొంది శ్వేత ద్వీపమునకు వెళ్ళారు.

మధుసూదనుడు అంతర్ధానమైన తరువాత అక్కడ చేరిన సనకాది మహాత్ములు ఏమి చేశారని జనకుడు వామదేవుని ప్రశ్నించాడు. అప్పుడు వామదేవుడు అనంతర వృత్తాంతమును ఇలా చెప్పనారంభించాడు. సప్తర్షులు, దేవతలు, ప్రాజ్ఞుడైన శుక్రాచార్యుడు, పూజ్యుడైన బృహస్పతి, సనకాదులు అందరూ శ్రీమన్నారాయణునకు నమస్కరించి శ్రీవేంకటాచలమును స్తుతిస్తూ తమ తమ నివాసములకు వెళ్ళారు. శంఖమహారాజు కూడా శ్రీనివాసుని అనుగ్రహంతో అద్భుతమైన అప్సర సమూహములతో సేవించ బడుతూ దేవలోకమును చేరాడు.

సర్వ సమర్థుడైన శ్రీమన్నారాయణుడు మనకు దర్శింపజేసిన లోక పావనమైన దివ్య విమానము ఈ పర్వతమున ఎల్లప్పుడు పూజింప బడుతుంటుంది. అయితే అది మరుగున పడినదై ఎవరికీ కనిపించకుండా వుంటుంది. కాని ప్రతి యుగంలో ఎవరైనా తపస్సు చేసి శ్రీమన్నారాయణుని ధ్యానిస్తే ఆ విమానము తప్పక దర్శనమిస్తుంది. రాబోవు కలి యుగంలో ఉత్కృష్టమైన పుణ్యము వలన శ్రీహరి భక్తులు సకల శుభ లక్షణములతో కూడిన విమానమును నిర్మిస్తారు. సకల పాప హరము, శ్రీమన్నారాయణుని నివాసస్థానమైన విమానము చూచే వారి కానందమును కలిగిస్తూ, దేవర్షులు, రాక్షసులు, గంధర్వులు, దేవతలు, సిద్ధులు మొదలగు వారిచే సేవింప బడుతూ మహైశ్వర్యమును కలిగిస్తూ విరాజిల్లుతుంది. అందులో సందేహము లేదు. శ్రీమహావిష్ణువు ఆ విమానము నందు శంఖ చక్రధరుడై, చతుర్భుజుడై, సంపదతో విఖ్యాతిని

పొందగలడు. పాప పరిహారకమైన, మూడు లోకాలలో శ్రేష్ఠమైన ఆ విమానము ఈ లోకంలో ప్రసిద్ధిని పొందగలదు" అని చెప్పి అగస్త్యమహర్షి శ్రీమన్నారాయణుని నమస్కరించి దుర్లభమైన వరములను శ్రీహరి నుండి పొంది మునీంద్రులతో కలిసి మహేంద్ర పర్వతమునకు బయలు చేరాడు.

2.20. కలియుగంలో రాబోవు దివ్య విమాన వర్ణనం :

రాబోవు కలి యుగంలో సర్వదా మిక్కిలి తేజోవంతమైన విమానము అదృశ్యమై పవిత్రమైన స్వామి పుష్కరిణీతీరములో భక్తులచే సూర్యసమాన తేజోవంతమైన విమానము సాటి లేనిదిగా నిర్మించ బడుతుంది. దానికి కూడా గొప్ప మాహాత్మ్యము ఉంటుంది. మహదాశ్చర్యకరమైన ఆ విమానము దేవ పూజితమై శ్రీనివాసుడు అక్కడ నివసించి యుండుటచేత ప్రకాశిస్తుంది. అందుకు సందేహం లేదు. శ్రీనివాసుడు నివసించే ఆ విమానము యొక్క మాహాత్మ్యాన్ని వివరంగా వర్ణించుటకు ఎన్ని వత్సరాలైనను చాలవు. తన భక్తులకు మేలు చేకూర్చుటకు శ్రీభూసహితుడైన దేవాదిదేవునిచే అలంకృతమైన పాపపరిహారకమైన విమానమును సేవించిన మానవులు విష్ణువుయొక్క అనుగ్రహము చేత సంసార బంధముక్తులై బ్రహ్మస్థానమైన సనాతనమైన పరమపదమును పొందగలరు.

కలి యుగంలో ఆ విమానమును చూడగోరి సిద్ధులు, చారణులతో కూడి దేవతలందరు, ఋషులు, గంధర్వులు, యక్షులు, నాగులు, పన్నెండు మంది సూర్యులు, అష్టవసువులు, ఏకాదశ రుద్రులు, అష్టదిక్పాలురు, తొమ్మిదిమంది వాయువులు, చతుర్ముఖ బ్రహ్మ, మహేశ్వరుడు మొదలైనవారు పరమ భక్తితో స్వామి పుష్కరిణిలో స్నానము చేసి, ఆ తీరంలో విమానంలో వేంచేసియున్న పురుషోత్తముడు, సర్వ నియంత, దేవాదిదేవుడు, నిరామయుడు అయిన శ్రీమన్నారాయణునికినమస్కరిస్తూ రాత్రింబవళ్ళు దివ్య స్తోత్రములతో స్తుతిస్తుంటారు.

"సర్వే పాతకినశ్చాపి తద్దృష్ట్వా పుణ్యముత్తమమ్ ।
విమానం సర్వశోకఘ్నం సర్వరోగప్రణాశనమ్ ॥
విముక్తాః సర్వ పాపేభ్యో భవిష్యన్తి న సంశయః ।
యత్ర క్వాపి వసన్ దేశే విమానాభిముఖం నరః ॥
వేంకటాద్రిం నమస్కృత్య సద్యః పాపై ర్విముచ్యతే ॥

పాపాత్ములైనవారు పుణ్యప్రదము, శ్రేష్ఠము, సకల దుఃఖ హరము, సకలరోగ ప్రణాశనమునైన ఆ విమానమును దర్శించి పాప విముక్తు లగుదురనుటలో సందేహము లేదు. మానవుడు ఏ దేశములో నున్నప్పటికి ఆ విమానాభిముఖుడై శ్రీవేంకటాచలమునకు నమస్కరించిన సకల పాపముల నుండి విముక్తుడౌతాడు.

నారాయణగిరౌ తస్మిన్ ఆస్తే నారాయణ స్స్వయమ్।
గుహాసు చాపి సర్వాసు సర్వేషు శిఖరేషు చ ॥
కందరేషు చ సర్వేషు నిర్ఝరేషు శుభేషు చ ।
భగవాన్ దేవదేవేశః సర్వస్మిన్ గిరిమూర్ధని ॥
నానావిధాని రూపాణి బిభ్రద్విహరతి స్వయమ్ ।
క్వచిచ్చ దేవరూపేణ క్వచిన్మానుషరూపతః ॥
క్వచిచ్చ మృగరూపేణ క్వచిద్వృక్షాది రూపతః ।
యత్ర కుత్రచిదాసీనః తస్మిన్ దివ్యే మహాగిరౌ ॥
దేవదేవం సమారాధ్య య ఉపాస్తే జనార్దనమ్ ।
కరోతి తస్య సాన్నిధ్యం భగవానాదికృద్ధరిః॥"

ఈ నారాయణాద్రిపై సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు నివసిస్తున్నాడు. ఈ పర్వత గుహలలోను, శిఖరములలోను, పవిత్రమైన సెలయేళ్ళలోను

భగవంతుడున్నాడు. శ్రీనివాసుడు వివిధ రూపములను ధరించి పర్వత పైభాగంలో సంచరిస్తూంటాడు. ఒకప్పుడు మానవ రూపంలోను మరొకప్పుడు దేవతా రూపంలోను, వేరొకప్పుడు మృగ రూపంలోను, ఇంకొకప్పుడు వృక్ష రూపంలోను ఉంటాడు. ఆ పర్వతముపై ఎక్కడో ఒకచోట ఉండి దేవదేవుడైన శ్రీనివాసుని ఆరాధించి ఉపాసించే వారు ఆయన దివ్యసన్నిధిని చేరుకుంటారు.

వృషభాచల భూభాగే ఘటికామపి యో వసేత్ ।
సప్త జన్మకృతం పాపం తత్క్షణాదేవ నశ్యతి ॥
యే తత్ర కుర్వతే పాపం అజ్ఞానా ద్వేంకటాచలే ।
హన్యుస్తాన్ సర్వ ఏవైతే గంధర్వాః శస్త్రపాణయః ॥
ఆజ్ఞయా తస్య దేవస్య విష్వక్సేనస్య ధీమతః ।
తస్మాన్న కుర్యాత్పాపన్తు నర స్తస్మిన్ మహీధరే ॥
న హి తత్ర గిరౌ కశ్చిద్ వృక్షః పక్షీ మృగో ఽథ వా ।
ప్రాకృతో జాయతే దేవాః సర్వే తద్రూపిణస్తథా ॥
తస్య దేవస్య సేవార్థం సాన్నిధ్యం కుర్వతే సదా ।

వృషభాచలంపై ఘటికా కాలమైనా ఎవరైతే నివసిస్తారో వారికి ఏడు జన్మలలో చేసిన పాపము ఆ క్షణంలోనే నశిస్తుంది. శ్రీవేంకటాచలంపై అజ్ఞానంతో ఎవరైతే పాపం చేస్తారో, వారి నందరిని శస్త్రములను ధరించిన గంధర్వులు విష్వక్సేనుని ఆజ్ఞతో సంహరిస్తారు. అందువలన మానవులు ఆ పర్వతంపై పాప కార్యములను చేయరాదు. ఆ పర్వతంపై నున్న ఒక్క చెట్టు గాని, పక్షి గాని, మృగము గాని ప్రాకృతమైనవి కావు. దేవతలే శ్రీనివాసుని సేవార్థం ఆ పర్వతంపై వృక్షాది రూపములలో ఉన్నారు.

2. 21. శ్రీనివాసుని బ్రహ్మోత్సవ వర్ణనం :

ఉత్సవము :

'ఉత్సవ' శబ్దానికి 'దీనివలన ఆనందము కలుగుతుంద'ని నిర్వచనము. ఉత్సవ మంటే 'గొప్ప యజ్ఞము', 'అత్యంత ఆనందదాయకము' అని రెండు అర్థాలున్నాయి. ఉత్సవములు మూడు రకములు. (1)నిత్యోత్సవము (2) శాంత్యుత్సవము (3)శ్రద్ధోత్సవము అని వైఖానసాగమములో మరీచి మహర్షి పేర్కొన్నారు. నిత్యోత్సవమునే కాలోత్సవమని కూడా అంటారు. పరమాత్మయైన శ్రీవేంకటేశుని ప్రీతి కొరకు భాద్రపదమాస శుక్ల పక్షములో స్వామి పుష్కరిణీతీరములో బ్రహ్మదేవుడు మహోత్సవం ప్రారంభించాడు. ఆ యా యుగములలో స్వామి పుష్కరిణీ తీరములో పుణ్యాత్ములు, పవిత్రులు శ్రీనివాసునికి ఉత్సవములు చేశారు.

కించి దారాధనే నైవ విష్ణుర్భాద్రపదోత్సవే ।
దదాతి సర్వలోకానాం వరానత్యన్త దుర్లభాన్ ॥
ఉత్సవేషు చ దేవస్య నారాయణగిరిం ప్రతి ।
గచ్ఛన్తి యే నరాః పుణ్యా స్తేషా మపి ఫలం శృణు ॥
యాని త్వాదధతే పదాని చ మునే నారాయణాద్రిం ప్రతి ।
స్తోకం స్తోకమపి ద్విజా అపి జనాస్తేషాం ఫలం యచ్ఛృణు ॥
యావ ద్వేంకటశైల మాత్మగృహత స్తావ త్పదానాం క్రమాత్ ।
ప్రాయశ్చైవ పదే పదే క్రతుఫలం భూయా ద్భువి ప్రాణినామ్ ॥

భాద్రపద మాస బ్రహ్మోత్సవములో ఏ కొంచెం ఆరాధించినా విష్ణువు సర్వలోకనివాసులకు దుర్లభమైన వరములను ప్రసాదిస్తాడు. ఉత్సవ దినములలో నారాయణాద్రికి నడచి వచ్చే మానవులకు మంచి ఫలితం లభిస్తుంది. తన ఇంటినుండి నారాయణాద్రి దిక్కుగా వేసే ప్రతి అడుగుకు భూలోకంలో యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది.

ప్రతి సంవత్సరం కన్యా మాసములో శ్రీ వేంకటేశ్వరునికి ద్వితీయ తిథి నుండి విజయదశమి వరకు తొమ్మిది రోజుల దీక్షగా బ్రహ్మదేవుడు ఉత్సవములు జరిపిస్తున్నాడు. బ్రహ్మదేవుడు ప్రారంభించుటచే వీటిని బ్రహ్మోత్సవములని చెప్పడం జరిగింది. తొమ్మిది రోజులలో ఆ యా వాహనములపై ఉపవిష్టుడైన శ్రీనివాసుడు భక్తుల ననుగ్రహించుటకై నాలుగు మాడ వీధులలో ఊరేగుతాడు. పదవ రోజున పుష్పయాగ మహోత్సవం జరుగుతుంది.

మొదటి రోజు ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, రెండవ రోజు ఉదయం చిన్న శేషవాహనం, రాత్రి హంస వాహనం, మూడవ రోజు ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, నాలుగవ రోజు ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, ఐదవ రోజు ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, ఆరవ రోజు ఉదయం హనుమ ద్వాహనం, రాత్రి గజ వాహనం, ఏడవ రోజు ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, ఎనిమిదవ రోజు ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, తొమ్మిదవ రోజు ఉదయం అవభృథ స్నానం (చక్ర స్నానం), రాత్రి ధ్వజావరోహణం - ఈ విధంగా ప్రతి సంవత్సరం భగవంతుడైన శ్రీనివాసునికి బ్రహ్మోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది.

పంచ బేరములు :

మూల విరాట్ :

తిరుమల ఆనందనిలయంలోని గర్భాలయంలో ఆవిర్భవించిన శ్రీ వేంకటేశ్వరుడు మూల విరాట్, సాలగ్రామమూర్తి (ధ్రువమూర్తి) అనే పేర్లతో పిలువ బడుతున్నాడు. ఈ మూల విరాట్టుకు ప్రాతఃకాల, సాయంకాలాల్లో ప్రతి రోజు తోమాల సేవ, మూడు కాలాల్లో అర్చన, నైవేద్యాదులు జరుగుతుంటాయి. ప్రతి శుక్రవారము సుగంధ ద్రవ్యములతో ఈ సాలగ్రామమూర్తికి అభిషేకము జరుగుతుంది.

భోగ శ్రీనివాస మూర్తి :

వైఖానసాగమము ననుసరించి భోగ శ్రీనివాస మూర్తి కౌతుక మూర్తి, పురుషబేర మనే పేర్లతో వ్యవహరింప బడుతున్నాడు. ప్రతి రోజు ఈ మూర్తికే ఏకాంత సేవా కైంకర్యము జరుగుతుంది. ఈ మూర్తికే ప్రతి బుధవారము సహస్ర కలశాభిషేకము జరుగుతుంది. ఈ మూర్తి రజతమూర్తి.

కొలువు శ్రీనివాస మూర్తి :

పంచలోహములతో నిర్మితమైన ఈ శ్రీనివాసమూర్తికి దర్బార్ శ్రీనివాసమూర్తి అని, అనిరుద్ధబేరమని పేర్లు కలవు. ప్రతి రోజు తోమాల సేవా నంతరము స్నపనమండపంలో స్వర్ణసింహాసనంలో ఈ మూర్తిని ప్రతిష్ఠిస్తారు. ఈయన సన్నిధిలోనే తిథి వార నక్షత్రములతో, యోగ కరణములతో పంచాంగ శ్రవణం, గత దిన ఆదాయ వ్యయములు నివేదించడం జరుగుతుంది.

ఉగ్ర శ్రీనివాస మూర్తి :

ఈ మూర్తికి వేంకటత్తురైవార్, స్నపన బేరం, అచ్యుత బేరమని పేర్లు కలవు. ఈ మూర్తికి సూర్యకిరణములు సోకితే ఉగ్రత్వం సంభవిస్తుంది. ప్రతి సంవత్సరం ద్వాదశ తిరువారాధన (కృష్ణాష్టమి), కార్తీక ద్వాదశి పర్వదినాలలో ఈ మూర్తికి ఉత్సవం జరుగుతుంది.

ఉత్సవ శ్రీనివాసమూర్తి (మలయప్పస్వామి)

ఆనంద నిలయమునకు బయట జరిగే ఉత్సవ కైంకర్యములన్నీ ఈ మూర్తికే జరుగుతాయి. శ్రీ భూదేవీ సహితుడైన ఈ మూర్తి కొండ ప్రాంతములో దొరికినందువల్ల మలయప్ప స్వామి అని వ్యవహరిస్తున్నారు.

2.22. భక్తుల సేవా ఫలం :

వృషాద్రిపై శ్రీనివాసుని ఉత్సవములకు వచ్చే భక్తులను ఎవరైతే యథాశక్తి సేవిస్తారో వారికి శ్రీనివాసుడు కోరిన కోరికలను తీరుస్తాడు. లోభాది గుణములతో భక్తులకు కొంచెము కూడా ఉపకారము చేయనివాడు ప్రళయ కాల పర్యంతం భయంకర నరకంలో పడతాడు.


యః స్వామి సరసస్తీరే పుష్పోద్యానాని కారయేత్ ।
నందనోపవనే తస్య యావత్కల్పమవస్థితిః ॥

స్వామి పుష్కరిణీ తీరంలో పుష్పోద్యానవములను ఏర్పాటు చేసేవారు నందనోద్యానములో యుగ పర్యంతం నివసిస్తారు. స్వామి పుష్కరిణీ తీరంలో ఏ కొంచెం పుణ్యం చేసినా దాని ఫలితానికి అంతం లేదు. పూజ్యుడైన బ్రహ్మ ఈ విధంగా చెప్పి అంతర్ధానమయ్యాడు.

వామదేవుడు చెప్పిన ఈ వృత్తాంతమంతా విని మహా తేజశ్శాలియైన జనకుడు ఆనంద వికసిత నేత్రుడై, పులకాంకితగాత్రుడై యజ్ఞమును పరిసమాప్తి చేసి మంత్రులకు రాజ్య భారమును అప్పగించి వృషాద్రి శిఖరం పై ఉన్న పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీమన్నారాయణుని దర్శించుటకు బయలు దేరాడు.

❋ ❋ ❋

మూడవ అధ్యాయం



మూడవ అధ్యాయం

తీర్థ మాహాత్మ్యం

ఈ అధ్యాయంలో శ్రీ వేంకటాచలంలోని పది తీర్థముల మాహాత్మ్యములు వివరించబడినవి. ఇంకను 35 తీర్థములు ప్రస్తావించబడినవి.

3.1. 'తీర్థ' శబ్ద నిర్వచనం :

శ్రీ శేషాచలము అనేక పుణ్య తీర్థముల నిలయమ్మై నందున 'తీర్థాద్రి' అనే పేరుతో కూడా వ్యవహరింపబడుచున్నది. 'తీర్థ'పదము 'తరన్త్యనేన' 'దీనివలన తరిస్తారు' అనే వ్యుత్పత్తితో ఏర్పడింది. నిఘంటుకారులు 'ఋషిజుష్టజలేషు' అని తీర్థ శబ్దార్థమును వివరించినారు. 'జుష ప్రీతి సేవనయోః' అనే ధాతుపాఠము ననుసరించి మహర్షులు ప్రీతితో సేవించిన జలం తీర్థమని వ్యాఖ్యానించారు. ఏదైతే శుభప్రదమవుతుందో అదే పుణ్యమని అర్థము. పుణ్యాం చ తీర్థం చ పుణ్యతీర్థమని సమస్తపదమవుతుంది. హిమవంతుడు పరమేశ్వరుని ఆగమనంతో ఆసనార్ఘ్య పాద్యాద్యుపచారములను చేసి 'యదధ్యాసితమర్హద్భిః తద్ధి తీర్థం ప్రచక్షతే' అని అన్నాడు.

3.2. తీర్థ విభాగము :

తీర్థము లన్నిటిలోను ముఖ్యమైన పుణ్యతీర్థములను నాలుగు భాగములుగా విభజించడం జరిగింది.

1. ధర్మరతి ప్రదములైన తీర్థములు - 1008.
2. జ్ఞానప్రదములైన పుణ్య తీర్థములు - 108.
3. భక్తి వైరాగ్యప్రదములైన పుణ్య తీర్థములు - 68.
4. ముక్తి ప్రదములైన తీర్థములు - 7.

1. తీర్థతీర నివాసముచేత, స్నానముచేత, సేవనముచేత ధర్మాసక్తిని కలిగించేవి ధర్మరతిప్రదములైన తీర్థములు.

2. తనను సేవించే మానవులకు జ్ఞానమును ప్రసాదించి, భక్తి, యోగములను సంపాదించుటలో కృతకృత్యులను చేసేవి జ్ఞానప్రదములైన తీర్థములు. వాటిలో ముని తీర్థము, దేవ తీర్థము, అస్థి తీర్థము, శేషతీర్థాదులు ముఖ్యమైనవి.

3. మానవుల పాపములను నశింపజేయునవి, సంసారములో వైరాగ్యమును, పరమేశ్వరుని పట్ల భక్తిని కలిగించి,భక్తియోగం ద్వారా కృతార్థులుగా చేసేవి భక్తివైరాగ్య ప్రదములైన తీర్థములు. అవి చక్ర తీర్థము, పాండవ తీర్థము, జాబాలి తీర్థము, ఆకాశగంగ తీర్థము, పాపవినాశన తీర్థము, తుంబురు తీర్థము మొదలైనవి.

4. తీరనివాసంవలన, స్నానం వలన, త్రాగడం వలన జనుల సర్వపాపములను నివృత్తి చేసి ముక్తిసాధనకు తోడ్పడునవి పుణ్యతీర్థములన్నింటిలోను ముక్తినిచ్చే తీర్థములుగా ప్రసిద్ధిచెందినవి. ఇవి–

1. స్వామి పుష్కరిణి 2. కుమార ధార 3. తుంబురు తీర్థం 4. రామకృష్ణ తీర్థం 5. ఆకాశ గంగ 6. పాపవినాశ తీర్థం 7. పాండవ తీర్థం.

3.3. ప్రయాగ తీర్థ మాహాత్మ్యం :

పూర్వ కాలంలో గంగా యమునా సంగమ ప్రాంతంలో 'మాధవ'మనే పుణ్యక్షేత్రంలో బ్రహ్మ దేవుడు అనేక యజ్ఞాల ననుష్ఠించాడు. యజ్ఞవేది నుండి భక్తాభీష్టప్రదుడైన శ్రీమన్నారాయణుడు ప్రాదుర్భవించాడు. సంతుష్టుడైన బ్రహ్మ అనుగ్రహించమని శ్రీమహావిష్ణువును ప్రార్థించాడు. బ్రహ్మ అనుష్ఠించిన యజ్ఞాలతో తృప్తి చెందిన శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై "ఇక నుంచి

ఈ క్షేత్రం 'ప్రయాగ' అనే పేరుతో ప్రసిద్ధి చెందుతుంది. ఎల్లప్పుడు నేను ఈ యజ్ఞవేదిలో అంతర్భూతుడనై ఉంటాను" అని బ్రహ్మకు వరమిచ్చాడు. అనేక యజ్ఞాలనాచరించిన ఆ ప్రదేశం 'ప్రయాగ' అని ప్రసిద్ధి చెందింది.

ఒకానొకనాడు జనకమహారాజు పూజ్యుడు, సకలశాస్త్ర విశారదుడు, తత్త్వదర్శి అయిన శతానందుని ఉద్దేశించి 'నా కుమార్తె అయిన సీతను చూస్తే చాలా బాధ కలుగుతుంది. ఈ దుఃఖమెలా ఉపశమిస్తుంది? ఎవరిని ఆరాధిస్తే పాపపరిహారం జరుగుతుంది? దుర్మార్గుడు, దైత్యాధిపతి, కుబేరానుజుడైన రావణుడు అయోనిజ అయిన సీతను అపహరిస్తాడేమో? నాకైతే తెలియదు. ఉత్తమ వంశజుడు లేదా తత్సమాన వంశజుడైన పురుషుని వరునిగా పొందాలంటే ఎవరిని ఆరాధించాలి? నాకు ఊర్మిళ అనే యింకొక కూతురు ఉంది. కుశధ్వజుడనే పేరుగల తమ్ముడున్నాడు. అతనికి మాండవి, శ్రుతకీర్తి అను పేర్లు గల శీలవతులు, సుందరాంగులైన కూతుళ్ళు ఉన్నారు. బ్రహ్మదేవుడు వీరందరికి పెళ్ళి కొడుకులను ఎక్కడ సృష్టించాడో నన్న చింత నాకు ఉంది. వేదాంతులు, భగవద్భక్తిపరులు, మా కులగురువులునైన మీరే నాకు దిక్కు. వేదశాస్త్ర పురాణజ్ఞులు, త్రికాల వేద్యులు, దుఃఖితుల దుఃఖాన్ని పరిహరించేవారు నయిన మీరే నాకు శరణం. విషయాసక్తులు, కామక్రోధరతులైన రాజులనేకులు కన్యా నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. నేనొక్కడినే వారితో యుద్ధమెలా చేస్తాను? ఇలాంటి పరిస్థితుల్లో నేను రాజ్యపాలనమెలా చేయాలి? నాకు అజుడు, వివిక్తుడు, విమలుడు, విష్ణు భక్తుడు అనే నలుగురు పుత్రులు, బాలురు, ఉపనీతులైన వారున్నారు. కాని ధనుర్విద్యలో నిపుణులు కారు. నా సోదరుడికి విచికిత్సుడు, వికర్తనుడు, ప్రతర్దనుడనే ముగ్గురు పుత్రులున్నారు. నేను వృద్ధుడను, పుత్రులు చిన్నవాళ్ళు, పుత్రికలు యుక్తవయస్సు కొచ్చారు. అందువలన విచారిస్తున్నాను. నేను ఈ విచారం నుండి ఎలా బయటపడతాను? పూర్వం మన్వాదులు సంసార సాగరాన్ని ఏ

విధంగా దాటారో నాకు తెలుపండి. ఈ లోకంలో మానవులు ఆపద్బాంధవునిగా ఏ దేవుని ధ్యానించి ఐహికాముష్మికాలను పొందుతున్నారు? నాకు వివరంగా తెలుపండి' అని ప్రార్థించాడు.

3.3.1. శతానందుడు చెప్పిన పురాతనేతిహాసం :

అప్పుడు శతానందుడు జనకునితో ఇలా అన్నాడు –

మానవులు శ్రీమన్నారాయణునే శరణు పొంది సుఖాన్ని పొందుతున్నారు. అదేవిధంగా నీవు కూడా ఆ శ్రియఃపతినే శరణుపొంది దుఃఖసాగరాన్ని దాటగలవు.

ఒకానొక రోజు చంపకారణ్యము నుండి తమసానదీతీరానికి వాల్మీకి మహర్షిని చూడటానికి వెళ్ళాను. ఆయన నా రాకకు సంతసించి ఎదురేగి అర్ఘ్యపాద్యాది ఉపచారాలతో నన్ను పూజించాడు. మధ్యాహ్నకాల సంధ్యాదులను నిర్వర్తించి, వాల్మీకి–భరద్వాజాది మహర్షులతో కలసి భుజించి విశ్రాంతి పొందాను.

ఇంతలో శుద్ధస్ఫటిక సంకాశుడైన నారదమహర్షి 'మహతి' అనే వీణను ధరించి అక్కడికి వేంచేసాడు. ఆ నారదుణ్ణి చూసిన వాల్మీకి మహర్షి, నేను అంజలిబద్ధులమై శాస్త్రోక్తరీత్యా ఆయన్ని పూజించి, అర్ఘ్య పాద్యాదులను సమర్పించాము. నారదుడు ఫలమూలాదులను స్వీకరించి, తన శ్రమ దీర్చుకొని, 'మనోవాక్కాయరూప త్రివిధ తపస్సులు జరుగుతున్నాయా? మీ ఆశ్రమంలో చెట్లు ఫలవంతాలైనాయా?' అని వాల్మీకిని కుశల ప్రశ్నలు వేశాడు. అందుకు వాల్మీకి 'ఓ మహర్షీ! నీ అనుగ్రహంతో సర్వం సుసంపన్నం. మూడు కాలాలలోను నా తపస్సు నిర్విఘ్నంగా సాగుతున్నది. అకాలంలో కూడా చెట్లు ఫలిస్తున్నాయి' అన్నాడు. ఆ మాటలు విన్న నారదుడు చాలా సంతోషించాడు.

నారదుని రాకతో సంతుష్టుడైన వాల్మీకి అంజలి బద్ధుడై 'మీరు త్రిలోక సంచారులు. ముల్లోకాలలో శ్రేష్ఠమైన విష్ణుక్షేత్రమేది? ఎక్కడైతే సకల తీర్థాలు కలుస్తాయో, ఏ క్షేత్రవాసుల పుణ్య మనంతముని కీర్తింపబడుతుందో, ఏ పుణ్యక్షేత్రంలో శ్రీమన్నారాయణుడు భూలక్ష్మీ సహితుడై ఉంటాడో, ఆ త్రైలోక్యపావనక్షేత్రాన్ని నాకు తెలుపండి'. అని అడిగాడు. దానికి నారదుడు 'లోకకల్యాణకారకమైన ప్రశ్న వేశావు. సావధానంగా విను. పూర్వం హిమవత్పర్వతంలో కుమారస్వామి తన తండ్రియైన శివుణ్ణి ఈ విషయమై ఇలా ప్రశ్నించాడు. 'తండ్రీ! దేవాసురయుద్ధంలో తారకాసురుణ్ణి వధించి నీ సన్నిధిని చేరాను. బ్రహ్మహత్యాదోషంవల్ల ఆకలి బాధ నన్నెక్కువగా పీడిస్తున్నది. ఏ తీర్థంలో స్నానంచేస్తే భుజించగలనో ఆ తీర్థం గురించి చెప్పు'.

స్కందుని ప్రార్థను విన్న శివుడు "షణ్ముఖా!ఒకసారి 'నారాయణ'అని నామోచ్చారణ చేసిన పురుషునికి మూడు వందల కల్పములలో గంగాది సర్వతీర్థములలో స్నానము చేసిన ఫలితము లభిస్తుంది" అని చెప్పాడు. తండ్రి ఆదేశాన్ని విన్న స్కందుడు 'సరే'నని "సకల పాపపరిహారకుడుగా చెప్పబడిన శ్రీమన్నారాయణుడు జనులచేత ఏ విధంగా పూజింపబడి ప్రత్యక్షమవుతున్నాడు? అతనిని ఎక్కడ సేవించాలి? అతనికి ప్రీతిపాత్రమైనదేది?" అని ప్రశ్నించాడు. అప్పుడు శివుడు హృదయాంతర్వర్తి అయిన జ్యోతిస్వరూపుడు, ఓంకారవాచ్యుడు, అచింత్యరూపుడు, సూర్యమండలవర్తి ,ఆద్యంతరహితుడు, పురాణపురుషుడు, యోగులు ఆరాధించే ఆ పరమపురుషుని గురించి చెబుతాను విను.

పూర్వం దక్షయజ్ఞంలో నేను దక్షుని శిరస్సును ఖండించాను. అప్పుడు నాకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకొంది. దక్షశిరస్సును చేతిలో పట్టుకొని జితేంద్రియుడనై భిక్షాటనం చేస్తూ స్వర్గంలో సంచరించినా బ్రహ్మహత్య పరిహరింపబడలేదు. మేరు పర్వతంలో బ్రహ్మసరోవర తీరంలో ఘోరతపస్సు

నాచరిస్తున్న నన్ను స్నానం కోసం వచ్చిన బ్రహ్మ చూశాడు. నమస్కరిస్తున్న నా చేతిలో నున్న కపాలాన్ని చూసి ఏమిటిదని ప్రశ్నించాడు. 'దక్షుధవల్ల నేను శపింపబడ్డాను. బ్రహ్మహత్యాపరిహారం కోసం వెతుకుతున్నాను. నా భాగ్యవశాన మీరు కనిపించారు. పాపమోక్షాన్ని చెప్పండి' అని అర్థించగా బ్రహ్మ అందుకు 'విచారించకు బ్రహ్మహత్యాపరిహారం చెబుతాను విను -

3.3.2. ప్రయాగ క్షేత్ర నామౌచిత్యం :

పూర్వం గంగా, యమునా సంగమప్రాంతంలో మూడు వందల ధనువుల విస్తీర్ణం గల మాధవక్షేత్రంలో శ్రీమన్నారాయణుని ప్రీతికై అనేక యజ్ఞములు చేసితిని. అప్పుడు ఆ యజ్ఞవేది నుండి భక్తవత్సలుడైన శ్రీ మన్నారాయణుడు శంఖ చక్ర గదాధారియై శ్రీవత్సాంకుడై చతుర్బాహువులతో ప్రత్యక్షమయ్యాడు. ఆయనకు నమస్కరించి అనుగ్రహించమని ప్రార్థించితిని. అందుకు శ్రీమన్నారాయణుడు "బ్రహ్మ! నీవాచరించిన యజ్ఞములతో నేను సంతసించితిని. నేటినుండి ఈ ప్రదేశము 'ప్రయాగ' అను పేరుతో పిలువబడుతుంది[5]. నేనీ యజ్ఞవేదిలో నిరంతరం నివసిస్తాను. ఈ రోజు నుండి పాపాత్ములైన స్త్రీ పురుషులు క్షేత్రపాలకుడనైన నన్ను సేవిస్తే పాపరహితులవుతారు" అని శ్రీమన్నారాయణుడు వరమిచ్చి పుణ్యక్షేత్రమైన ప్రయాగలో లక్ష్మీసహితుడై నివసిస్తున్నాడు. కావున శంకరా! నీవక్కడికి వెడితే బ్రహ్మహత్యా దోషం నశిస్తుందని పలికి బ్రహ్మ సత్యలోకానికి వెళ్ళాడు.

5 శ్రీ వేదవ్యాసునిచే రచింపబడిన 'కూర్మపురాణం'లో ఒకానొక సందర్భంలో యుధిష్ఠిరుని ప్రశ్నకు సమాధాన రూపంలో ప్రయాగ క్షేత్ర వైశిష్ట్యం చెప్పడం జరిగింది. మత్స్యమహాపురాణంలోను వేదవ్యాసునిచే ప్రయాగ క్షేత్రముయొక్క శ్రేష్ఠత్వం, పావనత్వం వివరించబడింది.

బ్రహ్మవచనంతో సంతుష్టుడనైన నేను పుణ్యక్షేత్రమైన ప్రయాగను చేరితిని. క్షేత్రంలో ప్రవేశించినంత మాత్రం చేత బ్రహ్మహత్య నానుండి వేరుపడి అయిదు క్రోశుల దూరంగా జరిగి గట్టిగా ఏడుస్తూ వెళ్ళిపోయింది. నా చేతి నుండి కపాలము జారిపోయింది. ప్రయాగలో స్నానం చేసి మాధవునికి నమస్కరించి, ఈ క్షేత్రమును నాకు నివాసముగా నిమ్మని ప్రార్థించితిని. మాధవుడు సరేనని నన్నునుగ్రహించి శంఖ చక్ర గదాధారియై లక్ష్మీదేవితో కూడి ఈ ప్రదేశంలోనే తపస్సు చేయమని నన్నాజ్ఞాపించి వైకుంఠమునకు వెళ్ళాడు. నేను అదే క్షేత్రంలో తపస్సుచేసి, బ్రహ్మహత్యను పోగొట్టుకొని పార్వతితో సంచరిస్తూ, మనోహరరూపుడు, పాపపరిహారకుడు, నీలమేఘశ్యాముడు, పీతాంబరధారి, లక్ష్మీసహితుడైన శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ పూజిస్తూ నివసిస్తున్నాను.

3.4. చక్ర తీర్థమాహాత్మ్యము :

నారదుడు చెప్పిన ప్రయాగమాహాత్మ్యాన్ని విన్న వాల్మీకాది- మహర్షులు నారదుని ఈ విధంగా ప్రశ్నించారు - "కుమారస్వామి వృషాద్రికెళ్ళగా పుత్రవాత్సల్యం కల పార్వతి శంకరునితో కలిసి ఏమి చేసింది"? అందుకు నారదుడు ఇలా చెప్పాడు - "బంగారు రంగు కలిగిన కుమారస్వామి దేవసేనలతో కూడి ధనుస్సును, శక్తిని ధరించి తపస్సుకు బయలుదేరగా పుత్రవాత్సల్యముతో పార్వతి 'చిన్నవాడైన నా పుత్రుడు అక్కడ బ్రహ్మకు కూడా అశక్యమైన ఆ పరమాత్ముని ఎలా దర్శిస్తాడు?' అని ఈశ్వరుని ప్రశ్నించగా పరమేశ్వరుడు ఇలా అన్నాడు- 'అతిరహస్యమైనది, జరుగబోయేది చెబుతాను విను - మునీంద్రులనేకులు శ్రీమన్నారాయణుని దర్శించాలని ఘోరతపస్సు నాచరించడానికి ఆ పర్వతానికి వెళ్ళేస్తారు. దేవతలు, మానవులు, పితృదేవతలు, గంధర్వులు, యక్షరాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, గరుడులు, నాగులు, ఋషులు ఆపర్వతముపై పరమాత్మను కళ్ళారా చూడాలని తపస్సు నాచరిస్తారు. కొందరు

నన్ను, బ్రహ్మను కొందరు, సుబ్రహ్మణ్యుని కొంతమంది, ఇంకొందరు ఇంద్రుని అర్చిస్తారు. దేవతలతో పోరాడటానికి కొంతమంది రాక్షసులు కూడా మమ్మల్ని సంతోషపరుస్తూ ఘోరతపస్సునాచరిస్తారు. మనమిద్దరము చాలాకాలమునకు పరంబ్రహ్మ, పరతత్త్వమైన శ్రీమన్నారాయణుని దర్శించుటకు వెళ్ళగలము. శ్రీవేంకటాచలంలో అవతరించబోవు శ్రీమన్నారాయణునికై మనము కూడా తపస్సు చేయుదము".

3.4.1. సుదర్శనుడు శంకరుని సమీపించుట :

కాలమనే పేరుగల చక్రము నా కోసం తపస్సు చేస్తున్నది. అక్కడికి ఋషులతో కూడి మనము వెళ్ళవలసియున్నది. చక్రము నా వియోగముతో మిగుల దుఃఖిస్తూ విష్ణువుచే నాజ్ఞాపించబడి చక్రతీర్థములో నివసిస్తున్నది, అని శివుడు చెప్పగా పార్వతి, 'చక్రము సర్వకాలసర్వావస్థలలోను శ్రీమన్నారాయణుని చేతిలోనే ఉంటుంది కదా! అది మీ కొఱకు ఎందుకు తపస్సు చేస్తోంది? దానికి మీపై స్నేహమెలాంటిది?', అని అడిగింది. అప్పుడు శివుడు పార్వతితో, 'అద్యంతరహితము, పరాక్రమవంతమైనది, కోటి సూర్యులతో సమానమైన కాంతి కలిగిన సుదర్శన చక్రము శ్రీమన్నారాయణునిదే. శ్రీమన్నారాయణుడు తప్ప ఇతరులు దానిని ధరించలేరు. నా రాజధానియైన కాశీపట్టణం భూతబాధతో చక్రముచే దహింపచేయబడింది. కొంతకాలం తరువాత నా యందు అనుగ్రహముతో వరమివ్వవలెనన్న ఉత్సాహముతో నీకేమి కావాలని అడుగగా ఏ చక్రమైతే నా రాజధానియైన కాశీపట్టణాన్ని దహించిందో, ఆ చక్రము నా వశములో ఉండేటట్లు అనుగ్రహించమన్నాను. అప్పుడు విష్ణుమూర్తి ఇలా అన్నాడు– సహజసిద్ధములైన శ్రీదేవి, కౌస్తుభమణి, చక్రము, గరుడుడు, శార్ఙ్గము, ధనుస్సులు నన్ను విడచి యితరుల నాశ్రయించడమనేది జరుగదు. అశక్యమైనదానిని కోరావు. నామాట అసత్యం కాదు. కావున నీ కోరికసిద్ధించు గాక! ఈ సుదర్శనం ఏదో ఒక కారణంతో

అల్పమైన చక్రంశంలో బ్రహ్మచేత నిర్మించబడుతుంది. ఆవిధంగా అవతరించిన చక్రము నీ అధీనంలో ఉంటుంది. నీవు మరల నాకర్పించేటప్పుడు పూర్వరూపాన్నే పొందుతుంది. విష్ణువు నుండి వరముగా లభించిన వేయి సూర్యుల కాంతిని పోలిన చక్రమును నేను త్రిపురాసుర సంహార సమయంలో శ్రీమన్నారాయణునకు దక్షిణగా సమర్పించాను. బ్రహ్మచే నిర్మించబడిన చక్రమును చాలా కాలము దేవతలను రక్షించడానికి, రాక్షసులను సంహరించడానికి ధరించితిని. ఇప్పుడు నా వియోగమును భరించలేక నా కోసం తపస్సు చేస్తున్నది. వృషాచలానికి దక్షిణ దిక్కులో బహుప్రస్రవణనదీ తీరంలో చక్రాదులనే పదునేడు ఆశ్రమాలున్నాయి. అచ్చటి పదునేడు తీర్థములు బహు పవిత్రములైనవి. అక్కడే చక్రము కూడా తపస్సు నాచరించింది. పదునేడు తీర్థములలో మొదటిది చక్రతీర్థము. ఇది వజ్రతీర్థానికి దిగువగా ఉంది. అక్కడే కపిలుడు త్రాగి విడిచిన తీర్థముంది. అందులో స్నానం చేసిన మానవుల పాపాలన్నీ పరిహారమవుతాయి.

3.4.2. చక్రాది సప్తదశ తీర్థమాహాత్మ్యము :

విష్వక్సేనుని ఆశ్రమానికి పైన దివ్యమైన ఐదు సరస్సులున్నాయి. ఆ సరస్సులను ఎల్లప్పుడు శ్రీమన్నారాయణుని పంచాయుధములు ఆశ్రయించి ఉంటాయి. ఆయా ఆకారములతో నేటికీ పర్వతంపై కనిపిస్తుంటాయి. ఆ సరస్సులపై నున్న సరస్సులో అగ్నిహోత్రుడు తపస్సు చేశాడు. ఆ సరస్సు ఎక్కుటకు క్లిష్టమై, లోతుగా వుండి, పాపములను నశింపచేయునదై ఆగ్నేయ సరస్సుగా ప్రసిద్ధి చెందినది. ఆగ్నేయ సరస్సుపై నున్న బ్రహ్మ సరస్సు పవిత్రమైనదిగా పేరొందింది. దానిపైన సప్తర్షుల ఆశ్రమాలు, సరస్సులు విలసిల్లుతున్నాయి. ఈ పదిహేడు తీర్థములలో ప్రతి ఒక్కటి కూడా పాపపరిహారకముగా భాసిల్లుతున్నది. ఈ తీర్థముల దర్శనము, స్తుతి, స్నానము, సేవనము వల్ల పాపం నశిస్తుంది.

ఈ విధంగా శంకరుడు తెలుపగనే పార్వతి భక్తవశంకరుడైన భర్తతో 'స్వామీ! ఈ సరస్సుల మాహాత్మ్యాన్ని మొదటి నుండి వివరించు. వీటి మాహాత్మ్యము సకల లోకములకు హితము చేయునదై, పవిత్రమై, పుణ్యమును పెంచునదై యున్నది'.అనగా శంకరుడు పార్వతితో 'దుర్వాసుడడిగినపుడు బ్రహ్మ చెప్పిన మాహాత్మ్యమును చెబుతాను విను'మని ఇలా చెప్పసాగెను.

3.5. కపిల తీర్థము :

పాతాళలోకంలో కపిలముని చేత పూజింపబడిన కపిలలింగము కామధేనువు పాలచేత అభిషేకింపబడి, భూమిని ఛేదించుకొని వస్తూండగా చూసి కోపించిన కామధేనువు తన డెక్కను ఆ లింగంపై ఉంచి 'నీవు పెరుగ వద్ద'ని ఆజ్ఞాపించగా, డెక్కచేత అణగద్రొక్కబడటంతో అది పెరుగలేదు. ఆ లింగము మొదట్లో వెండి రంగును, మధ్యలో బంగారు కాంతిని, అగ్రభాగంలో ఎరుపు రంగును కలిగి, అయిదు ముఖములు త్రినేత్రాలు, అయిదు రంగులు కలిగి మహా భయంకరమై, సర్వదా పాతాళలోకంలో ఉండి, కపిల మహర్షి చేత పూజింపబడుట వలన కృత యుగంలో 'కపిలేశ్వర'మని త్రేతా యుగంలో అగ్నిచేత పూజింపబడుట వలన 'ఆగ్నేయ'మని కీర్తించబడినది. ఆద్యంతరహితమైన ఆ లింగము ద్వాపర యుగంలో చక్రము చేత, కలి యుగంలో కపిలమహర్షిచేత పూజించబడి మంగళకరమై అలరారుతున్నది.

కపిలలింగమునకు ముందు గొప్ప సరోవరము ఉంది. పాతాళము నుండి వెలుపలికి వచ్చిన కపిలమహర్షి యొక్క ద్వారము రహస్య మార్గముగా నుండటంతో 'కాపిల'మని పిలువ బడుతున్నది.

దర్శనాదేవ తత్తీర్థం సర్వాఘౌఘ వినాశనమ్,
దర్శనాత్ స్వర్గదం పుంసాం స్త్రీణామపి చ పార్వతి ।
స్నానే పానే కృతే తస్మిన్ జరామరణనాశనమ్ ॥

సకృత్స్నాతస్య తు ఫలం జనస్య శృణు పార్వతి ।
వాజపేయాశ్వమేధానాం పుష్కలం ఫలమశ్నుతే ॥

(23అ 44-46)

జలముతో నిండిన ఆ ఉత్తమ సరస్సు యొక్క దర్శనముతోనే సకల పాపములు హరించిపోతాయి. స్త్రీ పురుషులకు స్వర్గము లభిస్తుంది[6]. ఆ తీర్థ స్నాన పానాదులవల్ల వార్ధక్యము, మృత్యువు నశిస్తుంది. ఒక్కసారి స్నానము చేసిన మానవుడికి వాజపేయాశ్వమేధ యాగముల సంపూర్ణఫలము లభిస్తుంది. వాజపేయాన్ని అనుష్ఠించినవాడికి పునర్జన్మ వుంటుంది కాని ఒక్కసారి కపిలతీర్థ స్నానము చేసినవాడికి పునర్జన్మ వుండదు.

3.5.1. కపిల తీర్థస్నానకాల నిర్ణయము :

ప్రతి సంవత్సరం కార్తీకమాసం పౌర్ణమితిథి మధ్యాహ్న సమయంలో ముల్లోకాలలోని అన్ని తీర్థాలు ప్రాణి కోటిరక్షణకు పది గడియల కాలం కపిల తీర్థంలో సంగమిస్తాయి.

తత్ర స్నాతాస్తు యే పాపాః పురుషా యోషితోఽమలే ।
సర్వపాప వినిర్ముక్తా బ్రహ్మలోకం ప్రయాన్తి వై ॥

(23 అ 41)

అక్కడ స్నానం చేసిన మానవులు స్త్రీ పురుష భేదం లేకుండా సర్వ పాప విముక్తులై బ్రహ్మలోకాన్ని చేరుతారు. ఆ తీర్థసమీపంలో నువ్వుగింజంత సువర్ణాన్ని దానం చేస్తే మేరుసమానమవుతుంది. కపిల తీర్థసమీపంలో పిడికెడన్నమైనను దానం చేస్తే చంద్రలోకం చేరుతారు. ఇక్కడ కన్యాదానం, గోదానం, విద్యాదానం,

6. వరాహపురాణాంతర్గతమైన శ్రీవేంకటాచల మాహాత్మ్యములో కపిల తీర్థమాహాత్మ్యము వివరించబడినది (అ. 40,1-18)

భూదానం చేసిన వారికి, మంత్రోపదేష్టలకు స్వర్గ-కైలాస-వైకుంఠ-బ్రహ్మలోకాలు ప్రాప్తిస్తాయి.

వర్షే వర్షే తు కార్తిక్యాం పౌర్ణమాస్యాం మహాతిథౌ ।
ఆయాన్తి సర్వతీర్థాని మధ్యాహ్నే కాపిలం సరః ॥

అనే మంత్రం చెప్పి స్నానమాచరించిన మానవుడు ఆ ఫలితాన్ని పొందుతాడు. కపిల తీర్థస్నానం, శ్రీమన్నారాయణ పదముపదం అత్యంత దుర్లభమైనవి. ఇదే విధంగా వేంకటాచలంలో అధికాధికఫలప్రదాలైన తీర్థాలు కపిలతీర్థంలో సంగమిస్తున్నాయి. అందువల్ల భక్తులు తీర్థదర్శన, పానములచేత, అక్కడ ఆవిర్భవించిన కపిలేశ్వర దర్శనం చేత పరమోత్కృష్టమైన ఫలమును పొందుచున్నారు.

ఈ కపిల తీర్థం శ్రీవైష్ణవులచేత ఆళ్వారు తీర్థమని పిలువబడింది. ఇక్కడ గోవిందరాజస్వామి యొక్క ఉత్సవ సమయంలో అవభృథస్నానం, కార్తీక మాసంలో వనభోజనోత్సవం, తీర్థాభిగమనోత్సవాలు వైష్ణవ సంప్రదాయంలో జరుగుతాయి[7].

శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులు ముందుగా కపిల తీర్థంలో స్నానానుష్ఠానాదులు పూర్తికావించి, అక్కడ ఆవిర్భవించిన కామాక్షీ సమేతుడైన కపిలేశ్వరుని దర్శించి, తరువాతనే శ్రీవేంకటాచల యాత్రను చేయాలన్న కర్తవ్యాన్ని స్థలపురాణం స్పష్టం చేసింది.

కపిలతీర్థంపైన ఉన్న వజ్రతీర్థమనే సరస్సులో స్నానం చేసినవారు పది రెట్లు ఫలము పొంది దేవేంద్రలోకాన్ని చేరుతారట. వజ్రతీర్థముపైన ఉన్న విష్వక్సేన కుండంలో స్నానం చేసిన వారికి వందరెట్లు ఫలం లభిస్తుంది. ఈ విధంగా పదిహేడు తీర్థముల ఫలము చాలా గొప్పగా ఉంటుంది.

---

7. ఈ విషయం శ్రీ ఎన్.సి.వి నరసింహాచార్యులు, శ్రీమాన్ టి.ఏ. కృష్ణమాచార్యులు రచించిన 'తిరుమల సమయాచారములు' అనే తెలుగు అనువాదగ్రంథములో వివరించబడింది.

3.6. అస్థికూట తీర్థం :

మృతానా మస్థికూటాని ప్రక్షిప్తాని సరోవరే ।
యేషాన్తు పూర్వరూపాప్తే సముద్గచ్ఛన్తి తజ్జలాత్ ॥
తస్మాత్ తదస్థికూటాఖ్య మాగచ్ఛ సర ఉత్తమమ్ ।

మృతులైన వారి అస్థికలను ఈ సరస్సులో మజ్జనం చేస్తే పూర్వరూపాన్ని పొందుతారు. కావున ఆ సరస్సును అస్థికూట తీర్థమంటారు. అందువల్లనే ఆ సరస్సుకు అంత ఖ్యాతి ఏర్పడింది. ఈ తీర్థ మాహాత్మ్యం స్కాంద, బ్రహ్మాండ, భవిష్యోత్తర పురాణాలలో వివరింపబడింది.

3.7. కుమారధార తీర్థం :

అగస్త్యుడు పర్వతసానువులలో తిరుగుతూ ఒకరోజు ఎత్తైన పర్వత ప్రాంతం నుండి పడుతున్న, కార్తికేయునిచేత సేవింపబడిన, సర్వపాపహరమైన, పుణ్యాత్ములచేత, దేవర్షి సిద్ధ మానవులచేత సేవించ బడుతున్న కుమారధారను చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు.

నిర్మలోదకములతో కూడిన ఆ కుమారధార ఉన్నత శిఖరం నుండి నిర్మలమైన, దివ్యమైన, పవిత్రమైన పాపహరమైన సరస్సులో పడుతున్నది. అక్కడ మహాదేవపుత్రుడు, పరాక్రమవంతుడు, దేవసేనానాయకుడు, రాక్షసహన్తయైన కుమారస్వామి శ్రీమన్నారాయణుని ప్రీతికొఱకు ఘోరతపస్సు చేస్తూ, జగత్ప్రభువైన శ్రీనివాసుని మూడు కాలములలోను పూజిస్తున్నాడు. అటువంటి కుమారధార తీర్థమును అగస్త్యుడు సహచరులైన మునులతో కలిసి సమీపించి, సకల పాపహరము, పవిత్రము, నిర్మలమైన ఆ తీర్థంలో ఆచమించి, జితేంద్రియుడు నిర్మలాంతః కరణుడు, దేవదేవుడైన శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ, స్నానం చేసి, వాసుదేవుడు, జగత్కారణభూతుడైన దేవాదిదేవుని సుగంధభరిత దివ్య పుష్పములతో పూజించెను.

మహాత్ములైన ఋషులు కుమారధారా తీర్థములో స్నానం చేసి నిర్మలాంతఃకరణులై శ్రీమన్నారాయణుని పూజించి తేజోమూర్తి, జగత్కర్త, సకల పాప హరుడు అయిన శ్రీమన్నారాయణుని యందు నిశ్చలమనస్కులై వేంకటాచల నివాసి, వరదుడు, సకల లోక వంద్యుడు, ఆశ్రితార్తిహరుడు సర్వ జగత్ప్రభువు, శ్రీదేవీసహితుడై విహరిస్తున్న సురశ్రేష్ఠుడైన శ్రీనివాసుని యథారీతిగా పూజించి, పాపపరిహారాలైన తీర్థములను సేవించి, దేవ- దానవ- గంధర్వ-సిద్ధ-చారణ-నాగులు- వాలఖిల్యులు-ఋషుల చేత సేవింపబడుతున్న నిర్మల పర్వతాన్ని దర్శించారు[8].

పూర్వం ఒకానొక వృద్ధుడు పర్వతప్రాంతంలో సంచరిస్తూ భగవంతుడైన శ్రీనివాసుని కృపతో కుమారధారికలో స్నానం చేసి యౌవనవంతుడైనందున ఆ సరస్సుకు 'కుమారధారిక' అనుపేరు వచ్చింది.

మాఘమాసంలో సూర్యుడు కుంభరాశిలో వుండగా మఖా నక్షత్రయుక్త పౌర్ణమి నందు మధ్యాహ్న సమయంలో లోకపావనమైన కుమారధారికలో స్నానం చేస్తే బహుపుణ్యఫలమని సూతమహర్షి చెప్పాడు.

ఈ సరస్సు సమీపంలో పార్వతీపుత్రుడు, అగ్ని సంభవుడు అయిన కుమారస్వామి దేవసేనతో కూడి శ్రీనివాసుని అర్చిస్తున్నాడు. 12 సంవత్సరాలు గంగాదితీర్థాలలో నియమంగా స్నానం చేసిన వారికి వచ్చే ఫలితం ఈ సరఃస్నానం వల్ల లభిస్తుంది. ఈ తీర్థతీరంలో తన శక్త్యానుసారం బ్రాహ్మణునికి దక్షిణతో అన్నదానం చేస్తే వచ్చే ఫలితం స్నానం వల్ల లభిస్తుంది. కుమారధారా తీర్థ మాహాత్మ్యం వరాహ, పద్మ,స్కాంద, మార్కండేయ పురాణాలలో విస్తారంగా వర్ణించబడింది.

8. శ్రీస్కాందపురాణాంతర్గతమైన వేంకటాచల మాహాత్మ్యములో కుమారధార తీర్థమాహాత్మ్యం వివరంగా చెప్పబడింది.

3.8. ముప్పైఐదు పుణ్య తీర్థముల ప్రస్తావన :

అగస్త్యుడు సేవించిన తీర్థముల మాహాత్మ్యములను వామదేవుడు జనకమహారాజుకు ఈవిధంగా వివరించాడు. 'మహారాజా! ఆ తీర్థముల పేర్లను ఆశ్చర్యకరమైన వాటి మాహాత్మ్యములను చెప్పుటకు వంద సంవత్సరములు కూడా చాలవు. అవి –

1. వారాహం 2. వామనం 3. సౌమ్యం 4. పంచనదం 5. శిలాతోయం 6. మహాతీర్థం 7. పాద్మం 8. సౌరం 9. పాపనాశనం 10. ఐంద్రం 11. వాయవ్యం 12. వారుణం 13. బ్రహ్మతీర్థం 14. అఘఘ్నం 15. ఆగ్నేయం 16. సర్వకామదం 17. పంచతీర్థం 18. గౌరీతీర్థం 19. ఆశ్వినం 20. పారమేశ్వరం 21. చక్రతీర్థం 22. శంఖతీర్థం 23. విజయం 24. విమలం 25. శోకనాశనం 26. మత్స్యం 27. కౌర్మం 28. గారుడం 29. పాండవం 30. మాయామయం 31. మహాతీర్థం 32. కాండవం 33. కాహలం 34. దాడిమం 35. మధురం మొదలైన పుణ్య తీర్థాలన్నీ వేంకటాచలంలో విలసిల్లుతున్నాయి.

3.9. పంచ తీర్థ వర్ణన :

కపిల తీర్థమునకు పశ్చిమ భాగంలో పరమ పవిత్రము, పుణ్యప్రదమైన పంచ తీర్థమున్నది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, అంత్యజుల తీర్థములే పంచ తీర్థములు. అక్కడ పంచజాత్యభిమాన దేవతలు బహు సంతసముతో కపిల లింగమును చూస్తూ అంజనాచలంలో నివసిస్తున్న వరాహరూపుడైన శ్రీమన్నారాయణుని భక్తి భావంతో అర్చిస్తూ, కీర్తిస్తూ తపస్సు చేస్తున్నారు.

మొదటితీర్థం బ్రాహ్మణుల పుణ్య తీర్థము. ఈ తీర్థస్నాన పాన జపాదులవల్ల వెంటనే ఫలితం లభిస్తుంది. ఈ తీర్థమునకు క్రింది భాగంలో క్షత్రియులకు వరమిచ్చే మహాతీర్థముంది. దీని క్రింద వైశ్యులకు శీఘ్ర ఫలప్రదమైన

తీర్థముంది. దాని తరువాత శూద్రుల పాపనాశన తీర్థముంది. చతుర్వర్ణముల తీర్థముల క్రింది భాగంలో చండాలురపాపపరిహారకమైనతీర్థముంది. మహాప్రభువైన భగవంతుడు భక్తానుగ్రహాభీష్టముతో ఆయా తీర్థములలో నాలుగు వర్ణముల వారి ఆచారదోషములను నాశనం చేస్తాడు. వారికి శ్రీమన్నారాయణానుగ్రహం వల్ల శుభం కలుగుతుంది. ఈ తీర్థాలన్నీ శ్రీవేంకటాచలంలో విరాజిల్లుతున్నాయి. నదులన్నీ పాపహరములు. వాటి సంఖ్య లెక్కించడానికి వీలు లేదు.

ఈ పర్వతశ్రేణిలో అరవై ఆరు కోట్ల తీర్థాలున్నాయంటారు. అందులో కొన్ని నారాయణాద్రిలోను, కొన్ని అంజనాద్రిలోను ఉన్నాయి. పుణ్యమును కాంక్షించే దేవర్షి, సిద్ధ, గంధర్వ, యక్ష, రాక్షస, నాగ, గుహ్య, విద్యాధర, అప్సర, కిన్నర, గరుడ, దేవ, దేవేంద్రాదులు సేవించే పెక్కు తీర్థాలున్నాయి. కాని వాటి మాహాత్మ్యం వర్ణింప శక్యము కాదు. ప్రతి పర్వతంలో కనిపించే జలం ఆశ్చర్యకరమైనది. మహాపవిత్రంగా ఉంటుంది. ప్రాజ్ఞుడైన మానవుడు ఆయా తీర్థాలలో స్నానం చేసి మనశ్శుద్ధి కొరకు నిశ్చలచిత్తంతో అక్కడే నివసిస్తాడు.

3.10. స్వామి పుష్కరిణీ తీర్థ మాహాత్మ్యము :

సకల దోషపరిహారకమైన పర్వతమునకు ఉత్తర భాగంలో ఆరు పుణ్య తీర్థాలున్నాయి. అవి – 1. శాలివాహం 2. రోఘ్నం 3. శాంతం 4.సకల దుఃఖప్రశమనం 5. కృష్ణనిధ్యానం 6. స్వామి పుష్కరిణీ తీర్థం.

మహా పుణ్యప్రదము, సకల పాప హరమైన ఈ స్వామి పుష్కరిణీ తీరంలో శ్రీనివాసుడు లక్ష్మీసహితుడై విహరిస్తున్నాడు. దీని కీర్తి ముల్లోకాలు వ్యాపించింది. తెల్ల మేఘముల వలె ఉన్న రాజహంసలచే సేవింపబడునది, మత్తెక్కిన కోకిలల చేత, చక్రవాకముల చేత, పుష్పముల భారముతో వంగినటువంటి వివిధ వృక్షముల సమూహములతోను, జలార్థమై వచ్చిన పర్వత సమములైన ఏనుగులతోను, ఎలుగుబంటులు– సింహాలు– వరాహము–

తోడేళ్ళు-జింకలు-నక్కలు మొదలైన వాటి చేత కల్లోలితమైనది, నిర్మల జలము కలది, నూరు ధనుస్సుల పొడవు కలిగిన చంద్రకాంతమణుల వలె స్వచ్ఛమైన నీరు కలదిగా స్వామి పుష్కరిణి మిక్కిలి ప్రఖ్యాతి చెందింది. అన్ని తీర్థముల మాహాత్మ్యమును వర్ణించుటకు సాధ్యము కాదు.

నారాయణ పర్వతంపై ఉన్న తీర్థాలను చెప్పడం జరిగింది. స్వామి పుష్కరిణీ తీర్థము యొక్క ప్రభావము, మాహాత్మ్యం చెప్పుటకు దేవతలకు గాని, మానవులకు గాని అసాధ్యమైనది. స్వామి పుష్కరిణీ తీరములోనే శ్రీమన్నారాయణుడు స్వయముగా లక్ష్మీదేవితో అధిక సమయం విహరిస్తున్నాడు. స్వామి పుష్కరిణి సకల పాప హరమైనది, దేవర్షి గణసేవితము, ముల్లోకాలలోను ప్రసిద్ధిపొందినది, దేవపూజితము. ఈ తీర్థసేవనం వల్ల అనేక వేల పాపములను చేసిన మానవుడు కూడా పాపదూరుడవుతాడు. నారాయణ పర్వతముపై సర్వలోకములను మోహింపచేయునది, సర్వదోషవినాశిని, పరమేశ్వరి అయిన స్వామి పుష్కరిణి అన్ని తీర్థాలలోను శ్రేష్ఠమైనది.

సర్వదోషప్రశమనీ మాయైషా పరమేశ్వరీ ।
వరిష్ఠా సర్వతీర్థేభ్యః స్వామి పుష్కరిణీ నృప ॥

ప్రాతఃకాలములో లేచి 'స్వామి పుష్కరిణీ' అని ఏ మానవులైతే స్తుతిస్తారో వారు ఉత్తమ గతిని పొందుతారు. తీర్థ, స్నాన, దర్శనముల వలన మానవులు పాపదూరులు, దుఃఖముక్తులు అయి దివ్య విమానాన్ని ఎక్కి స్వర్గాన్ని చేరుతున్నారు. ఈ తీర్థ సేవనం వల్ల వేలాది పాపములు చేసినవారైనా పాపవిముక్తులవుతున్నారు. రోగులు రోగం నుండి, దుఃఖితులు దుఃఖము నుండి, మోహవశులు మోహం నుండి విముక్తులవుతున్నారు. దుఃఖసాగరంలో మునిగినవారు, దాని నుండి విముక్తిని పొందుతున్నారు. సంసార దుఃఖమువల్ల పరితప్తులైన వికల మనస్కులు స్వామి పుష్కరిణిని ఆశ్రయించి శుద్ధానంద రూపమైన పరబ్రహ్మను పొందుతున్నారు.

పూర్వము దేవాదిదేవుడు, సర్వ సమర్థుడు, లోకనాథుడు, అవ్యక్తరూపుడు అయిన శ్రీమన్నారాయణుడు మేఘ గంభీరమైన వాక్కుతో ఋషులు, దేవతలు వినుచుండగా 'సర్వ పాప ప్రణాశమైన గంగాది సకల తీర్థములలో స్వామి పుష్కరిణి శ్రేష్ఠమైనది' అని చెప్పెను.

ఈ విధంగా పరమ పవిత్రము, ప్రాచీనము, పుణ్యప్రదమైన స్వామి పుష్కరిణిని సేవించే మానవుడు పాప పరివేష్టుడైనప్పటికీ అతనికి ఏమీ అంటదు. స్వామి పుష్కరిణిని భక్తితో సేవించిన జనులు శ్రీకృష్ణుని అనుగ్రహంతో ఉత్తమ గతిని పొందుతారు. సకాములైన మనుజులు జితేంద్రియులై స్వామి పుష్కరిణిని సేవించి కోరిన కోరికలను పొందుతున్నారు. ఋషులు, వాలఖిల్యులు, సిద్ధులు స్వామి పుష్కరిణిలో స్నానం చేసి ప్రతి రోజూ శ్రీనివాసుని సేవిస్తున్నారు. వేల మంది గంధర్వులు, కిన్నరులు స్వామి పుష్కరిణీ తీరమును చేరి శ్రీనివాసుని స్తుతిస్తున్నారు. గంధర్వగానంతో శ్రీనివాసుని తృప్తిపరుస్తున్నారు. శుభలోచనులైన అప్సరలు అనేక రకాలుగా నాట్యములతో, గానములతో అహర్నిశము శ్రీమన్నారాయణుని పట్ల భక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈ స్వామి పుష్కరిణి భూలోకంలో దేవతాగణం చేత పూజింపబడుచుండుట ఆశ్చర్యకరమైన విషయము. ఈ పుష్కరిణి నారాయణాద్రిపై ఉండుట శ్రీమన్నారాయణుడు ఇది తనకు అత్యంత ప్రియతమమైనదని చెప్పుట ఆశ్చర్యకరమైన విషయములు.

3.10.1. స్వామి పుష్కరిణీ తీరంలో చేయదగిన అన్నదాన ప్రశంస :

జనకుడు వామదేవుడు చెప్పిన ఉదంతము సాంతము విన్నాడు. క్షేత్ర ఖండములో పుణ్యక్షేత్రాలు, పవిత్ర తీర్థముల నుద్దేశించి, ఆయా ప్రదేశాలలో చేయదగిన ముఖ్యమైన దానాలు గురించి చెప్పడం జరిగింది. ఈ నారాయణాద్రిపై ఏదేని దానం చేసిన మనుజుడు పాపదూరుడై పుణ్యవంతుడవుతాడు. నారాయణాద్రిపై స్వామి పుష్కరిణీ తీరంలో చేసే దానాలలో అన్నదానం

శ్రేష్ఠమైనది. ఈ వేంకటాద్రిలో నివసించే జనులకు ఎవరైతే అన్నపానాదులు సమకూరుస్తారో వారు ఈ జన్మలోనే సర్వరోగాలనుండి ముక్తులవుతారు-

నిత్యమస్మిన్నివసతాం అన్నపానాదికన్తు యః ।
ప్రయచ్ఛేత్ స ఇహైవాశు సర్వరోగై ర్విముచ్యతే ॥

యావచ్ఛక్త్యానుసారం వై సువర్ణం గామథాపి వా ।
వస్త్రాణి వసుధాం వాపి తిలాన్ గంధాననుత్తమాన్ ॥
యో దదాతి స దీర్ఘాయుః ఆరోగ్యఞ్చాపి విందతి ॥

భూదానం, స్వర్ణదానం, చందనాదిదానం, కన్యాదానం, తిలదానము ఏ మనుజుడైతే చేస్తాడో అతడు పుణ్యలోకాలు చేరి ప్రళయాంతం వరకు నివసించి ఉత్కృష్టమైన భక్తిని పొంది విష్ణులోకాన్ని చేరుతాడు.

నిష్కామో యో దదాత్యన్నం స్వామి పుష్కరిణీ తటే ।
స పుష్కలః ప్రశస్తాత్మా విష్ణుభక్తిం ప్రయాస్యతి ॥

ప్రత్యుపకారాన్ని ఆశించక స్వామి పుష్కరిణీ తీరంలో ఎవరైతే అన్నదానం చేస్తారో వారికి శ్రీనివాసుడు హరిభక్తిని ప్రసాదిస్తాడు. అచిరకాలంలోనే విష్ణుభక్తుడై యోగాన్ని పొంది పరమపదాన్ని చేరుతాడు. స్వామి పుష్కరిణిలో స్నానపానాదులవల్ల సకలపాపాల నుండి విముక్తుడై విష్ణులోకంలో పూజింపబడుతాడు.

యావచ్ఛక్త్యానుసారం వై సువర్ణం గామథాపి వా।
వస్త్రాణి వసుధాం వాపి తిలాన్ గంధా ననుత్తమాన్।
యో దదాతి స దీర్ఘాయుః ఆరోగ్యఞ్చాపి విందతి॥

తన శక్త్యానుసారం సువర్ణమును లేదా గోవును గాని, వస్త్రాలు గాని, భూమిని గాని, నువ్వులు గాని, సుగంధద్రవ్యాలు గాని ఎవరైతే దానం చేస్తారో వారు

దీర్ఘాయుర్దాయాన్ని పొందుతారు. సర్వాభీష్టములను పొంది సకల భోగాలను అనుభవిస్తారు. సకల పాపాల నుండి విముక్తులై ఉత్తమ గతిని పొందుతారు[9].

3.10.2. బ్రహ్మచెప్పిన స్వామి పుష్కరిణీ ప్రాశస్త్యం :

పూర్వము వామదేవుడు ఈ వేంకటాద్రిపైన అనేక సంవత్సరాలు పద్మాసనాసీనుడైన బ్రహ్మ గురించి ఘోరతపస్సు నాచరించాడు. చాలాకాలం పరమ పూజ్యుడైన బ్రహ్మ వామదేవుని తపస్సుకు సంతసించి సాక్షాత్కరించి, మేఘ గంభీరవాక్కుతో 'వామదేవా! ద్విజశ్రేష్ఠుడా! నీ తపస్సుకు మెచ్చితిని. నీ అభీష్టమును తీర్చుటకు వచ్చితిని. ఏ వరం కావాలో కోరుకో' మనగా వామదేవుడు 'ఈ పర్వతరాజంపై నెలకొన్న స్వామి పుష్కరిణీ మాహాత్మ్యమును యథార్థంగా తెలుసుకోవాలనుకున్నాను. స్వామి పుష్కరిణీ దర్శన, స్నాన, పానాదుల వల్ల, అక్కడ చేసే దానముల వల్ల ఎటువంటి ఫలం లభిస్తుందో దానినంతా వివరించమని కోరుతున్నాను' అని అన్నాడు[10]. అందులకు ఈ విధంగా సమాధానమిచ్చాడు –

స్వామి పుష్కరిణీ తీరంలో పాలకడలి నుండి ఉద్భవించిన చంద్రుడు సువర్ణాభరణాన్ని దానం చేసి చక్కదనాన్ని పొందినాడు. పూర్వం మన్మథుడు కన్యాదానం చేసి అందరూ కోరుకునేటటువంటి సుందర రూపాన్ని పొందాడు. కుబేరుడు సువర్ణాన్ని దానం చేసి ధనాధిపతి అయినాడు. పూర్వము స్వామి పుష్కరిణీతీరంలో ఇంద్రుడు షోడశ దానాలు చేసి దుర్జయులు, బలవంతులైన

---

9. శ్రీస్కాందపురాణాంతర్గతమైన వేంకటాచల మాహాత్మ్యంలో చేయదగిన దానముల శ్రేష్ఠత్వము, దాతలు, ఫలములు, ప్రతిగ్రహీతల యోగ్యతలను గురించి భగవాన్ వేదవ్యాసుడు విపులంగా వివరించినాడు.
10. ఈ తీర్థమాహాత్మ్యం వరాహ, పద్మ మార్కండేయ, స్కాంద బ్రహ్మ బ్రహ్మాండ, భవిష్యోత్తర పురాణాలలో వివరించబడింది.

రాక్షసులను జయించాడు. పూర్వం కావ్యవిదుడనే బ్రాహ్మణ శ్రేష్ఠుడు బ్రహ్మజ్ఞాన జిజ్ఞాసుడై ఈ పర్వతంపై చేరాడు. బ్రహ్మ అతనిని స్వయంగా పిలిచి శ్రేష్ఠమైన బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించగా అతడు వాచస్పతి అయ్యాడు. భూలోకంలో నివాసము, అందులోను శ్రీవేంకటాచలంలో నిత్యనివాసం చేస్తూ స్వామి పుష్కరిణీతీరంలో ఏదేని దానం చేసినవానికి పుణ్యా కర్మలనాచరించిన వారికి వచ్చే పుణ్యాలోకాలు ప్రాప్తిస్తాయి.

3.10.3. స్వామి పుష్కరిణిలో మూడున్నరకోట్ల తీర్థముల సంగమ కాలము :

పూర్వం గంగానదీ తీరంలో మార్కండేయ మహర్షి జగత్స్రష్టయైన బ్రహ్మ గురించి తపస్సు చేశాడు. చాల కాలం తరువాత లోకపితామహుడైన బ్రహ్మ మార్కండేయునికి ప్రత్యక్షమై 'ఏమి వరం కావాలో కోరుకో' మన్నాడు. అప్పుడు 'మార్కండేయుడు, ముల్లోకాలలో ఎన్ని పుణ్యతీర్థాలున్నాయో అన్నింటిని సేవించే శక్తి నివ్వ'మని కోరాడు. అతని కోరికను విన్న బ్రహ్మ నవ్వుతూ, 'లోకంలో ఉన్నటువంటి అన్ని తీర్థాలలో స్నానం చేయుటకు వంద సంవత్సరాలైనను నా చేత గాని, శివుని చేత గాని అసాధ్యం' అని వేరే ఉపాయం సూచించాడు. దక్షిణ దిక్కున రెండు వందల యోజనముల దూరంలో ద్రవిడ దేశంలో మహా పవిత్రమైన, దేవతలచే సేవింప బడుతున్న శ్రీవేంకటాచల మనే పర్వత శ్రేష్ఠముంది. ఆ పర్వతంపై పవిత్రమైన, పాపనాశినియైన, సర్వాభీష్టప్రదమైన స్వామి పుష్కరిణి అనే సరస్సు విరాజిల్లుతున్నది. ఆ పుష్కరిణి ముల్లోకాలలోని పుణ్యతీర్థాల కెల్ల శ్రేష్ఠమైనది.

మార్గశిరమాసంలో శుక్ల పక్ష ద్వాదశినాడు అరుణోదయ సమయంలో ముల్లోకాలలోని మూడున్నర కోటి తీర్థాలు స్వామి పుష్కరిణిలో సంగమిస్తాయి. పాపాత్ములైన జనులచే వివిధ తీర్థములలో వదలబడిన పాపములను ఆయా తీర్థములు ఈ తీర్థ సంగమన కాలంలో ప్రక్షాళిస్తున్నాయి. అందువల్ల నీవు

కూడా స్వామి పుష్కరిణిలో స్నానం చేసి పెళ్ళి ముల్లోకాలలో ఉండే తీర్థాల స్నాన ఫలము పొందుము.

సకల తీర్థములకు అధీశ్వరి అయినందువలన స్వామి పుష్కరిణి అనే పేరు వచ్చింది. ఈ భూలోకంలో గంగాది పుణ్యతీర్థాలు ఎన్ని ఉన్నాయో,మేరు పర్వత-కైలాస-మందర పర్వతాలలో,పాతాళంలో- సముద్రతీరంలో- ద్వీపాంతరాలలో- పుణ్య తీర్థాలలో చేసిన దాన-వ్రత- జప-హోమాదుల వలన కలిగే ఫలం శ్రుతి స్మృతి పురాణాలలో అనేక రకాలుగా చెప్పడం జరిగింది. ఆ ఫలమంతా ఒక్కసారిగా పొందే ఇచ్ఛ ఉన్నవారు మార్గశీర్షమాసంలో శుక్ల పక్ష ద్వాదశి రోజు మహా పవిత్రమైన వేంకటాచలంలో స్వామి పుష్కరిణీ తీరంలో వేదవేత్త, విష్ణుభక్తుడు, శాంత స్వభావుడు, నిర్ధనుడు, అసూయారహితుడైన బ్రాహ్మణునికి షోడశ దానాలలో ఏదేని ఒక దానం చేస్తే, ఆ దానం వల్ల సకల తీర్థాలలో దానం చేసిన ఫలితం లభిస్తుంది. ప్రసిద్ధమైన షోడశ దానాలలో ఏదేని ఒక దానాన్ని స్వామి పుష్కరిణీ తీరంలో మార్గశిర మాసం శుక్లపక్ష ద్వాదశి రోజున జితేంద్రియుడైనవాడు ఆచరిస్తే తీర్థాలన్నింటా షోడశ దానాలు ఒకేసారి చేసిన ఫలితం లభిస్తుంది.

'ధనుర్మాసే శుక్లపక్షే ద్వాదశ్యా మరుణోదయే సకల తీర్థాని స్వామి పుష్కరిణీ జలే సమాయాన్తి' అనే మంత్రం చెబుతూ స్నానం చేసిన మానవుడు సకల తీర్థస్నానఫలం పొందుతాడు. ఈ రహస్యాన్ని పూర్వం భగవాన్ మహావిష్ణువు తనతో చెప్పినట్లు చెప్పి మార్కండేయుడు చూస్తుండగనే బ్రహ్మ అంతర్ధానమయ్యాడు.

మార్కండేయుడు ఆశ్చర్యచకితమానసుడైసంతోషముతో నారాయణాద్రిలో పవిత్రమైన స్వామి పుష్కరిణిని చూసి, ఆ తీర్థ పానం చేసి, ఆ తీరప్రదేశంలో ఆవిర్భవించిన శ్రీశ్రీనివాసుని నిర్మలాంతః కరణంతో పూజిస్తూ అక్కడ మూడు సంవత్సరములు నివసించాడు. శ్రీనివాసానుగ్రహంతో మార్కండేయుడు ప్రతి

సంవత్సరం మార్గశిరమాసం శుక్ల పక్ష ద్వాదశి రోజున సకల తీర్థములు స్వామి పుష్కరిణిలో సంగమించడాన్ని చూసి శాశ్వత పరమానందాన్ని పొందాడు.

మార్గశిరమాసం ద్వాదశి దినమున స్వామి పుష్కరిణి తీర్థ వైభవాన్ని భక్తితో ఎవరు వింటారో, ఎవరు వినిపిస్తారో వారియెడల శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై సర్వాభీష్టములను ప్రసాదిస్తాడు. ఈ వేంకటాచలంలో మార్గశిరమాసం ఏకాదశి రోజు ఉపవసించి, శుక్ల పక్ష ద్వాదశి దినమున శాస్త్రానుసారం స్వామి పుష్కరిణీ తీర్థంలో స్నానం చేసి, ఆ తీర్థ తీర నివాసియైన శ్రీమన్నారాయణుని సేవిస్తే పాపవిదూరులై శాశ్వత మోక్ష సామ్రాజ్యాన్ని పొందుతారు.

3.10.4. జనకుడు వేంకటాచలమును చేరుట :

శాస్త్రాణాం పరమో వేదో దేవానాం పరమో హరిః ।
తీర్థానాం పరమం తీర్థం స్వామిపుష్కరిణీ నృప ॥

శాస్త్రాలలో వేదము ఉత్కృష్టమైనది. దేవతలలో శ్రీమన్నారాయణుడు శ్రేష్ఠుడు. తీర్థాలలో స్వామి పుష్కరిణి ఉత్తమమైనది. అందువల్ల జనకుడు కూడా నారాయణాద్రికి వెళ్ళి, నిర్మలాంతఃకరణుడై స్వామి పుష్కరిణిలో స్నానం చేసి, ఆ తీరంలో నివసించే సర్వప్రాణి శరణ్యుడైన శ్రీమన్నారాయణుని పూజించి సర్వాభీష్టములను పొందాడు.

నాలుగవ అధ్యాయం

నాలుగవ అధ్యాయం

ఉపాఖ్యానములు

ఈ అధ్యాయంలో శంకరుడు-స్కందుడు-విష్వక్సేనుడు- వాయుదేవుడు-సుదర్శనుడు మొదలగు దేవతల, అగస్త్యుడు మొదలగు మహర్షుల, శంఖమహారాజు-ఉపరిచరవసుమహారాజు మొదలగు రాజుల వృత్తాంతములు వివరించబడినవి.

4.1. స్కందచరితం :

4.1.1. బృహస్పతి చెప్పిన స్కందుని జన్మవృత్తాంతం :

విషణ్ణ వదనుడైన స్కందుని చూసి ఒకరోజు ఇంద్రప్రేరితుడైన బృహస్పతి "దేవసేనా నాయకుడా! మహాబాహో! విచారించకు కుమారా! నీ గురించి నేవెందుకు తెలుసుకోవు? నిత్యమైన వైకుంఠమును ఎందుకు స్మరించవు?" అని ప్రశ్నించాడు అందులకు సంతుష్టుడైన సుబ్రహ్మణ్యుడు "నా గురించి నాకు తెలియదు. నీవే నాకు చెప్పాలి" అని ప్రార్థించగా బృహస్పతి కుమారస్వామి జన్మకు కారణమును ఈ విధంగా చెప్పాడు.

తారకాసురునిచే బాధింపబడిన దేవతలు సేనాధిపతి నభిలషించి స్కంద జననానికి కారకులైనారు. పూర్వము దక్షప్రజాపతిచే అవమానింపబడిన సతీదేవి తన తపశ్శక్తితో అగ్నిని సృష్టించుకుని అందులో తన దేహాన్ని వదిలింది. అందుకు ఈశ్వరుడు సతీదేవిని తప్ప అన్యులను వివాహమాడనని ప్రతిజ్ఞ చేసి దిగంబరుడు, ఊర్ధ్వబాహుడై, ప్రాణవాయువు నరికట్టి ఆత్మస్వరూపాన్ని మనస్సులో ధ్యానిస్తూ ఘోరతపస్సు నాచరించాడు. అదే సమయంలో తారకాసురుడు బ్రహ్మను సంతృప్తి పరుస్తూ గొప్ప తపస్సు నాచరించగా, బ్రహ్మ సంతసించి వరమును కోరుకో మన్నాడు. ఈశ్వరుని పుత్రునిచేత తప్ప అన్యులచే మరణం లేకుండునట్లు వరమును కోరాడు తారకాసురుడు. అలాగే

నన్నాడు బ్రహ్మ. అందువలన తారకాసురుని చంపడం వేరెవ్వరికీ సాధ్యం కాలేదు.

సతీదేవి పర్వతరాజ పుత్రికగా జన్మించి దిన దినాభివృద్ధి చెందుతున్నది. ఆమెను శంకరునికిచ్చి వివాహం చేస్తే తారకాసురుని సంహరించు పుత్రుడు జన్మించగలడు. ధేవకార్యం నెరవేర్చుటకు రతీమన్మథులను నియోగించారు. మన్మథుడు శంకరుని తనవశం చేసుకొని పార్వతితో కూర్చడానికి పార్వతీ పరమేశ్వరుల సన్నిధానానికి వెళ్ళి ధనుస్సు నెక్కుపెట్టాడు. ఈశ్వరుడు తన తపస్సుకు భంగము కల్గుటవలన మన్మథుని తన మూడవ నేత్రముచే దహించి, తన ఆశ్రమానికి బయలుదేరాడు. స్త్రీసన్నిధానములో నుండటం తపశ్శాలులకు సాధ్యం కాదు. కాబట్టి కైలాసపర్వతమునకు ఉత్తర దిశలో నున్న ఆశ్రమానికి వెళ్ళాడు. అనంతరము పార్వతీదేవి తపశ్శక్తికి వశుడైన ఈశ్వరుడు ఆమెను వివాహమాడి మన్మథుని బ్రతికించాడు. కైలాస శిఖరంలో హిమవత్పర్వత ప్రదేశంలో అనేక వందల సంవత్సరాలు మనోభీష్టములను తీర్చుకుంటూ పార్వతితో విహరించసాగాడు. అంతట దేవతలు ఈశ్వరుని సమీపించి పాపాత్ముడైన తారకాసురునిచే పీడింప బడుచున్నామని, ఆ దుర్మార్గుని చంపుటకు సమర్థుడైన పుత్రుని ప్రసాదించమని కోరారు. దానికి రుద్రుడు దేవతలను వెళ్ళి పోవలసిందిగా ఆజ్ఞాపింపగా దేవతలు ఈశ్వరునికి కోపం వచ్చిందని భావించి పది దిక్కులకు పారిపోయారు.

అనంతరం శంకరుడు ప్రపంచమంతా క్షోభించేటట్లు తన తేజస్సును భూమి యందంతా వ్యాపించేటట్లు విడిచాడు. వ్యాపించిన ఆ తేజస్సును భూదేవి భరించలేకమరుత్తులతో 'ఈశ్వరుడు విడిచిన తేజమువలన దహింపబడుతున్నాను. నన్ను రక్షించం'డని వేడుకొంది. దానికి మరుత్తులు సమాధానం యివ్వకపోవడంతో దేవతలు అగ్నిని 'శంకరతేజమును నీ తేజముతో పాటు ధరించ'మని అడుగగా అందుకు సమ్మతించిన అగ్ని శంకర తేజమును ధరించాడు. దానికి సంతసించిన

పార్వతి 'అగ్నిహోత్రా! నీకు సత్పుత్రుడు కలుగు గాక! శంకరతేజమును ధరించినందువలన నీవు ప్రాణులందరిలోను జఠరాగ్నిగా విహరించుము. భక్త్యా యే త్వాం పూజయన్తి తేషాం పుత్రా భవన్తు వై (21అ.79) నిన్ను భక్తితో పూజించే వారికి పుత్రులు కలుగునట్లు వరమిస్తున్నా' నని పలికి మరుత్తులను చూసి 'ఈ నాటి నుండి మీ భార్యలు సంతానవతులు కాకుందురు గాక!' అని శపించి, భూదేవితో, 'నా పుత్ర రూపమైన శంకరుని తేజమును ధరించ లేదు కాబట్టి నీకు సంతాన సుఖము కలుగకుండును గాక మరియు అనేకులకు భార్యగా యుందువుగాక!' అని శపించి శంకరునితో కలిసి భృగుపర్వత సానువులలో తపమాచరించడానికి వెళ్ళింది.

అనంతరం దేవతలు ఖిన్న మనస్కులై బ్రహ్మతో, 'మీ ఆజ్ఞను పాటించితిమి గాని అది వ్యర్థమైనది. పార్వతి మమ్మల్ని శపించింది. మాగతి ఏమి?' అన్నారు. అందుకు బ్రహ్మ 'పార్వతి మాట పొల్లు పోదు. అది అలాగే జరుగుతుంది. మరొక ఉపాయం చెబుతాను. మీరంతా అగ్నిహోత్రుని ప్రార్థించి శంకరుని తేజము స్వీకరించండి తరువాత గంగను ప్రార్థించి ధరించుమని అడగండి' అని చెప్పాడు. దేవతలు గంగను ప్రార్థించగా గంగ అందుకు సమ్మతించి శంకరుని తేజాన్ని ధరించింది కాని భరింపనసాధ్యమై పార్వతి ఆశ్రమ సమీపంలోనే వదలగా, ఆ వనమంతా బంగారు మయమయింది. ఆవిధంగా పుట్టిన నిన్ను చూసి దేవతలంతా సంతసించి ఆరుగురు కృత్తికలను పంపగా, వారే నిన్ను పోషించారు' అని చెప్పి బృహస్పతి కుమారస్వామిని ఈవిధంగా స్తుతించాడు.

4.1.2. బృహస్పతి కుమారస్వామిని స్తుతించుట :

"దేవతల దుఃఖపరిహారకుడా! నీవు బాల్యంలోనే ఇటువంటి ప్రభావాన్ని కలిగి వున్నావు. మేలైన బంగారు రంగు కలవాడా! శంకరతనయుడా సుఖాన్నిచ్చేవాడా! నీవే విష్ణువువు, బ్రహ్మవు, రుద్రుడవు, కాలస్వరూపుడవు.

నెమలి వాహనుడవు, ఆరు ముఖములు కలవాడవు. యువకుడిగానే తారకాసురుని సంహరించినవాడవు. సుబ్రహ్మణ్యుడవు. స్కందుడవు. పదహారు సంవత్సరముల వాడవు, రెల్లులో జన్మించినవాడవు. శక్తి అనే ఆయుధమును ధరించినవాడవు. గంగాసుతుడవు, అగ్నిపుత్రుడవు, ఏకముఖుడవు, ద్విబాహుడవు, పురుషోత్తముడవు, తల్లులకు సంతోషము కలిగించవలెనని ఆరు ముఖములను ధరించినవాడవు. పార్వతికి ఆనందము కలిగించువాడవు. పన్నెండు చేతులతో ప్రకాశించు ఆయుధములను ధరించినవాడవు. పన్నెండు మంది సూర్యులను పోలిన కాంతి గలవాడవు. బాలసూర్యుని కిరణముల కాంతిచే వికసించి ప్రకాశించు పద్మములవంటి కాంతిగల నీ పాదాలకు నమస్కరించని వారికి సంతానం ఈ జన్మలో కలుగదు. ప్రకాశించు వాడవు, కోటి మెరుపుల కాంతిగలవాడవును, కిరాతాధిపతివి, కుమారుడవైన నిన్ను శరణు వేడుతున్నాను. మృత్యుంజయుడవైన ఓ స్వామీ! నాకు పుత్రుని ప్రసాదించు".

బృహస్పతి ఈవిధంగా స్తుతించగా శివ కుమారుడైన సుబ్రహ్మణ్యుడు సంతసించి, "బృహస్పతీ! నీవు కోరిన పుత్రులను మృత్యుంజయత్వాన్ని యౌవనాన్ని ప్రసాదిస్తున్నాను.

స్తోత్రేణానేన యో మర్త్యః త్వయోక్తేన గురో భువి,
ఆనందయతి మాం నిత్యం త్రిసంధ్యం మానవోత్తమః
స పుత్ర ధనధాన్యాది సంపదో లభతే ధ్రువమ్,
అపమృత్యుజయం చాపి సౌభాగ్యం రాజపూజ్యతామ్.

నీవు చేసిన ఈ స్తుతిచేత భూలోకంలో నన్ను మూడు కాలాలలోను ఉపాసించే వారు పుత్రులను, ధన ధాన్యములను, సంపదలను, సౌభాగ్యాన్ని, రాజమర్యాదలను పొందుతారు" అని వరమిచ్చాడు.

4.1.3. శంకరుడు వేంకటాద్రిని వర్ణించుట :

అటు పిమ్మట స్కందుడు తన తండ్రియైన ఈశ్వరుని సమీపించి, నా తపస్సుకు యోగ్యమైనది, శుభకరమైనది, తపోభంగం కలుగని పుణ్యక్షేత్రము ఏది? సంసారదుఃఖపరిహారకా! మునిగణ నమస్కృత పదయుగళా! నిర్మలానంద స్వరూపా! నీ ఆజ్ఞతో తపస్సు నాచరిస్తాను. పరమ పవిత్రమైన విష్ణుక్షేత్రమును తెలుపమని ప్రార్థించగా, సంతుష్టుడైన శివుడు దేవతల దుఃఖాన్ని పరిహరించు కుమారస్వామితో ఇలా అన్నాడు-

'పూర్వము వృషునిచే వృషాద్రి పూజింపబడినది. నీవు కూడా నెమలి వాహనుడవై అక్కడికి వెళ్ళి తపమాచరించు' మని చెప్పగా వృషపర్వతమని చెప్పిన పర్వతము కుల పర్వతములలోనిది కాదు. ఆ పర్వత మెక్కడ ఉంటుంది? అక్కడ వృషుడెందుకు తపస్సు చేశాడు? ఈ వృషుడనేవాడు వృషభమా? ధర్మమా? మనువా? ఎవరో తెలుప మని అడుగగా ఈశ్వరుడు వృషాద్రి వృత్తాంతమును ఈ విధంగా చెప్పాడు –

4.1.3.i. వృషాద్రి :

ఈ వృషాద్రి కులపర్వతము కాదు. మేరు పర్వత పుత్రుడు. గొప్ప పర్వతము. ముల్లోకాలలోను ఈ పర్వతము 'అంజనాద్రి'గా పేర్కొనబడి, బంగారు మయిమై రత్న సానువులతో అతిసుందరంగా ఉంటుంది. శేషవాయువుల సంవాదములో ఈ వర్వతము దక్షిణ దిక్కును ఎగురగొట్టబడింది. శ్రీమన్నారాయణుని సంకల్పము వల్లనే ఈ పర్వతము దక్షిణ దిక్కుకు చేరింది. ఈ అంజనాద్రి సర్వ తీర్థ స్వరూపమైనది, పవిత్రమైనది, పుణ్యప్రదమైనది. మానవులకు దుర్లభమైనది కావడంవల్ల ఈ దేవభూమిలో ఆ పర్వతాన్ని దక్షిణ దిక్కులో నివసించమని శ్రీమన్నారాయణుడు ఆజ్ఞాపించినప్పటికి ఆ పర్వతము తన తండ్రియైన మేరుపర్వతాన్ని విడిచి యుండలేక అచ్చటనే నివసిస్తున్నది. అనంతరం శేష

వాయువులకు లోకములను భయపెట్టేటట్లు వివాదం జరగడంతో తన తండ్రి మేరుపర్వతము ఆజ్ఞమేరకు దక్షిణ దిశకు వెళ్లి తూర్పు సముద్రానికి వెనుక అయిదు యోజనముల దూరములో దక్షిణ సముద్రానికి ఉత్తర దిక్కులో ముప్పది యారు యోజనములలో పవిత్రమైన సువర్ణముఖరీ నదీతీరమునకు ఉత్తర భాగంలో రెండున్నర క్రోశుల దూరములో పసుపురంగు గల చందన వృక్షములతో అలంకరింపబడిన అనేక రకముల వృక్షములతో కూడిన అందమైన వనములో వచ్చి చేరింది. ఆ పర్వతంపై సిద్ధులు, మునులు తపస్సు నాచరిస్తుంటారు. భగవంతుని, వేదములను దూషించేవారు ఆ పర్వతమును ఎక్కలేరు.

శుకాద్యా మునయః కేచిత్ భృగ్వాద్యాశ్చ తపోధనాః ।
ప్రహ్లాద ప్రముఖాః పుణ్యాః అంబరీషాదయో నృపాః ॥
విష్ణోరేవాపరం దేహం మన్వానాః తం నగోత్తమమ్ ।
పద్భ్యామాక్రమితుం భీతాః పర్యంతేష్వేవ వర్తనాః ॥
తన్నిర్గత నదీష్వేవ కుర్వాణాః స్నాన తర్పణే ।
తపః కుర్వన్తి వాంఛంతః సాక్షాత్కర్తుం జనార్దనమ్ ॥
ఏవంవిధః స శైలేంద్రో నిత్యమత్యంతపావనః ।
శిఖరం యస్య దృష్ట్వైవ సద్యః పాపైః ప్రముచ్యతే ॥

పరమ పవిత్రమైన ఆ పర్వతమును శుకమహర్షి, భృగుమహర్షి మొదలైన తపస్సంపన్నులు, ప్రహ్లాదాది పుణ్య పురుషులు, అంబరీషాది రాజులు, విష్ణువు యొక్క మరొకదేహముగా భావించి, దానిని పాదములతో తొక్కడానికి భయపడి, ఆ పర్వత సమీపంలోనే నివసిస్తూ ఆ పర్వతము నుంచి బయలుదేరిన నదులలోనే స్నాన తర్పణాదు లాచరిస్తూ, శ్రీమన్నారాయణుని ప్రత్యక్షం చేసుకోవాలని తపస్సు చేస్తుంటారు. కావున ఆ పర్వతం చాలా పవిత్రమైంది. ఆ పర్వత శిఖర దర్శనముతోనే పాపములు నశిస్తాయి.

వైవస్వత మనువు తన అధికారముతో లోకమును పాలిస్తున్నప్పుడు ధర్మము చక్కగా అభివృద్ధి చెందింది. ఆసమయంలో ధర్మరూపుడైన మనువు తపస్సు నాచరించాడు. అతడే వృషుడు. వృషుని తపస్సుకు మెచ్చిన వరాహస్వామి భూదేవితో కూడి శరత్కాలమేఘములాగా ప్రత్యక్షమై 'నీవాచరించిన తపస్సు వల్ల ధర్మము అభివృద్ధి చెందింది. కాబట్టి ఈ పర్వతము 'వృషాద్రి' అని ప్రఖ్యాతి చెందుతుంది. నీవు కూడా యమధర్మరాజు తరువాత లోకపాలకుడవుతావు' అని వరమిచ్చి ఆ పర్వత శిఖరములో అంతర్ధానమయ్యాడు. ధర్ముడు కూడా సంతసించి తన రాజ్యమునకు తిరిగి వెళ్ళాడు.

4.1.3.ii. వరాహక్షేత్రప్రశస్తి :

తత్రాఽస్తే కోలరూపీ తు మహావిష్ణుః సనాతనః ।
ఉద్ధృతాం ధరణీం దేవీమాలింగ్యాంకే నిధాయ చ ।।
ఆరాధితో మునిగణైః త్రిసంధ్యం శ్రద్ధయాన్వితైః ।
తదా ప్రభృతి తత్పుణ్యం వారాహం క్షేత్రముచ్యతే ।।
తస్మిన్ పుణ్యతమే క్షేత్రే వారాహే వేంకటాచలే ।
సన్నిధౌ భూవరాహస్య యే కేచిన్నియతవ్రతాః ।।
శాస్త్రోక్తేన విధానేన వారాహం మంత్రముత్తమమ్ ।
జపన్తి విజితాత్మానో మాసమేకం నిరన్తరమ్ ।।
గృహక్షేత్రాదికం తేషాం సద్యః సిద్ధ్యతి వాంఛితమ్

(21అ. 24-28)

వృషాద్రి పైననే శ్రీమన్నారాయణుడు తాను పాతాళము నుండి ఉద్ధరించిన భూదేవిని ఆలింగన మొనర్చుకొని తొడపై కూర్చునిపెట్టుకుని వరాహరూపంలో విరాజిల్లుతున్నాడు. ఋషుల చేత మూడు కాలాలలో శ్రద్ధతో పూజింపబడుతున్నాడు. అప్పటి నుండి ఆ క్షేత్రం 'వరాహక్షేత్ర' మని

పిలువబడుతున్నది. అటువంటి పుణ్యప్రదమైన వరాహక్షేత్రములో వేంకటాద్రి. భూదేవితో కూడిన వరాహస్వామి సన్నిధిలో నియమనిష్ఠలతో వరాహమంత్రమును ఒక నెలపాటు నిశ్చలమనస్సుతో జపించేవారి యభీష్టములు నెరవేరి, ఇష్ట భూములు వెంటనే ప్రాప్తిస్తాయి. చాలా కాలము రాజ్యపాలన చేయాలని వాంఛించే రాజులు షోడశదానాలు దక్షిణలతో ఆచరించి వరాహస్వామిని సంతృప్తిపరిస్తే, వారికి చిరకాలం సముద్రములచే చుట్టబడిన, బుద్ధిమంతులతోను- అజ్ఞానులతోను నిండిన దేశములతో కూడిన, ఆటంకములు-దుఃఖములు లేని భూమి ప్రాప్తిస్తుంది. లక్ష్మితో కూడిన వరాహరూప శ్రీమన్నారాయణుని తిరస్కరించి, రాజ్యపాలన చేయ తలపెట్టిన మానవుని రాజ్యము అతివృష్టి, అనావృష్టులతోను దొంగలతోను, శత్రువులతోను, పెద్ద రోగములతోను పీడింపబడుతుంది. అందువలన రాజు భూదేవీసహితుడైన వరాహస్వామిని శ్రద్ధాభక్తులతో పూజించాలి[11].

శ్రీవరాహస్వామికి ఎదురుగనే త్రైలోక్య పావనమైన సరస్సులో శ్రేష్ఠమైన 'స్వామి పుష్కరిణి' అనే సరస్సు కలదు. లోకంలో సకల ప్రాణికోటిని పవిత్రీకరించు తీర్థములు, పుష్కరిణులు తమను పవిత్రీకరించుకొనుటకై ప్రతి సంవత్సరం స్వామిపుష్కరిణిలో వచ్చి చేరుతాయి.

సకల చరాచరములకు ప్రాణస్వరూపుడు సకల ప్రాణులకు ఆధారమైన వాయువు అక్కడ తారకమంత్రమును జపిస్తూ, జపమాలతో లెక్కిస్తూ శాస్త్రోక్తముగా పరాత్పరుడైన శ్రీరాముని, భూదేవీసహితుడు-చతుర్భుజుడు-కిరీటధారి-నీలోత్పలుడు- దేవాదిదేవుడు-జగత్ప్రభువైన శ్రీమన్నారాయణుని సాక్షాత్కరింప చేసుకొనుటకు ఘోరతపస్సు నాచరించాడు. బ్రహ్మాది దేవతలు

---

11. శ్రీ వరాహక్షేత్ర మాహాత్మ్యం, దానికి సంబంధించిన అనేక విషయములు బ్రహ్మ, భవిష్యోత్తరపురాణములననుసరించి అనంతార్యులచే రచింపబడిన 'శ్రీవేంకటాచలేతిహాసమాల'లో వివరించబడినాయి.

కూడా దేవాదిదేవుడైన ఏ శ్రీమన్నారాయణుని స్థిరచిత్తులై సేవించాలని కోరుతారో అటువంటి సకల చరాచరములకు అంతర్యామి, భగవంతుడునైన శ్రీమన్నారాయణుని సాక్షాత్కరింప చేసికొనుటకు వాయువు భయంకరమైన తపస్సు చేస్తున్నాడని పరమేశ్వరుడు చెప్పగా విని దేవసేనాపతియైన స్కందుడు 'ఓ తండ్రీ! నాకు విష్ణు మంత్రముల కెల్ల ఉత్తమమైనది, మంత్రములలో శీఘ్రముగా సిద్ధించునది. భగవంతుని పొందుటకు సాధనమైన విష్ణు మంత్రాన్ని ఉపదేశించు'మని ప్రార్థించగా ఈశ్వరుడు యథాశాస్త్రముగా తన కుమారుడైన స్కందునికి తారకమంత్రము నుపదేశించాడు. మంత్రోపదేశాన్ని పొందిన స్కందుడు తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేసి బయలుదేరగా ఇంద్రాది దేవతలు కూడా బయలుదేరారు. ఆ విధంగా దేవతలతో కూడి నెమలివాహనుడై పయనించి, లక్షాపాతికవేల సెలయేరులతో కూడిన శ్రీవేంకటాచలాన్ని చేరి, ప్రయాణము వలన కలిగిన శ్రమను పరిహరించు ఆ పర్వతముపై కూర్చొని, అక్కడ తన తల్లిదండ్రులను కానక దుఃఖించాడు. ఆ పర్వతంలో సుందరమైన పవిత్ర స్థలంలో అందమైన సరస్సును చూశాడు. ఆ సరస్సు స్నానయోగ్యమైనదిగా, దేవతార్చనకు వలయు పద్మములతో కూడి ఉంది.

4.1.4. స్కందుని తపస్సు :

సుబ్రహ్మణ్యుడు ఆ సరస్సులో స్నానం చేసి, దాని తీరములోనే ఆసీనుడైనాడు. ఆ సమీపంలోనే తపస్సు చేస్తున్న వాయువును చూసి సుబ్రహ్మణ్యుడు శంఖచక్రధారియైన శ్రీమన్నారాయణుని మూడు కాలాలలోను ధ్యానిస్తూ, సమాధినిష్ఠుడై, ధ్యానయోగాన్ని అవలంబించి గొప్ప తపస్సు చేయసాగాడు. భూతలంపై నిలబడి బంగారు రంగుతో ప్రకాశించేస్కందుడు తనతండ్రి ఉపదేశించిన విష్ణుమంత్రాన్ని జపిస్తూ పరాత్పరుడైన శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ ఘోర తప మాచరించాడు.

చైత్రమాసంలో ఒకానొక శుభదినమున మూడు వేళలలోను దేవ గంధర్వ కిన్నరుల చేత ఆరాధింప బడుచు, అప్సరసల నృత్యములతో గీత వాయిద్యములతో సేవించబడుచున్న శ్రీమన్నారాయణుని సంతృప్తిపరుస్తూ వేంకటాచలంలో ఉత్తర భాగంలో 'కుమారధారికా' అనే పేరుగల పుష్కరిణీతీరంలో స్కందుడు తపస్సు చేస్తుండగా, దుస్సహమైన భయంకర రూపిణియైన బ్రహ్మహత్య వేంకటాచల శిఖరాగ్రాన్ని చూడగానే కుమారస్వామిని వదలి దూరంగా వెళ్ళిపోయింది[12]. కుమారస్వామి శేషాద్రిపై శ్రీనివాసుని సన్నిధిలో నివసిస్తూ, నిత్యము ఆయనను సేవించే అభిలాషతో తిరిగి వచ్చుటకు ఇష్టపడలేదు.

4.2. విష్వక్సేన వృత్తాంతము :

విష్వక్సేనుని జన్మ కర్మవశముతో వచ్చినది కాదు. పూర్వము దేవతలు ప్రార్థించగా విష్వక్సేనుడు శ్రీమన్నారాయణుని ఆజ్ఞాబద్ధుడై శ్రియఃపతితో సమానమైన పరాక్రమము కలిగినవాడై అవతరించాడు.

పూర్వం కృత యుగంలో 'కుంతల' అనే పేరుగల అప్సరస సుందరమైన దుర్వాసాశ్రమానికి ఇంద్రప్రేరితురాలై వచ్చి, నిర్మలాంతఃకరణుడైన దుర్వాసుని ఎదురుగా నాట్యం చేసింది. తన ఎదురుగా ఉన్న అందగత్తెను చూసి కుపితుడైన దుర్వాసుడు 'దుర్బుద్ధీ! నల్లని ముంగురులు కల కుంతలా! నీవు కిరాతి వగుదువు గాక!' అని శపించాడు. భీతురాలైన కుంతల చేతులు జోడించి నమస్కరించి 'నేను పరాధీనను, నా చెడు ప్రవర్తనను మన్నించు'మని అర్థించగా, ఆమెను చూసి మహర్షి 'నా మాట ఎప్పటికీ అబద్ధం కాదు. నీకు శాపమోచనం చెబుతాను.

---

12. కుమారధారాతీర్థ స్నానం వల్ల, అక్కడ నెలకొన్న శ్రీనివాసుని సేవనంవల్ల స్కందునికి తారకాసుర సంహారం వలన ఏర్పడిన బ్రహ్మహత్యాదోషము పోయినట్లు మార్కండేయ పురాణము స్కాంద పురాణములు కూడ వర్ణించినవి.

నీకు పుత్రప్రాప్తి కలుగగనే మరల స్వర్గానికి వెళ్ళగలవు' అని చెప్పగానే 'నీ దయవల్ల పరాక్రమంలో విష్ణు సమానుడు, దీర్ఘాయుష్మంతుడు, తపోనిష్ఠుడు అయిన పుత్రుని కనగల'నని చెప్పగా, అందుకు 'తథాస్తు' అని వరమిచ్చాడు దుర్వాసుడు.

'వీరబాహువు' అనే పేరుగల కిరాతుడు సంతానహీనుడు. అతనికి 'కుంతల' పుత్రికగా జన్మించింది. సంతోషంతో ఆమెకు 'సువర్చల' అని పేరు పెట్టాడు. ఆమె సౌందర్య సౌకుమార్య సద్గుణాలతో స్త్రీలోకంలో ఉత్తమురాలుగా ఉండేది. తండ్రియైన వీరబాహువు ఆమెను ధర్ముని పుత్రుడైన భద్రునికిచ్చి వివాహం చేశాడు. ఆమె యౌవన మధ్యంలో బలిసిన ఎత్తైన కుచములు కలిగి, సన్నని నడుముతో సౌందర్యరాశివలె ఉండేది.

ఒకానొక రోజు ఫాల్గుణమాసంలో శుభ దినమందు నర్మదానదిలో ఋతుస్నాతయై కొండచరియలో నిలబడిన సువర్చలను చూసి వరుణుడు సంగమించి 'సుందరీ! తృప్తిచెందితిని. నీకు కావలసిన వరమును కోరుకో' అని అడుగగా సువర్చల 'దేవా! మీకు తృప్తి కలిగితే నాకు ఉత్తమ పుత్రుని ప్రసాదించు'అని అడుగగా వరుణుడు 'తథాస్తు' అని పలికి అదృశ్యుడయ్యాడు. సువర్చల వరుణుడి ద్వారా వరమును పొంది సంతసించింది.

కొంతకాలమయిన తరువాత సువర్చల మేలిమి బంగారు ఛాయతో, పూర్ణచంద్రుని వంటి ముఖము, పద్మాల వంటి కనులు, శంఖ, చక్ర, గదా రేఖలతో ఎర్రని పాదములు కలిగిన పుత్రుని ప్రసవించింది. ఆ సమయంలో దేవదుందుభులు మ్రోగినాయి. ఆకాశము నుండి పుష్పవృష్టి కురిసింది. వాయువు చల్లగా వీచాడు. ఆ బాలుడు పుష్యమీ నక్షత్రంలో, కర్కాటకరాశిలో జన్మించినందువల్ల పరాక్రమశాలియై శుక్లపక్ష చంద్రునివలె వృద్ధి పొందాడు. కాని కుమారుడి పదవ ఏటనే సువర్చల మరణించింది. తండ్రి కూడా బాలుని వదలి వెళ్ళిపోయాడు.

అనంతరం ఆ బాలుడు కశ్యపాశ్రమాన్ని చేరాడు. ఆశ్రమానికి వస్తున్న బాలుని చూసి కశ్యపమహర్షి రూపలావణ్య సంయుతుడైన వరుణ పుత్రుడని, రాజకుమారుడని తెలుసుకొని, ప్రీతితో శిష్యునిగా స్వీకరించి గాయత్రీ మంత్రోపదేశమును చేశాడు. ఆ మహర్షి ద్వారా గాయత్రీ మంత్రోపదేశాన్ని పొంది శిక్షా వ్యాకరణాద్యంగములతో వేదములను అభ్యసించి, మహర్షి అనుమతితో తపస్సు చేయుటకు వృషభాచలమును చేరాడు. ఆయా నియమములతో చిరకాలం తపస్సుచేసి పన్నెండు సంవత్సరముల తరువాత ఆశ్వయుజ మాసములో పూర్వాషాఢా నక్షత్రమున శ్రీమన్నారాయణుని వల్ల వరమును పొంది, శ్రీమన్నారాయణుని సారూప్యమును సేనాపతిత్వాన్ని పొంది, శంఖ చక్ర గదాధరుడై, విష్ణ్వాజ్ఞాపాలకుడై, చక్రాది పంచాయుధాశ్రమాల క్రింద ఉన్న తన ఆశ్రమము నుండి నారాయణాద్రికేగి, గంధర్వులతోను, పదునాలుగు లోకాల పాలకులతోను, పరాక్రమవంతులతోను బిగ్గరగా అరచుచు భూతగణములతో, మండుచున్న మొనలు కలిగి ప్రకాశించుచున్న ఆయుధములతో కూడి పర్వతం నైఋతిదిక్కున నివసించాడు.

4.2.1. విష్వక్సేనుని పరాక్రమము :

విష్వక్సేనుని అనుచరులు అగస్త్యమహర్షితో తమ వృత్తాంతమును ఇలా చెప్పుకున్నారు–"మేము విష్వక్సేనుని అనుచరులము. అతడు బలపరాక్రమశాలి. సకల లోక నాయకుడు, మధుకైటభుల సంహర్త, బుద్ధిమంతుడు అయిన శ్రీమన్నారాయణుని అనుచరుడు. మేము అతని ఆజ్ఞాపాలకులము. జనులందరు ఎవరిని సమాహిత చిత్తులై సేవిస్తారో, స్థావరజంగమమైన ఈ జగత్తు ఎవరి వశంలో ఉంటుందో, దేవ దానవ గంధర్వ యక్ష నాగ ముని సిద్ధగణములన్నీ శ్రీమన్నారాయణుని సేవించినట్లెవరిని సేవిస్తామో, పూర్వం దేవదేవుని ఆజ్ఞతో వృషభరూపాన్ని ధరించినవాడు, ఇంద్రునితో సమానమైన పరాక్రమమును కలవాడైన రాక్షసుని ఎవరు హతమార్చాడో, భయంకరమైన రోమాంచితమైన

దేవాసురయుద్ధంలో వందల కొలది రాక్షసులను ఎవరు చంపారో, ఎవరు అన్ని కాలాలలోను సృష్టికర్తయైన శ్రీమన్నారాయణుని ఆజ్ఞానువర్తియై ఉంటారో, ఎవరికి బలపరాక్రమాలు ఊహింప శక్యము కాకుండా ఉంటాయో, ఎవరైతే శ్రీమన్నారాయణుని పాదపద్మముల నాశ్రయించి యుంటారో, ఇంద్ర,దేవ, యక్షనాగగంధర్వ, గుహ్య, కిన్నెరలు, ఎవరి పాదపద్మము లనాశ్రయించి యుంటారో, ఎవరు కోపిస్తే దేవ, యక్ష నాగ, గంధర్వ, గుహ్య, కిన్నర, రాక్షసులతో కూడిన లోకముల నన్నింటిని ధ్వంసమొనర్చునో అటువంటి ప్రభావముగల విష్వక్సేనుడు సర్వలోకముల యందు ప్రసిద్ధి చెందియున్నాడు. మేము అతని అనుచరులమే" అని చెప్పుకున్నారు.

4.2.2. భగవంతునితో బ్రహ్మ నివేదన :

లోక పితామహుడైన బ్రహ్మ జగన్నాథుడైన శ్రీహరికి శిరస్సువంచి నమస్కరించి అంజలిబద్ధుడై ఈ విధంగా విన్నవించుకున్నాడు –

"జగత్ప్రభూ! సర్వ యజ్ఞస్వరూపా! అచ్యుతా! ఇంద్రాది దేవతలను రాక్షసులు జయించారు. యజ్ఞభాగాలను కూడా రాక్షసులే స్వీకరిస్తున్నారు. దేవతలకు యజ్ఞభాగాలు లభించడం లేదు. యుద్ధంలో రాక్షసులను సంహరించుటలో దేవతలు అశక్తులైనారు. శత్రువులైన రాక్షసులందరిని చంపవలసింది." బ్రహ్మ ఇలా ప్రార్థించగా శ్రీహరి నవ్వుతూ పరాక్రమశాలి అయిన విష్వక్సేనుని పిలిచి "భయంకరులైన రాక్షసులు దేవతా సమూహాన్ని పీడిస్తున్నారు. వాళ్ళు మహాపరాక్రమవంతులు, మాయావులు, భయంకరాకారులు, తేజస్సంపన్నులు, యుద్ధకుశలురు, జయింప శక్యము కానివారు, ఎదిరింప వీలులేనివారు. అటువంటి రాక్షసులను బంధుగణంతో సహా నీవు చంపుము"అని ఆజ్ఞాపించాడు.

4.2.3. దేవజిదాది అసురులు చేయు లోకోపద్రవములు :

జనకుడు 'పరాక్రమవంతుడైన విష్వక్సేనుడు శ్రీనివాసుని ఆజ్ఞను పొంది బలవంతులైన రాక్షసులను ఏ విధంగా సంహరించాడు? అతని చరిత్ర మహైశ్వర్యకరమైనది. ఆ విష్వక్సేనుని చరిత్రను విస్తారంగా వివరింపు'మని వామదేవుని ప్రార్థించాడు.

అంతట వామదేవుడిలా చెప్పనారంభించాడు– 'పూర్వము హిరణ్యాక్ష వంశోద్భవులైన దేవజిత్, మృత్యుజిత్, శత్రుజిత్తను ముగ్గురు సోదరులు ఉండేవారు. వారు మహామాయావులు, బలవంతులు, తేజోవంతులు. బ్రహ్మను ఆరాధించి దేవతలచేత మృత్యువు లేకుండా వరమును పొందారు. అందువల్ల అనేక రాక్షసులతో, మహామంత్రులతో శతసహస్ర వీరులతో కలిసి ప్రజలను పీడిస్తూ భూలోకంలో సంచరించారు. వారు సముద్రములను ఎండింపజేశారు. వారి ధాటికి పర్వతములు దద్దరిల్లినై. ప్రజలంతా నశించారు. యజ్ఞంలో హవిర్భాగాలను పొందవలసిన దేవతలు తమ హవిర్భాగాలను పొందలేకపోయారు. వారి భాగాలను మదోన్మత్తులైన రాక్షసులు భక్షించారు. యజ్ఞయాగాదులు జరుగలేదు. మునీంద్రులు తపస్సులు చేయలేకపోయారు. సూర్యుడు ప్రకాశించలేదు. అగ్నిహోత్రుడు వెలుగలేదు. భయంకర యుద్ధంలో అసురులు దేవతలను జయించారు. చివరికిదేవతలందరు నారాయణాద్రిలో నివసిస్తున్న శ్రీమన్నారాయణుని శరణు పొందినారు'.

ఈ విధంగా మదోన్మత్తులైన రాక్షసులు లోకంలో దారుణకృత్యాలు చేస్తుండగా విష్వక్సేనుడు శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో మహా పరాక్రమవంతులైన రాక్షసులను సంహరించుటకు ఏడు మంది బలశాలురైన మంత్రులతో మహాబల పరాక్రమోపేతులు, భూభారహరణ సమర్థులైన అనేక లక్షల మంది భూత సమూహములతో దేవతలతో కూడిన దేవేంద్రుని వలె వచ్చి నిర్మలాకాశంలో

ప్రకాశించాడు. బలవంతులు, పరాక్రమవంతులైన రాక్షసులు విష్వక్సేనుడు, అతని సైన్యం రాకను తెలుసుకొని పాతాళలోక వాసులు, సముద్ర పర్వత నదీ నద అరణ్యములలో నివసించే భయంకరాకారులు, యుద్ధంలో ఎదురులేనివారు, యుద్ధాభిమానులైన దేవజిదాదులు రాక్షసులందరిని సమీకరించి విష్వక్సేనునితో యుద్ధం చేయుటకు బయలు దేరారు.

4.2.4. విష్వక్సేన, రాక్షససైనికుల యుద్ధ వర్ణన :

విష్వక్సేనుని సైనికులకు, రాక్షస సైనికులకు పరస్పరం యుద్ధం జరిగింది. దేవాసుర యుద్ధం వలె ఇరుసేనల మధ్య యుద్ధం మహా భయంకరంగా జరిగింది. వారిరువురు పరస్పరం అనేక భయంకరాయుధాలతో చంపుకున్నారు. యుద్ధంలో ఇరుపక్షాలు వదలిన అస్త్ర సమూహములతో ఆకాశం మండుతున్నట్లు కనిపించింది. అది చూసి ఆకాశంలో సంచరించేవాళ్ళు ఆకాశాన్ని వదలి పది దిక్కులకు పారిపోయారు. మహాపరాక్రమవంతుడైన దేవజితుడు వదలిన భయంకరములు, మాయాసముపేతములైన ఆయుధములు విష్వక్సేనుని సైన్యాన్ని మోహింపజేశాయి. అప్పుడు బుద్ధిమంతుడు, సకల మాయావిశారదుడు, బలవంతుడు అయిన 'మేధావి' అనే విష్వక్సేనుని మంత్రి తనమాయాబలంతో రాక్షసమాయను ఛేదించాడు. దివ్యమై ప్రకాశిస్తున్న, శత్రువులకు అభేద్యమైన, శ్రీమహావిష్ణువుచే ఇవ్వబడిన, అనేక రత్నములతో కూడి బంగారు నిర్మితమైన ధనుస్సును గ్రహించి రాక్షసులపై బాణములను వదిలాడు. ఆ శరాఘాతంతో వందలు, వేలకొలది రాక్షసులు తమ ప్రాణాలను వదలి నేలకూలారు. మరణించిన రాక్షసులను చూసి, 'మృత్యుజిత్' అనే దానవేంద్రుడు క్రోధావిష్టుడై తన మాయతో విష్వక్సేనుని సైనికులందరిని మోహింపజేశాడు. అప్పుడు శత్రుసంహారకుడైన 'శత్రుఘ్నుడ'నే విష్వక్సేనుని సైనికుడు మిక్కిలి కోపంతో సూర్యసమానకాంతి కలిగిన ఖడ్గాన్ని ధరించి మెరిసే కుండలములు ధరించిన రాక్షసుని శిరస్సును ఛేదించాడు. కాని తెగిన శిరస్సు

మరల ఆవిర్భవించింది. శత్రుఘ్నుని వలన శిరచ్ఛేదనం జరిగిన శత్రుజితుడనే రాక్షసుడు భయంకరుడై విష్వక్సేనాదులను సంగ్రామంలో నిర్జించుటకు మహామాయను ప్రయోగించాడు. ఆ మాయచేత విష్వక్సేనుని సైనికులు నిస్తేజులైనారు. దానిని చూసి విష్వక్సేనుని మంత్రి 'కాలాగ్ని'అనే పరాక్రమశాలి క్రోధియగు భయంకరమైన రాక్షసమాయను నాశనం చేశాడు. అది చాలా ఆశ్చర్యకరమైనది. వెంటనే శత్రుజితుని సంహరించుటకు ప్రజ్వలిస్తున్న శక్త్యాయుధమును ప్రయోగించాడు. ఆ శక్త్యాయుధముతో రాక్షసులు నశించి నేలకూలారు. విగత ప్రాణులవలె నిశ్చేష్టులైనవారు మరల జీవించారు.

దేవజిత్తు, మృత్యుజిత్తు, శత్రుజిత్తులు ముగ్గురు క్రోధావేశముతో మూడు అగ్నులవలె ప్రకాశిస్తూ, బ్రహ్మదేవుడు యిచ్చిన దివ్యమైన ధనుస్సులను ధరించి ప్రకాశించారు. సృష్ట్యాదిలో బ్రహ్మ ప్రసాదించిన భయంకరమైన పాశుపతాస్త్రం, వాయవ్యాస్త్రం, వారుణాస్త్రం, సూర్యాస్త్రం, ఆగ్నేయాస్త్రం, ఇంద్రాస్త్రం, రౌద్రాస్త్రం, యముడిచ్చిన గాంధర్వాస్త్రం, భయంకరమైన జృంభకాస్త్రం, కుబేరాస్త్రం, వారుణాస్త్రం మొదలైన దివ్యాస్త్రములను విష్వక్సేనుని సేనపై ప్రయోగించారు. ప్రకాశిస్తున్న శత్రువులకు భయము కలిగించే బ్రహ్మాస్త్రము మొదలగు నాటి వలన ఆకాశము గ్రహరహితము, సూర్యరహితము అయినది. చంద్రుడు, నక్షత్రములు కనబడలేదు. చిలుకలు, గోరువంకలు చెట్ల నుండి పడిపోయినై. కల్పాంతము వలె అక్కడి ప్రకృతి అంతా కల్లోలితమైంది.

ప్రతాపవంతుడు, పూజ్యుడు అయిన విష్వక్సేనుడు ఆ భయంకర దృశ్యమును చూచి ఆశ్చర్యచకితుడై రాక్షసులను చూసి, 'బాగు బాగ'ని పలికి సంతోషించి సింహగర్జన చేసి మేలిమి బంగారువలె మెరుస్తున్న తన గొప్ప ధనుస్సును తీసి మహాపరాక్రమశాలియై, మరొక శార్ఙ్గము వలె వున్న ధనుస్సును మ్రోగించి నారాయణాస్త్రమును సంధించాడు. దేవాసురులచే ఎదిరింప శక్యముగాని ఆ నారాయణాస్త్రము ప్రళయకాలంలో అంతటిని దహించి నేల

కాలాగ్నివలె ప్రజ్వరిల్లింది. నారాయణాస్త్రముతో ప్రపంచమంతా క్షోభించింది. సముద్రములన్నీ కల్లోలితమైనాయి. పర్వతములు అదిరినాయి. జ్వలిస్తూ వస్తున్న, విష్వక్సేనుని చేత వదలబడిన నారాయణాస్త్రమును చూచి ప్రాణికోటి గోలపెట్టింది. యుద్ధాన్ని చూడాలని వచ్చిన వారంతా ఆకాశాన్ని వదలి అన్ని దిక్కులకు పారిపోయారు.

దేవతలు, మునీంద్రులు, తపస్సంపన్నులు భయంకరమైన ఆ అస్త్రమును చూచి ప్రళయకాల మాసన్నమైనదని భావించారు. ప్రాణికోటికి ఆదినాథుడైన శ్రీమన్నారాయణుడు విష్వక్సేనుని నిమిత్తంగా చేసుకొని రాక్షససంహారం చేశాడు. సంహారకౌతూహలుడైన విష్ణుమూర్తి సమయం కాని సమయంలో ఈ పని ఎందుకు చేస్తున్నాడో? మనకు లభించిన శ్రీహరిదర్శనం నిష్ఫలమౌతుందేమోనని దేవతలు పరస్పరం సంభాషించుకుంటూ శోకతప్తులై అన్ని దిక్కులకు వెళ్ళిపోయారు. అనంతరం పూజ్యుడైన విష్వక్సేనుడు సూర్యకాంతిని పోలిన కాంతిగల నారాయణాస్త్రమును వదిలాడు. మిక్కిలి భయంకరమైన ఆ అస్త్రము వృత్రాసుర సమాన పరాక్రమవంతులైన దేవజిత్తు మొదలైన రాక్షసేంద్రులను దహించివేసింది. ఈశ్వరుని చేత త్రిపురములు దహింప చేయబడినట్లు నారాయణాస్త్రము మొదలైన బాణాగ్నులచేత ఆ రాక్షససేన దహింపబడింది. దేవజిత్తు మొదలైన రాక్షసుల శరీరములు బాణాగ్నులతో దహింపబడుతుండగా గుఱ్ఱములతోను, రథములతోను, ఏనుగులతోను, తెగిన ఱెక్కలు గల పక్షులవలె భూమిపై పడ్డారు. కాలిపోయిన తలవెంట్రుకలు, వస్త్రములు, భూషణముల చేత భూమినంతా కప్పివేస్తూ వేలకొలది రాక్షసులు నేలకూలారు. మిక్కిలి భయంకరమైన, యుద్ధములో జయింప వీలులేని, మహావేగము గల రాక్షస సేనంతా అస్త్రములచే దహింపబడి ప్రాణి కోటికి కాని, దేవతలకు గాని కనిపించకుండా పోయింది. రావణవధ అనంతరం యిటువంటి భయంకర యుద్ధము జరుగలేదు.

4.2.5. దేవాదులు విష్వక్సేనుని స్తుతించుట :

అనంతరము దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, నాగులు, సర్పములు, సాటిలేని ప్రభావశీలురైన మహర్షులు నేలపై పడి ఉన్న రాక్షసులను చూసి మహాపరాక్రమశాలి, శ్రీమన్నారాయణుని సేనాపతి అయిన విష్వక్సేనుని వీక్షించి చలిస్తున్న నేత్రములతో శిరస్సులు వంచి నమస్కరించారు. అనంతరం దేవతలందరు మిక్కిలి సంతుష్టులై రాక్షసులను హతమార్చిన ధనుస్సును ధరించిన విష్వక్సేనుని చుట్టుముట్టి "పూజ్యుడవైన విష్వక్సేనా! దేవతలకు అసాధ్యమైన పనిని నీ పరాక్రమమునకు తగినట్లు చేసితివి. ఈ రాక్షసులను మహాపరాక్రమశాలివైన నీవు తప్ప అన్యులెవ్వరు యుద్ధంలో జయింప శక్తులు కారు" అని స్తుతించారు. వారీవిధంగా స్తుతించగా మహానుభావుడైన విష్వక్సేనుడు దేవతలందరిని పూజించి, వారందరు చూస్తుండగానే పరివారముతో సహా వాహనములతో అంతర్ధానమైనాడు[13].

4.3. వాయుదేవుని చరితము :

శంకరుడు పార్వతికి వాయుదేవుడు చేయు తపఃప్రభావము గురించి చెప్పసాగాడు.

వాయువు ఎండాకాలములో పంచాగ్నుల మధ్య నిలచి, వర్షాకాలములో భూమిపై నిలచి, హేమంత శిశిర ఋతువులలో స్వామిపుష్కరిణిలో శయనించి తపస్సు చేస్తాడు. ఈ విధముగా వేయి సంవత్సరములు గడచినంతనే శ్రీమన్నారాయణుడు వాయువుకు సంతోషము కలిగించుటకు అవతరిస్తాడు. అనంతరము శంఖరాజుకు తృప్తి కలిగించుటకు, అతని నిమిత్తంగా

---

13. వద్దిపర్తి రాజారావుచే రచించబడిన 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యము' అనే వచన గ్రంథంలో విష్వక్సేనుని వృత్తాంతము, మహిమావిశేషాలు విస్తృతంగా వివరించబడినాయి.

సకలలోకహితార్థమై శ్రీమన్నారాయణుడు విశ్వవిఖ్యాతము, పవిత్రమునైన వేంకటాచలము నందావిర్భవిస్తాడు. ఆ కారణము వల్లనే మనము కూడా పోయి తపస్సు చేద్దాము. చాలాకాలము తరువాత దేవతలందరు మహర్షులతో వెళ్ళగలరు. అక్కడ మనము విష్ణుభక్తి పరాయణుడైన స్కందుని చూడగలము.

అనంతరము చాలాకాలము గడచిన తరువాత శంకరుడు వేంకటాచలానికి వెళ్ళగోరి కుమారుణ్ణి చూడాలనుకుంటున్న పార్వతితో వేంకటాచలానికి వెళ్ళు సమయమాసన్నమైనదని చెప్పగా, పార్వతీదేవి వాయువు యొక్క తపస్సు పూర్తి అయిందా? అని అడిగింది. అప్పుడు శంకరుడు అతని తపస్సుకు మెచ్చి శ్రీమన్నారాయణుడు అతనికి వరము లిచ్చాడన్నాడు.

4.3.1. ప్రత్యక్షమైన భగవంతునుద్దేశించి వాయువు చేసిన విశ్వరూపస్తుతి :

వేయి సంవత్సరములు గడచినంతనే దేవాదిదేవుడు, దుష్టజన శిక్షకుడు, అనాదియైన శ్రీమన్నారాయణుడు శ్రీభూదేవులతో గరుత్మంతుని అధిష్ఠించి శేషునితోను, శంఖ, చక్ర,శార్ఙ్గ బాణములను ధరించి ప్రత్యక్షమయ్యాడు. సకల ప్రాణుల యందు సంచరించే వాయువు ప్రత్యక్షమైన శ్రీహరిని చూచి విస్మయముతో ఆసనము నుండి లేచి పిచ్చివానివలె తిరుగుతూ, సంతోషముతో పడుతూ, లేస్తూ, ఎగురుతూ, 'వృషాచలములో నేనెటువంటి అద్భుతమును చూసితిని' అని మతి భ్రమణంతో చైతన్య రహితుడయ్యాడు. క్షణ కాలానంతరము చైతన్యము పొంది శ్రీమన్నారాయణుని దర్శించాడు. వేదములచేతను, తపస్సు చేతను, యోగుల చేతను, మునుల చేతను దర్శింపనలవికాని, అనాదియైన శ్రీహరిని చూసి వాయువు మరల మరల సాష్టాంగపడుతూ వేదాంతయుక్తములైన మాటలతో వేదవేద్యుడైన శ్రీమన్నారాయణుని ఇలా స్తుతించాడు –

"ఓ దేవాదిదేవా! పురాణపురుషా! శ్రేష్ఠా! శ్రియఃపతీ! ఆద్యంతరహితా! గోవిందా! జయశీలా!సర్వవ్యాపీ! సృష్ట్యారంభకాలంలో మాయాసమన్వితుడవైన

నీవొక్కడవే పురుషుడవు. జగత్తునంతటిని జలమయంగా చేసి సాగరంలో శయనించావు. చరాచరములతో కూడిన జగత్తు నంతటినీ సృష్టించినవాడవు. బ్రహ్మవేత్తలలో అగ్రగణ్యుడైన బ్రహ్మ నీ నాభికమలము నుండి జన్మించాడు. నీవు రజోగుణముతో కూడి జగత్తునంతా సృష్టించావు. సత్త్వగుణంతో లోకాన్ని రక్షిస్తున్నావు. తమోగుణముతో జగత్తును సంహరిస్తున్నావు. బ్రహ్మరూపుడవైన నీ నుండి తొమ్మిది మంది ప్రజాపతులుద్భవించారు. ప్రజాపతులనుండే దేవతలు, మనుజులు, రాక్షసులు ఉద్భవించినారు. బ్రహ్మ కాపద వాటిల్లినపుడు నీవు మధుకైటభులను సంహరించావు. క్షీరసాగరమును మథించేటప్పుడు మంథరపర్వతమునకు ఆధారము లేని సమయంలో నీవు కూర్మావతారుడవై ఆధారమును కల్పించావు. పర్వతములతో, అడవులతో కూడిన భూమిని పాతాళము నుండి బయటకు తీసిన వరాహరూపుడవైన నీవు మహాత్ముడవు.

కృతయుగారంభంలో హిరణ్యాక్షుడనే రాక్షసుని హతమార్చి ప్రహ్లాదుని రక్షించుటకై సింహము తలను, సగము మనిషి శరీరమును ధరించి శ్రీదేవి సహితుడవై ఇనుప స్తంభము నుండి పుట్టి హిరణ్యకశిపుని సంహరించి మూడు లోకాలను రక్షించినవాడవు.

అనంతరము బలిచక్రవర్తి చేస్తున్న యాగమునకు నీవు ఇంద్రప్రేరణతో వాక్చతురులలో శ్రేష్ఠుడైన వామనుడుగా అవతరించి, బలినుండి మూడడుగుల స్థలాన్ని యాచించి, గ్రహించి, భూలోక భువర్లోకములను ఆక్రమించి ఇంద్రునకు ముల్లోకములను ఇచ్చావు. చంద్ర మండలమునకు వెళ్ళి పద్మాసనాసీనుడవై అమృతాధిపతివై చరాచర ప్రపంచమును కాపాడుతుంటావు.

పరశురామరూపుడవై రాజవేషములో నున్న రాక్షసులను చంపి, ఆ రక్తపుమడుగులో పితృదేవతలకు తర్పణముల నిచ్చి, భూమిపై రాజులేకుండా చేసి, అశ్వమేధ యాగము చేసి, కశ్యపునకు భూమిని దక్షిణగా దానం చేసి,

మహాసముద్రమునకు వెళ్ళి సముద్రముతో చుట్టబడిన రమణీయ సహ్యాపర్వతముపై తపస్సు చేశావు.

రాక్షసుడైన రావణుడు దేవకంటకుడుగా పుట్టిన సమయములో త్రేతాయుగంలో దశరథనందనుడైన రామునిగా పుట్టి, లక్ష్మణసహితుడవై సీతనపహరించిన రావణుని యుద్ధంలో పుత్రపౌత్ర పరిజన మంత్రివర్గములతో సహా సంహరించావు. బలరాముడవు, కృష్ణుడవు నీవే. కలియుగాంతములో కల్కిరూపుడవు కూడా నీవే[14].

నీవు అదితి పుత్రులలో విష్ణువువు, తేజశ్శాలులలో సూర్యుడవు, వసువులలో పావకుడవు, రుద్రులలో శ్రేష్ఠుడవైన శంకరుడవు, గ్రహాలలో బుధుడవు, దేవతలలో ఇంద్రుడవు, సిద్ధులలో కపిలుడవు, దేవర్షులలో నారదుడవు, యజ్ఞములలో జపయజ్ఞము,తపశ్శాలురలో తపస్సువు, యక్షులలో కుబేరుడవు, దండించువారిలో యమధర్మరాజువి, జలచరములలో మొసలివి, సముద్రములోని ప్రాణములకు వరుణుడవు, నదులలో గంగానది, సరస్సులలో సముద్రము, వాయువులలో ప్రాణవాయువు, బ్రహ్మలలో చతుర్ముఖ బ్రహ్మవు, జాతులలో బ్రాహ్మణుడవు, ఇంద్రియములలో మనస్సువు, మృగములలో సింహము, నాలుగు కాళ్ళ జంతువులలో ఏనుగువు, రెండు పాదములు కలవారలలో బ్రాహ్మణుడవు, పక్షులలో గరుత్మంతుడవు, సర్పములలో వాసుకివి, విషములలో కాలకూటవిషమువు, నాగులలో ఆదిశేషుడవు, కులపర్వతములలో మేరు పర్వతము, పర్వతములలో హిమవంతుడవు, వేదములలో సామవేదమువు, ఛందస్సులలో గాయత్రివి, మంత్రములలో ఓంకారమువు, పశువులలో కామధేనువువు, యజ్ఞభోక్తలలో అగ్నిహోత్రుడివి, స్థిరమైన పదార్థములలో పర్వతమువు, వృక్షములలో

14. వేదవ్యాసునిచే రచించబడిన శ్రీమద్భాగవత పురాణంలో భగవంతుడైన మహావిష్ణువు యొక్క దశావతార విశేషాలు అత్యద్భుతంగా కీర్తించబడినాయి.

అశ్వత్థమువు, సేనాపతులలో కుమారస్వామివి, పరాక్రమవంతులలో ఓర్పువు, బీజములలో అంకురము, ప్రాణులలో ప్రాణవాయువు, బ్రహ్మర్షులలో వసిష్ఠుడవు, సంచరించేవారిలో వాయువు, మహర్షులలో భృగుమహర్షివి, వేదవేత్తలలో వ్యాసుడవు, కవులలో వాల్మీకివి, ప్రజలలో ప్రభువువు నీవే అయివున్నావు. సకల లోకములలో తేజోబలసమన్వితమైన సత్త్వము నీవే యని తత్త్వవేత్తలు చెబుతున్నారు.

వేయి శిరస్సులు, వేయి భుజములు, వేయి పాదములు కల పరబ్రహ్మకు నమస్కారము. దేవా! నీ ఆయుధములు అనేక రకములుగా ప్రకాశిస్తూ తమ కాంతితో పది దిక్కులను వెలిగింప చేస్తున్నాయి. నీ ముఖములు ఉగ్రములై, కోరలతి భయంకరములై, సూర్యమండలమును పోలిన కాంతిగల కుండలములతో ప్రకాశిస్తున్నాయి. నీ స్థానము వేయి పాదపద్మములతో లేత సూర్యకిరణకాంతికి వికసించిన ఎఱ్ఱని పద్మములతో అలంకరింపబడింది. నీ పాదములతో భూమి, శిరములతో ఆకాశము, బాహువులతో దిక్కులు వ్యాపించియున్నాయి. వేదములే నీ నిట్టూర్పులు, చంద్ర సూర్యులే నీ నేత్రములు, కాంతికిరణములే నీ కనుగుడ్లు, జగచ్ఛరీరుడవైన నీకు నమస్కారము.

పద్దెనిమిది రెప్పపాట్లు కాలమును 'కాష్ఠ'అని అంటారు. అటువంటి ముప్పదికాష్ఠలని 'కళా'అని అంటారు. అటువంటి కళా-కాష్ఠ-క్షణములతో కూడినది, పగలు-రాత్రి కలది,కృత- త్రేత- ద్వాపర-కలి యుగములతో కూడిన కాలము శరీరముగా కలిగిన పురాణపురుషుడవైన నీకు నమస్కారము.

కాలమును ధరించేవాడవు, కాలస్వరూపుడవు, కాలములో వ్యాపించిన వాడవు, కాలకారణుడవు, కాలము తెలిసినవారికి తెలియరాని వాడవు, విశ్వరూపుడవైన నీకు నమస్కారము. అనాది కాలము నుండి స్థిరముగా నున్న ప్రాణులన్నీ నీ శరీరరూపములే. సకల ప్రాణులకు ధారక, పోషక, భోగ్యముల నిచ్చేవాడవు నీవే. నీవే ప్రాణరూపుడవు. ప్రాణాధారకుడవు, ప్రాణదాతవు, సర్వ

కర్మసాక్షివి, నిత్యుడవు, సర్వవ్యాపివి, అవికారుడవు, నిశ్చలుడవు, శరీరమును భరించేవాడవు, సత్వశరీరివి, శరీరములో జీవించేవాడవు, పుణ్య పాప కర్మలకు సంబంధము లేనివాడవు, అప్రాకృత దివ్యదేహుడవు, అణువులలోనే అణురూపుడవు, పెద్ద పరిమాణము కలవాటిలో గొప్పవాడివి, విశ్వమంతా వ్యాపించిన రూపము కల నీకు నమస్కారము.

పరమాకాశ పరమ పదవాసివి, వేదవేద్యుడవు ఆకాశగుణమైన శబ్దమయ వేదవేద్యుడవు, ప్రాకృత శబ్దముల కతీతుడవు, ఆకాశశరీరుడవు, అపరిచ్ఛిన్న ప్రాప్యస్థానమైనవాడవు, గరుడవాహనుడవు, వేదస్వరూపుడవు, వేదము తెలిసినవాడవు, వేదముచే సులభముగా తెలియ దగినవాడవు, వేదవేత్తలలో అగ్రగణ్యుడవు, వేదాంతముచే ఎఱుంగ దగినవాడవు. పరబ్రహ్మ స్వరూపుడవైన నీకు నమస్కారము.

నీవు నాశరహితుడవు, నశ్వరపదార్థములన్నిటికి కారణమైనవాడవు, నిత్య దివ్య దేహధారుడవు, చేతనా చేతన శరీరివి, గతించిన వస్తుస్వరూపుడవు, అవిచ్ఛిన్నానందము నిచ్చు మూలకారణభూతుడవు. అగ్నిలోని వేడి, నీటిలోని చల్లదనము, భూమిలోని సుగంధము, వాయువునందలి స్పర్శ, ఆకాశములోని నిర్మలత్వము నీవే. కేశములయందు మేఘములను, అవయవసందులలో నదులను, గర్భములో ఏడు సముద్రములను కలిగియున్న నీ జలరూపమునకు నమస్కారము.

స్తోత్రములతో స్తుతింపబడేవాడవు, స్తుతికారులకు ప్రియము కలిగించే వాడవు, స్తోత్రములచే తెలియబడువాడవు, స్తుతింపదగినవాడవు, స్తోత్ర రూపుడవు, అద్భుతమైన స్వరూపము కలవాడవు, శార్ఙ్గ ధరుడవు, భక్తప్రియుడవు, శాంతరూపుడవు, భక్తుల పాపములను నశింపచేయు శార్ఙ్గ పాణివి, జగత్పరిపాలకుడవు, రాక్షసహంతవు, రాక్షసులకు శత్రువువు, శ్రీవత్సలాంఛనుడవు, పద్మము చేతిలో

నుండి, పద్మముల లోపల నుండు రంగువంటి రంగుకలదై దివ్యాభరణములతో ప్రకాశిస్తున్న దేహము కలిగి సుందరరూపము కలిగిన లక్ష్మితోను, మోదుగవలె నల్లని శరీరము కలిగి, కలువను చేత ధరించిన భూదేవితోను ఇరుప్రక్కలయందు నాశ్రయింపబడిన వాడవు.

చరాచరములన్నీ నీ భయంకర రూపమును చూచి భయపడి యిటునటు సంచరిస్తూ నిలవలేక పోతున్నాయి. ప్రళయకాలములోని కోటి అగ్నిహోత్రముల వంటి కాంతులతో నిండిన లోకములు కలవాడా! రత్నములతో చేయబడిన భుజకీర్తులు కలవాడా! సహస్రభుజుడా! అనుగ్రహించుము. అనేక రత్న ఖచిత భూషణ కాంతులతో లోకములను ప్రకాశింపచేయువాడా! మెరుపులతో సుందరమైన నీలమేఘము లాంటి కాంతిగల స్వామీ! నీకు నమస్కారం. మిక్కిలి కాంతి కలిగి ప్రళయకాల సూర్యాగ్నులవలె ప్రకాశిస్తూ, కోరలతో భయంకరములై ఎక్కువగా గర్జిస్తూ విరాజిల్లుతున్న నీ ముఖములను చూసి భయపడుతున్నాను. అనుగ్రహింపుము. నీ దేహములో బ్రహ్మరుద్రాది దేవతలను, యక్ష గంధర్వ నాగులను చూస్తున్నాను. నాకు దిక్కులు తెలియకుండా ఉంది. సుఖము లేదు. నా అవయవములు శిథిలమవుతున్నవి. భక్తులపై దయ చూపేవాడా! అనుగ్రహింపుము" అని నమస్కరించి వాయుదేవుడు చేతులు జోడించి నిలువగా శంఖ చక్రగదాధరుడై శ్రీ భూదేవీ సహితుడైన శ్రీమన్నారాయణుడు సంతోషించి వాయుదేవునితో 'వరమును కోరుకో! నీకు మంగళమగుగాక' అనగా వాయుదేవుడు

వరం న యాచే దేవేశ! శ్రీనాథ! పరమేశ్వర ।
త్వత్సాన్నిధ్యం మమైవేదం నిత్యమస్తు రమాపతే ॥

(24అ. 78,79)

'నేను వరమును కోరను. నే నెల్లప్పుడు నీ సన్నిధానములో ఉండేటట్లు అనుగ్రహించు'మని ప్రార్థించాడు.

వాయుదేవుని ప్రార్థనను విన్న శ్రీమన్నారాయణుడు దేవతలందరు వింటూండగా ఇలా వరమిచ్చాడు-

"ఏతచ్ఛ్రుత్వా హరిః ప్రాహ దేవతానాం చ సన్నిధౌ ।
చతుఃషష్టిం త్వయోక్తానాం శ్లోకానాం యః పఠేన్నరః ॥
భుక్తిం ముక్తిం స లభతే మత్ప్రసాదాత్ న సంశయః ।
త్రిసంధ్యం యః పఠేత్ భక్త్యా పూజయన్ మామనన్యధీః ॥
షణ్మాసాన్మమ సాన్నిధ్యం లభతే స న సంశయః ॥

(24అ. 78,79)

వాయుదేవుడు స్తుతించిన ఈ అరవైనాలుగు శ్లోకములను పఠించు మానవుడు ఇహపరసుఖములను పొందుతాడనుటలో సందేహము లేదు. నిశ్చలమనస్సుతో మూడు కాలాలలోను భక్తితో ఆరు నెలల వరకు పఠించిన వారికి నా సాన్నిధ్యము తప్పక లభిస్తుంది. దేవతలకు కూడా అసాధ్యమైన అభీష్టములు నెరవేరుతాయి.[15]"

ఈ విధంగా వాయువు శ్రీమన్నారాయణుని నుండి వరమును పొంది దేవలోకమునకు వెళ్ళాడు.

4.4. సుదర్శన చక్రోపాఖ్యానము :

చక్రతీర్థంలో తపస్సు చేస్తున్న సుదర్శనుని ఎదురుగా శివుడు ప్రత్యక్షమయ్యాడు. ప్రత్యక్షమైన శివుని చూసి నమస్కరించి చేతులు జోడించి నిలిచాడు. సంతుష్టుడైన

---

15. పార్థసారథి భట్టాచార్యులు రచించిన 'వేంకటాచలమాహాత్మ్యము' (బ్రహ్మపురాణము) ఆంధ్రానువాదములో భగవంతుడైన శ్రీమన్నారాయణుని గురించి వాయుదేవుడు వేల సంవత్సరములు తపస్సు చేయగా ప్రత్యక్షమైన భగవంతుడు సకల ప్రాణులలోని ప్రధానాంగత్వాన్ని వరరూపంగా యిచ్చి అనుగ్రహించినాడని వివరించడం జరిగింది. వాయుసంచారం లేకపోతే మానవుడు జీవించుట కష్టము. ప్రాణుల ఉచ్ఛ్వాస నిశ్వాసములు వాయువునధీనములు. అందువల్ల వాయువుకు అత్యంత ప్రాధాన్యత యివ్వబడింది.

చంద్రశేఖరుడు 'సుదర్శనా! నీ తపస్సుకు సంతసించితిని. నీ అభీష్టమును తెలుపుము. దేవతలు కూడా పొంద శక్యముకాని వరమును కోరుకొనుము!' అన్నాడు. తన తపస్సుకు శివుడు సంతోషించాడని తెలుసుకున్న సుదర్శనుడు 'శంకరా! నీవు నా పట్ల ప్రసన్నుడవైనట్లైతే నా అంతరాత్మలో స్థిరముగా నుండి సమయాసమయములను బట్టి భయంకరుడవుగను, శాంత- రూపుడవుగను, వరముల నొసంగువాడవుగను, మృత్యుంజయుడవుగను విరాజిల్లు' మని కోరినాడు. శంకరుడు చాలా సంతోషించి సర్వోత్తమమైన చక్రముతో 'మహాబాహో! సుదర్శనా! నీ తపస్సు చాలించు. శ్రీమన్నారాయణుడు నాకు వరముగా నిన్ను ప్రసాదించడం వలన నీకు నాయందు చాలా స్నేహము ఏర్పడింది. ఇంతకు పూర్వము నీవు నా పురమును కాల్చివేసి, దాని ప్రభువును చంపి చూపించిన దౌర్జన్యాన్ని నేనిపుడు లెక్కచేయను. ఇప్పుడు నన్ను ప్రేమిస్తున్నావని నేను తెలుసుకున్నాను. నీ తపస్సు చాలించు. మన యిరువురిలో భేదభావము లేదు. సుదర్శనచక్రమా! నీ అంతరాత్మలో నన్ను వసించమని అడుగుతున్నావు. ఆ విషయంలో మహావిష్ణువే సమర్థుడు. వేరెవ్వరితరమూ కాదు.

శ్రీమన్నారాయణు డొక్కడే సర్వాంతర్యామిగా విరాజిల్లు తున్నాడు. స్నేహాతిశయం వల్ల నీవిట్లు తలంచినావని నేను కూడా భావిస్తున్నాను. నా చేత చాలా కాలంగా కాంక్షించినవాడైనప్పటికి త్రిపురాసుర సంహార సమయంలో శ్రీమన్నారాయణుడుపదేశించిన మంత్రమునకు దక్షిణగా నిన్ను యివ్వవలసి వచ్చింది. దానికి సంకోచిస్తూ ఉన్న నారాయణుడు నీవు మరల శివానుగ్రహమును పొందమని నిన్ను ఆజ్ఞాపించాడు. ఇదంతా నేను యోగశక్తితో తెలుసుకున్నాను. నీ అంతరాత్మలో వసించడం నా అభీష్టము. ఇందుకు ఒకే ఉపాయం ఉంది. నా అభిప్రాయమును నీవు అంగీకరించవలెను. సకల యజ్ఞ స్వరూపమైన శరీరమును తాకడానికి తమోగుణ ప్రధానుడనైన నేను భయపడుతున్నాను.

నాకు విష్ణువు యొక్క దివ్య మంగళ విగ్రహములో అంతర్యామిగా నివసించాలని ఉంది. అందువల్ల నారాయణుని ఎల్లప్పుడు ఆశ్రయించి ఉండే నీ దేహములో నేను ప్రవేశించి యుంటాను. నా కోరికనే నీ కోరికగా నన్ను ప్రార్థించావు. మన యిద్దరి కోరిక ఒకటిగా వుంది. అందువలన నా ఆజ్ఞను నిర్వర్తించు. నీవు జ్వాలామాలికలతో నీ హృదయములో నన్ను భరించుము.

నీలో నేను సదా నివసించడం వల్ల బంగారు కాంతి కలవాడవు, శతభుజుడని, ఇరవై ఎనిమిది భుజములు కలవాడని, పదునారు భుజములు కలవాడని, ఎనిమిది భుజములు కలవాడని, నాలుగు భుజములు కలవాడని, జ్వాలలు కేశములుగా కలవాడని, ఫాలలోచనుడని, బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపుడని నీలో వున్న నన్ను జనులు అంగములతో కూడిన ఉపచారములతో పూజిస్తారు. శైవులు, వైష్ణవులు, స్త్రీలు, పురుషులు ఎవరైనను ఫలమును అనుభవించుటకు అర్హులే' అని వరమునిచ్చి నందివాహనుడైన ఈశ్వరుడు అదృశ్యరూపంలో వుండి ప్రమథ గణములతో అక్కడే నివసిస్తున్నాడు. సుదర్శనుడు ఈ విధముగా వరములు పొంది పంచాయుధ తీర్థమునకు పోయి అక్కడ అదృశ్యుడై ఎవరికీ కనిపించకుండా ఉండి తపస్సు చేయసాగాడు[16].

4.5. అగస్త్యాది మహర్షుల వృత్తాంతము :

పూర్వము గంగానదీతీరములో అశ్వమేధయాగ దీక్షితుడైన జనకుని వద్దకు మహర్షులు వచ్చారు. ఋషులందరినీ చూసిన జనకుడు సంతుష్టుడై పూజించి 'మీరంతా మా యజ్ఞశాలకు వేంచేసినారు. ఈనాడు నా జన్మ సఫలమయింది. నేను చేసిన తపస్సు సార్థకమయింది' అన్నాడు. అతని మాటలకు సంతసించిన మునీంద్రులు యజ్ఞశాలలో ఒక రాత్రి గడిపారు.

---

16. శ్రీ సుదర్శనుని వృత్తాంతము వరాహపురాణములో వేరొక విధంగా వర్ణించబడింది.

అనంతరము ఋషులందరు ప్రాతఃకాల సంధ్యావందనం పూర్తిచేసి జనకుడున్న యజ్ఞశాలకు వచ్చారు. అక్కడ వారంతా జనకునితో కలసి విష్ణు కథను పరస్పరం చెప్పుకున్నారు.

ఆ సమయంలో తేజస్సంపన్నుడు బ్రహ్మర్షి అయిన వామదేవుడు భూప్రదక్షిణం చేస్తూ అక్కడికి చేరుకున్నాడు. ద్విజశ్రేష్ఠుడైన ఆ మహర్షిని చూసి ఋషులందరూ ఎదురువెళ్ళి 'మీరు భూమినంతా చుట్టి వచ్చారు. కావున మీ నుండి మేము విష్ణుకథను వినాలని కోరుకుంటున్నా'మన్నారు. జగత్ప్రభువైన శ్రీనివాసుడు ఎక్కడ నివసిస్తున్నాడని మహాత్ముడైన జనకునికి ఆతురతగా ఉన్నదని ఋషులు అడుగగా వామదేవుడిలా చెప్పాడు –

"బ్రాహ్మణోత్తములారా! ఇక్కడ నుండి దక్షిణ దిక్కుకు రెండు వందల యోజనముల దూరములో 'నారాయణాద్రి' అనే పర్వత శ్రేష్ఠమున్నది. దేవతలు, గంధర్వులు, సిద్ధులు మహర్షులు ఆ వేంకటాద్రిపై నియతాహారులై నివసిస్తున్నారు. నేను కూడా అక్కడకు వెళ్ళాను. ఆ పర్వతంపై అగస్త్యుడు, నారదుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరసపుత్రుడు, దక్షుడు, జాబాలి ఇత్యాదులైన యోగాభ్యాస పరాయణులను చూసి 'ఇక్కడ ఏ కారణంచేత మీరంతా కలుసుకున్నారు?' అని అడిగాను. వారంతా ఏమీ బదులివ్వలేదు. కాని ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యుడు మాత్రం నన్ను పిలిచి 'మేమిక్కడ నివసించుటకు కారణం చెబుతాను విను' అన్నాడు.

యోగివరుడైన నారదుడు శ్రీమన్నారాయణుని ఉపాసిస్తూ గోదావరీ తీరమును వదలి వైకుంఠలోకంలో శ్రీహరిని దర్శించక, బ్రహ్మదేవుని సమీపించి సకల ప్రాణి హృదయాంతరాత్మ, పరమాత్మ అయిన మాధవుడు ఎక్కడ వెళ్ళాడో చెప్పమని అడుగగా బ్రహ్మదేవుడు చాలాసేపు ధ్యానించి నారదునితో ఇలా అన్నాడు–

భూలోకంలో 'నారాయణగిరి' అనే పర్వతం ఉంది. మహావిష్ణువు ఆ పర్వతంలో శ్రీలక్ష్మితో కూడి విహరించవలెననే కోరికతో అక్కడ విహరిస్తున్నాడు. ఆ ప్రభువును దర్శించాలంటే నీవు అక్కడికి వెళ్ళు అని బ్రహ్మదేవుడాదేశించగా నారదుడు అక్కడనుండి నారాయణాద్రికి వస్తూన్న మమ్మల్ని కలిశాడు. మాతో కలసి వేంకటాచలాన్ని చేరినపుడు బ్రహ్మకూడా దేవతలతో అక్కడికి వేంచేశాడు. ఆ పర్వతంపై బ్రహ్మదేవుడు కూడా శ్రీమన్నారాయణుని వెదుకుతూ, ఆయనను దర్శించక నారదునితోను, మాతోను ఈపర్వతంపై నదులు-సరస్సులు-పుష్కరిణులు ఎన్ని ఉన్నాయో, తటాకాలు-ఉదపానములు- ప్రస్రవణములు-బావులు-మునిజనసేవితాలైన పవిత్రములైన సరస్సులు ఎన్ని ఉన్నాయో, వాటిన్నిటిని సేవిస్తూ, ప్రదక్షిణం చేస్తూ అన్నిచోట్ల వెదుకుతూ శ్రీమన్నారాయణుడు కనబడే వరకు కొండపై సంచరిస్తూ ఉండమని ఆజ్ఞాపించి అంతర్ధానమయ్యాడు.

అగస్త్యుడు ఋషులతో సహా అవ్యక్తజన్ముడైన బ్రహ్మకు నమస్కరించి వేంకటాచలవాసియైన దేవదేవుని దర్శనేచ్ఛతో పర్వత పశ్చిమభాగాన్ని దాటి ఉత్తరదిక్కుగా వెళ్ళి తపస్సు చేస్తూ, శ్రియఃపతిని ధ్యానిస్తూ, బ్రహ్మవచనాన్ని గుర్తుతెచ్చుకుంటూ ఇటు అటు సంచరించాడు. తపస్సుచేత నిర్మలాంతఃకరణులు, సూర్యసమానకాంతి సముపేతులు, జటామండలధారులైన మునీంద్రులతో కూడి సంచరిస్తూ ఆ పర్వతపు వాయవ్యదిక్కున ఉత్తమోత్తమమైనది, శుద్ధ స్ఫటికమువలె చూడదగినది, విశాలము,విమలము,శుభకరమునైన శిలను చూశాడు.

ఆ శిలపై ఉన్నత శరీరంతో మరొక పర్వతశ్రేష్ఠుడువలె ప్రకాశిస్తున్న మహాభుజుడు, విశాలాక్షుడు, మహాదంష్ట్ర, గొప్పచెక్కిళ్ళు కలవాడు, ఎఱ్ఱని వస్త్రములు-మాలలు ధరించినవాడు, రక్తచందనం పూసుకున్నవాడు, దివ్యమైన కుండలములు ధరించినవాడు, స్నిగ్ధ విభూషితుడై నానా విధరత్నములతో

భూషణములతో అలంకరింపబడినవాడు, అనేక విధరత్నములతో కూడిన కిరీటమును ధరించినవాడు, మహాకాయుడు, మహావీరుడు,మహాభుజుడు అయిన పురుషుని చూచి అగస్త్యుడు ఆశ్చర్యావిష్టుడై మరల మరల దర్శించాడు.

అనంతరము ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యుడు ప్రకాశించుచున్న సూర్యునివలె తేజస్వంతుడైన ఆ పురుషునికి నమస్కరించి 'మీరెవరు? మీ తండ్రి ఎవరు? మాకు మీ వృత్తాంతాన్ని చెప్పండి' అని వినేవారికి ప్రీతి కలిగించేటట్లు మధురమైన వాక్కుతో ప్రార్థిస్తున్న తేజశ్శాలియైన అగస్త్యమహర్షిని చూస్తూ ఆ పురుషుడు ఏమియు మాట్లాడలేదు. అనంతరము ఋషులందరూ చూస్తుండగనే అంతర్ధానమై వారందరికీ పరమాశ్చర్యము కలిగించాడు. సూర్యునివలె మహాదాశ్చర్యకర రూపమును చూపించి మనలను మాయతో మోహింపజేసి వెంటనే అదృశ్యుడయ్యెనని ఋషులందరూ అనుకుంటూ ఆ దేవదేవునికి నమస్కరించి ఆ పర్వతంలో సంచరిస్తున్నారు. అగస్త్యమహర్షి ఋషులందరితో కలిసి దేవదేవుడైన శ్రియఃపతిని దర్శించాలనే కోరికతో నారాయణాద్రిలో నిర్మలం, విశాలమైన పశ్చిమదిక్కును వదలి ఉత్తర భాగమును చేరాడు.

ఋషులతో కూడిన అగస్త్యుడు పర్వతంలో సంచరిస్తూ ఉత్తరభాగంలో ఒక ఆశ్చర్యాన్ని చూశాడు. వేలాడుతున్న గొప్ప శాఖలతో, స్వచ్ఛమైన పాలరాతివలె తెల్లనైన నేరేడు చెట్లు ఫలించి ప్రకాశించుచున్నట్టి, పుణ్యప్రదములైన, స్వచ్ఛమైన నీరు కలిగి, సకల పాప పరిహారములై, పవిత్రములైన అనేక విధముల శుభకరములైన నదులను చూశాడు. ఆ పుణ్యప్రదములైన, నిర్మలమైన నదులలో అగస్త్యుడు మునులతో కూడి శౌచాది కృత్యములు యథాశాస్త్రముగా ఆచరించి, ప్రయత్న పూర్వకంగా విధివిధానంతో స్నానం చేసి నిర్మలాంతఃకరణుడై మనస్సులో వాసుదేవుడైన శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ శ్రీ మహావిష్ణువును పూజించి దేవదేవుని చూచు కాంక్షతో పర్వతం అంతటా సంచరిస్తున్నాడు.

అక్కడి ప్రదేశము అనేక రకముల వృక్షములతో ప్రకాశిస్తూ, పర్వతముల వంటి మేఘములతో కూడి చూచుటకింపైన మృగములు, పాములు, పక్షిగణములతో కూడినది. భూమి అనేక పుష్పములతో అందముగా కప్పబడినది. శీతోదక తటాకముల నుండి వచ్చే వాయువులు హాయిని గొల్పుతున్నాయి. తుమ్మెదలు పువ్వులలోని తేనెను సేవిస్తూ పాడుతున్నాయి. కోకిలలు కొండ గుహల నుండి బయటకు వచ్చి తీయగా కూస్తున్నాయి. అక్కడ గంధర్వులు చక్కగా గానం చేస్తున్నారు. నెమళ్ళు పెద్ద రెక్కలతో నాట్యమాడుతున్నాయి. బహుశాఖలు కల అశ్వత్థ,జువ్వి, మారేడు వృక్షములతో ప్రకాశించుచున్నట్టి, పూచిన బొట్టుగు చెట్లతో, పులిగోరు చెట్లతో, కొండగోగు వృక్షములతో, పాటలీ వృక్షములతో, చిత్రములైన కొమ్మలు- వృక్షములు గల ఊడుగు చెట్లతోను, మాదీఫల వృక్షములతోను, దిరిసెన, ఇరుగుడు, చాలా ఎత్తైన గిరకతాడి, పనసవృక్షములతోను, నెమ్మిచెట్టు, కానుగ-తినాస-చందన-బొగడ-ఎర్రచందనవృక్షములతోను, అనేక రకముల వృక్షరాజములతోను ప్రకాశిస్తూ, చక్కని సువాసనలను వెదజల్లుచు, అనేక గైరికాది ధాతు సమ్మిళితమై మణులతో ప్రకాశించు పర్వతం ఉత్తర భాగమున మునులందరితో కలిసి సంచరిస్తూ పర్వతముపై దివ్యమై, అద్భుతమై, తామరపువ్వులతో విరాజిల్లుచున్న పుష్కరిణిని చూశాడు.

విరబూసిన కలువలతోను, సుగంధభరితమైన నిర్మలమైన నీటితో విరాజిల్లుతూ చంద్రకాంతమణుల రంగు కలిగి, రాజహంసల చేత సేవించబడుతూ, ధ్వనిస్తున్న సింహములతోను-పులులతోను- జింకలతోను కూడినదై, నీటికోసం వచ్చిన తెల్లని దంతములుకల ఏనుగులతో విరాజిల్లుతున్నదై, క్రౌంచ పక్షులు-కోతులు-పందులు మొదలైన పక్షి జంతు సమూహములు కలదై, ధ్వని చేస్తున్న పక్షులతో ఇంపొసగునదై, దేవగంధర్వయక్షవిద్యాధర సుసేవితమై, సకల దుఃఖ ప్రణాశినియై పద్మములతో విరాజిల్లు పద్మసరోవరమును చూసి ఆశ్చర్యముతో తనతో నున్న మునీంద్రులతో 'మన మీ సరస్సులో స్నానమాచరించి తూర్పు

దిక్కుకు వెళ్ళెదము. లోకములో ఈ సరస్సు పాపపరిహారిణిగా ప్రసిద్ధి చెందింది. ఈ సరస్సు సకల పాపపరిహారకము, శుద్ధము, సర్వదుఃఖప్రణాశిని, సకల తీర్థప్రదాయినిగా విరాజిల్లుతుంది' అని ఋషులతో చెప్పి శ్రీహరిని మనస్సులో ధ్యానిస్తూ ఆ సరస్సులో స్నానమాచరించి దేవదేవుడైన వాసుదేవునికి మనస్సులో నమస్కరించి, ఎప్పటివలె మునులతో విహరించసాగాడు.

4.5.1. అగస్త్యాది మునీంద్రులు సనత్కుమారాది యోగీంద్రులను దర్శించుట :

అగస్త్యుడు పద్మసరస్సుకు ఉత్తరతీరంలో వృక్షము మొదట స్వస్థచిత్తులై ధ్యానమగ్నులై తేజోవంతులై దక్షిణ దిక్కుగా తిరిగి భక్త్యతిశయము కలవారై కళ్ళు మూసుకొని కూర్చున్న యోగపారంగతులైన సనత్కుమారాది యోగీంద్రులను చూచి సంతోషించి వారిదగ్గరికెళ్ళాడు. మునీంద్రులతో వస్తున్న అగస్త్యుని చూసి సనత్కుమారాది మునీంద్రులు వారిని పూజించారు. అప్పుడు అగస్త్యుడు వారిని 'ఇచ్చట మీరు ఏమి ఆశ్చర్యమును చూచారు? ఇక్కడ నివసించే భగవంతుడెవరు? మీరెందుకిచట గుమికూడియున్నారు? ఈ సంగతి నాకు వినాలని ఉన్నది' అని నిరంతర భగవద్ధ్యానముచే పవిత్ర హృదయము కల అగస్త్యుడు అడుగగా సనత్కుమారాది యోగీంద్రులు మునీంద్రా! ఈ పర్వతం పై సర్వాంతర్యామియైన శ్రీమహావిష్ణువు నివసిస్తున్నాడు. అతడొక్కడే ధ్యానింప తగినవాడు.

సర్వాత్మా భగవాన్ విష్ణుః వసత్యస్మిన్ మహాగిరౌ ।
చింతనీయః స ఏవైకో మునీంద్ర! పురుషోత్తమః ॥

పురుషశ్రేష్ఠుడు, ఊహాతీతుడు, సర్వజగత్స్రష్ట, నిత్యుడునైన శ్రీమన్నారాయణునే ధ్యానిస్తున్నాము. మేము ఆ జగత్ప్రభువును తప్ప ఇతరులను ధ్యానింపము. నీవు కూడా పురుషోత్తముడు, పరాత్పరుడు, పురాణపురుషుడు, సకల లోక

రక్షణ తత్పరుడైన శ్రీమన్నారాయణుని అచిరకాలములో దర్శించగలవు. మేము కూడా శ్రీమన్నారాయణుని ఒకసారి దర్శించాము. పుణ్యప్రదమైన వేంకటాద్రి యందు యితరులెవ్వరు చూడని అద్భుతము తూర్పుదిశలో ఉంది.

ఈ దివ్యమైన పర్వతము గురించి వివరిస్తాను. ఇక్కడ వజ్రాయుధధరుడైన దేవేంద్రుడు అవ్యక్తరూపుడైన శ్రీమన్నారాయణుని చూడాలని దేవతలతో కూడి నివసిస్తున్నాడు. నీవు మునీంద్రులతో కలిసి తూర్పుదిశకు వెళ్ళితే దేవలోక ప్రభువైన ఇంద్రుని చూడగలవు అని చెప్పి సనత్కుమార ప్రముఖులు అంతర్ధానమయ్యారు. మహాత్ములైన యోగులందరు అంతర్ధానమవగా అగస్త్యుడు మునులతో కూడి తూర్పు దిక్కున.చాలా ఆశ్చర్యము కలిగించుచు ఇంద్రుని పతాకము వలె ఎత్తుగా నున్నదై, పెద్ద పెద్ద కొమ్మలు వ్రేలాడుచున్నదై, పువ్వుల భారముతో వంగినదై, తన నీడతో పర్వతమును కప్పివేస్తున్న ఒక గొప్ప వృక్షమును చూశాడు. దాని మొదట సూర్యుని పోలిన తేజస్సు కలవారై, భగవంతుని యందు లగ్నమైన మనస్సు కలవారై సప్తమహర్షులు ఆసీనులై ఉన్నారు. అగస్త్యుడు వారిని చూసి తపస్సుతో నిర్మలాంతఃకరణులైన మునీంద్రులతో కలిసి వస్తుండగా వారతనిని చూసి స్నేహముతో శాస్త్రోక్తంగా పూజించారు. అనంతరం మహాతేజశ్శాలియైన అగస్త్యుడు అర్థవంతములైన మృదుమధుర వాక్కులతో వినయముగా 'మీరీ దివ్యమైన పర్వతానికి ఎందుకు వచ్చారు? మీరు ధ్యానించే భగవంతుడెవరు?' అని అడుగగా మునులు ఇలా అన్నారు –

'జగద్రక్షకుడు, విశాలాక్షుడు జగత్ప్రభువైన శ్రీమన్నారాయణుని సేవించుటకు వచ్చాము. ఆ పురుషోత్తముడే సర్వవ్యాపి, ధ్యానించ తగినవాడు. అందువలన జగత్ప్రభువు తప్ప ధ్యానించదగినవారు లేరు.

"స ఏవ దేవః సర్వాత్మా ధ్యేయో నః పురుషోత్తమః ।
న చాన్యో విద్యతే ధ్యేయః తమృతే జగతాం పతిమ్ ॥

అజుడు, సర్వజగదీశ్వరుడు, కృష్ణుడు, అచ్యుతుడు, ప్రభువు, పూజ్యుడు, పురుషోత్తముడు, వరదుడు అయిన శ్రీమన్నారాయణుని ధ్యానించుదాము. నీవు కూడా సర్వలోకనాథుడైన నారాయణుని దర్శించగలవు. ఈ సింహాద్రిపై తూర్పుదిశగా వెళ్ళు'మని చెప్పగా అగస్త్యుడు వారికి వీడ్కోలు పలికి మనస్సులో జగత్కర్త అయిన మహావిష్ణువును ధ్యానిస్తూ, చతుర్ముఖుడు చెప్పిన మాటలను మననం చేస్తూ ఆ పర్వతమునకు తూర్పుదిశగా వెళ్ళాడు. అగస్త్యుడు ఆ పర్వతమునకు ఉత్తరభాగమున మునుపెన్నడూ చూడని ప్రదేశమును చూసి అక్కడ కూడా పురాణపురుషుని చూడక మరల తూర్పు దిక్కునకే వచ్చాడు.

4.5.2. శేషాచల పూర్వదిక్కున అద్భుత వస్తువును చూచుట :

అగస్త్యుడు మునులతో కూడి నారాయణాద్రికి తూర్పుదిక్కుగా వెళ్ళి వృక్షసమూహములతో అలంకరింపబడిన ఆ దిక్కులో ప్రకాశించే సూర్యుని వంటి తేజస్సు కలిగి నిర్మలాంతఃకరణులై భగవద్ధ్యానతత్పరులైన మునులతో సంచరిస్తూ పర్వతశిఖరముల వలె పుష్ప ఫల భరితాలై, వేలాడుచున్న పెద్ద పెద్ద కొమ్మలతో చిగురులతో ప్రకాశించు వృక్షములను, మదజలము స్రవించుచుండగా చక్కని దంతములు కలిగి ఎత్తుగానున్న ఏనుగులను, గర్జిస్తున్న సింహములను, పరుగులీస్తున్న వరాహములను, సిద్ధులు, కిన్నరులు,గంధర్వులు, వేలకొద్ది యక్షులు మొదలైన దేవతలనేకులతో ప్రకాశించే పర్వతాన్ని చూశాడు. ఆ విధంగా చూస్తూ, పర్వతంపై సంచరిస్తూ, మునులచేత సేవించబడుతున్న, పరమ పూజ్యము, అతి పవిత్రము, జంతుసమూహముచే సేవింపబడేది, పూలతోను- ఫలములతోను సేవింపబడేది, మదపుటేనుగులు కలది, మత్తెక్కిన కోయిల ధ్వనులతో ప్రతిధ్వనించేది, అందమైన ఎత్తైన శిఖరములతో ప్రకాశించేది, భయము కలిగించే పెద్ద సర్పములు కలది, గొప్ప కొండచరియలు కలది, శుభమును చేకూర్చేది, చాలా ఎత్తుగా వుండి పండిన ఉసిరికాయలతో వున్న చెట్లు కలది, గొప్పశిఖరము

కలిగిన ఆశ్చర్యకరమైన పర్వతాన్ని చూశాడు. ఆ పర్వతముపై మునులతో సంచరిస్తూ తూర్పుభాగంలో ఒక ఆశ్చర్యకరమైన బిలమును చూశాడు.

పాతాళలోక సదృశమైనది, చూచిన వారికి భయమును కలిగించేది, మనుషుల చేత చూడబడనిది, చూచినంతనే మనుషులు మూర్ఛితులై పడునట్లున్న భయంకరమైన బిలమును సమీపించి చూచి ధర్మజ్ఞుడైన అగస్త్యుడు "ఈ బిలమును చూచి ఈ పర్వతమునెక్కు మనుజులు మూర్ఛితులై పడగలరు. ఈ భయంకరమైన బిలము మృత్యుముఖము వలె నున్నది" అని అనినంతనే ఆ బిలము అంతర్ధానమైనది.

ఆ తరువాత అగస్త్యుడు ఆ వేంకటాచలమనే పవిత్ర పర్వతముపై సంచరిస్తూ అనేక శాఖలతో కూడిన, ఆశ్చర్యకరమైన ఆకారముతో కూడిన, లేత చిగురులతో కూడిన, భూలోకంలో మనుజులచే ఇంతకు ముందు చూడబడని, గొప్ప మద్దివృక్షమును చూశాడు. దానిని చూచి ఆశ్చర్యచకితుడైన మహర్షి అగస్త్యుడు సమీపించి, ఆ వృక్షమూలములో తపస్సుచేస్తున్న ఇంద్రుని, మద్దిచెట్టు కొమ్మలవలె స్థూలములైన బాహువులు కలవాడు,రత్నకాంతులతో- వైడూర్యమణులతో- రత్నములతో గొప్ప కుండలములతో ప్రకాశించేవాడు, మరొక నారాయణుని వలె విరాజిల్లేవాడు, వజ్రాయుధమును ధరించినవాడు, విశాల నేత్రములవాడు, దివ్య కుండల ధారులైన సూర్య, అగ్ని, యమ, వసు, అశ్విని దేవతలు, కుబేర, వరుణ, గంధర్వ, కిన్నరులు, దివ్యాంబరములు ధరించి దగ్గరలో సేవిస్తున్న ఇంద్రుని చూశాడు. దేవాంశసంభూతుడైన అగస్త్యుడు త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుని మునులతో కూడి పూజించాడు. దేవతలు కూడా ఇంద్రునితో కూడి అక్కడికి వేంచేసిన మునులను యథారీతిగా పూజించారు. అప్పుడు అగస్త్యుడు వారిని చూసి చిరునవ్వుతో 'ఈ పవిత్ర పర్వతరాజములో ఏమి ఆశ్చర్యమును చూశారు? దానినంతయు యథార్థముగా వినగోరుచున్నా'నన్నాడు.

అప్పుడు దేవతలిట్లు బదులిచ్చారు. "పద్మపత్ర విశాలాక్షుడు, జితేంద్రియుడు, శంఖ చక్రగదాధరుడు, ఆర్తత్రాణపరాయణుడు, సర్వవ్యాపి, పరబ్రహ్మస్వరూపుడు, ప్రకాశరూపుడు, పురాణపురుషుడునైన శ్రీమన్నారాయణుని చూడగోరి పర్వత శ్రేష్ఠమైన ఈ సింహాద్రిని సమీపించి మహాతేజోవంతులైన దేవజిదాది రాక్షసులపై జయము మాకు కలగాలని జరాది భావవికారములు లేని, గొప్ప తేజస్సంపన్నుడైన, సృష్టిస్థితిలయకారుడైన, దేవాదిదేవుని నారాయణునే ధ్యానించు చున్నాము. మాకు శ్రీమన్నారాయణుడే ధ్యానింపతగినవాడు. అతని కంటే ధ్యానింపతగినవాడు లేడు. ఎందును కానరాడు.

స ఏవ భగవాన్ దేవో ధ్యేయోఽస్మాభిః సనాతనః ।
నాన్యో ధ్యేయః పుమాన్ యస్మాత్ విద్యతే న చ దృశ్యతే ॥

ఈ పర్వతం దక్షిణ భాగంలో మహాశ్చర్యమును చూచితిమి. ఆశ్చర్యకరుడు, త్రిశూలధారి, పాపహరుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడు, మహేశ్వరుడునైన శంకరుడు తన ప్రమథ గణములతో కిన్నర నాగరాక్షసులతో విరాజిల్లు చున్నాడు. నీవు అక్కడికివెళ్ళి ఆ దేవుని దర్శించుము. అచ్చటనే దుర్వాసమహర్షిని, నందికేశ్వరుని పరివారమును చూడగలవు. నీవు ఆలస్యము లేకుండా వెంటనే మునీంద్రులతో కూడి ఆ ప్రదేశమునకు వెళ్ళుమని చెప్పగా అగస్త్యుడు వారందరిని తోడ్కొని పర్వతము తూర్పు భాగము వీడి మునులతో కూడి దక్షిణ భాగాన్ని పొంది ఆగ్నేయ దిశలో మహదాశ్చర్యమును చూచెను. అచ్చట శంఖ- చక్రములు-గదా- శార్ఙ్గ-నాగలి- ఖడ్గములు తమ తమ స్వరూపములతో కూర్చుని పది దిక్కులను ప్రకాశింపజేస్తూ దివ్యాభరణములతో విరాజిల్లుతూ, చూచుటకింపైన రూపములు కలిగి రక్తచందనమును శరీరము నందంతటను పూసికొని దివ్యమైన పుష్పమాలలతో విరాజిల్లు అందెలు, భుజకీర్తులు, మొలనూలుతో అలంకరింపబడి దర్శనమిచ్చిరి. అటువంటి పురుషశ్రేష్ఠులను చూసి వెంటనే అగస్త్యుడు వారిని

సమీపించి నమస్కరించి, చక్కగా స్తుతించి మునులతో సహ ప్రదక్షిణం చేసి ఆదిదేవుడైన శంకరుని చూడాలని ఆ పర్వతాన్నధిరోహించి ఇటునటు చూసి దేవగణములతో సేవించబడుచున్న పశ్చిమ దిక్కును చేరి ఆ పర్వతానికి ప్రదక్షిణం చేసి అనంతరం దక్షిణ భాగాన్ని చేరారు.

4.5.3. అగస్త్యుడాచరించిన శంకరసేవాక్రమము-అగస్త్య శంకర సంవాదము :

అగస్త్యమహర్షి మేఘమువలె నల్లనైన పొదలతో లతలతో కప్పబడిన, అనేకవృక్షములచే కూడిన, పిల్లులు-కోతులు- కొండముచ్చులతో కూడిన, ఫలించిన పండ్లతోను-పుష్పములతో వంగిన, దివ్యములైన కొమ్మలతో విరాజిల్లు వృక్ష సముదాయముతోను, కాటుక చెదిరి పడినట్లుండే రాళ్ళతో విలసిల్లిన, హంసలు-బెగ్గురుపక్షులు- గ్రద్దలు-వడ్రంగిపిట్టలతో ప్రకాశించేది, చక్కగా కూస్తున్న అందమైన చక్రవాకములతో విరాజిల్లేది, అనేకగైరికాది ధాతువులతో, సెలయేళ్ళతో ఇంపైనది, తమ తమ భార్యలతో దేవతా విశేషములు-విద్యాధరులు నివసించుటకనువైనది, పరిమళమును వెదజల్లేది, మలయ మారుతముతో ఆవరించినది, కష్టమైన కార్యములను సులభమయ్యేటట్లు చేసే కృష్ణుని తమ పాటలతో అనుగ్రహింపచేసుకొనగల కిన్నర,గంధర్వులతో కూడిన గొప్ప పర్వతపు దక్షిణ దిక్కును చూసెను.

అనేక శాఖలు కలిగి, పుష్పించి, మిక్కిలి ఎత్తుగా ఉండి, ఆశ్చర్యావహమై, పరిమళభరితమై, మృదు పల్లవ శోభితమై, పూర్వులు ఎన్నడూ చూడనిదై యున్న వృక్షమును చూచెను. దానిని చూచి అగస్త్యుడు వెంటనే ఋషులతో కూడి ఆ వృక్షాన్ని సమీపించి పరిశీలిస్తూ, ఆ వృక్షమూలములో కూర్చున్న భగవంతుని ముందు అగ్నిహోత్రముల వలె ఎఱ్ఱగా ప్రకాశిస్తున్న మూడు నేత్రములు కలిగిన విశాలనయనుని, ఎర్రనైన కనులు కలిగినవానిని విశాలనేత్రుని, సుందరమైన అధరము కలిగిన ఉన్నత శరీరుని, శాంతస్వరూపుని సకలలోక వంద్యుని అనేక మణుల సముదాయముతో ఆచ్ఛాదించబడి ప్రకాశించే కుండలధారుని, అనేక

రూపములను ధరించినవానిని, సహస్ర బాహువులు కలిగి పరాక్రమవంతులైన పరిజనులతో సేవింపబడుచున్న వానిని నందికేశ్వర-దుర్వాస-బాణాసురులకు వందనీయుడైన, యక్ష-కిన్నర-గంధర్వాది దేవతలచే పూజింపబడిన, హాహా హూహూలను గంధర్వులచే సేవింపబడుచు, ఇతరులచే స్తుతింపబడు ఆశ్చర్య గుణచేష్టితుడైన శంకరుని చూసి సాష్టాంగముగా నమస్కరించెను. అగస్త్యుడు మహాతేజశ్శాలియై గొప్ప తేజస్సు, బలములతో విరాజిల్లుతూ అనేక రత్నములతో విచిత్రముగా నున్న కంకణములతో అలంకరింపబడి, బంగారుతో చేసిన భుజకీర్తులతో విరాజిల్లుతూ గొప్పవాడు, సకలభూతములకు వరముల నిచ్చేవాడు, సర్వ దేవ వంద్యుడైన ఈశ్వరుని స్తుతించి 'నీ దగ్గరికి వచ్చిన నన్ను పలుకరించవేందుకు? నీవు ధ్యానించే భగవంతుడెవరు? ఈ స్థలంలో ఏ దేవుడు నివసిస్తున్నాడు? తెలుప' మని ప్రార్థించెను.

ఈ విధంగా ప్రార్థించబడిన ఈశ్వరుడు మహాముని అయిన అగస్త్యునితో మేఘగంభీరవాక్కులతో ఈ విధంగా పలికెను. 'బ్రహ్మాది పిపీలికా పర్యంతం సకల ప్రాణులకు నాకు కూడా సర్వాంతర్యామి, జగత్కర్త, జనార్దనుడు శ్రీమన్నారాయణుడొక్కడే ధ్యానింపదగినవాడు. ఇతరులెవరూ ధ్యానార్హులు కారు. సర్వవ్యాపి, పరాత్పరుడు, జగత్ప్రభువు, నారాయణుడు తప్ప లోకంలో ధ్యానించదగిన ఇతర పురుషుడు లేడు. అటువంటి జగత్కర్త, పురుషోత్తముడు, శ్రీమన్నారాయణుడు ఈ నారాయణాద్రిలో నివసిస్తున్నాడు. శ్రీమన్నారాయణుని యందు నా మనస్సు లగ్నమై ఉన్నది. అందువల్ల నీ ఆగమనమును గమనించలేదు. వేరొకటి కాదు. విశాలనేత్రుడు, సర్వప్రాణులకు ప్రభువు, సర్వలోకరక్షకుడు, ఆద్యంతరహితుడు, ప్రకాశించుచున్న కిరీటము-భుజకీర్తులు- మురుగులతో శోభిల్లేవాడు, దివ్యమైన వైజయంతీమాలతో అలంకరింపబడినవాడు, గరుడారూఢుడు, విశ్వరూపుడు అయిన మహావిష్ణువును నీవు కూడా

దర్శించగలవు. ఇందులో సందేహం లేదు. బ్రహ్మచేత, నాచేత కూడా యిదే చెప్పబడింది. అచిరకాలంలోనే మాధవుడు నీ సాన్నిధ్యాన్ని చేరగలడు. అప్పటివరకు నీవు ఈ పర్వతం పైననే పూర్వమువలెనే సంచరించుము. చింతించవద్దు. కేశవునిపై మనస్సును లగ్నం చేయు'మని మహాదేవుడు బ్రహ్మ చెప్పిన మాటనే చెప్పగా అగస్త్యుడు ఈశ్వరునికి మరల మరల నమస్కరించి, ఈశ్వరుని పట్ల భక్తిచేత ఆ ప్రదేశం నుండి కదలలేకపోయెను. అగస్త్యాది మునివరులు చూస్తూండగానే ఈశ్వరుడు తన పరిజనంతో అంతర్ధానమయ్యెను. మునులు కూడా శంకరుని స్తుతించి నమస్కరించి అగస్త్యునితో వెడలిరి. అగస్త్యశంకర సంవాదము లోకంలో ప్రఖ్యాతి నందినదని చెప్పడంలో ఆశ్చర్యము లేదు.

అనంతరం అగస్త్యుడు ఈశ్వరునికి నమస్కరించి దక్షిణదిశను వదలి నారాయణాద్రి నైఋతి దిశలో గల విశేషాలను దర్శించుటకు మునులతో బయలుదేరెను.

4.5.4. శేషాచల నైరుతి దిశలో అగస్త్యాదులకు విష్వక్సేన దర్శనం, విష్వక్సేనుడు చెప్పిన భగవద్దర్శనోపాయం :

మందరపర్వతం వలె స్థిరమైన, అనేక శాఖలతో కూడిన, ఉన్నతమైన, గొప్పదైన మర్రిచెట్టును, చెట్టుమొదట్లో అద్భుతమైన గొప్పదైన శిలపై కూర్చుని ఉన్న తేజశ్శాలి, దేవాధ్యక్షుడు, భగవద్ధ్యానాసక్తచిత్తుడు, దేవేంద్ర సమాన పరాక్రమము కలిగిన పరిజనులతో-నిత్యశూరులతో దేవతలకు అపర దేవేంద్రుడువలె భాసిస్తున్న విష్వక్సేనుని అగస్త్యుడు దర్శించెను. ఆకాశమును మింగిన వారున్నట్లు ప్రజలను తినువారి వలె రాక్షసులు విష్వక్సేనుని చుట్టూ కూర్చున్నారు. అనేకమంది దుష్టకర్ములు, భయంకరులైన రాక్షసులు, గంధర్వపతులు, వేలకొలది యక్షులు అనేకరకాలైన ఆయుధములను ధరించి తేజశ్శాలియైన విష్వక్సేనుని సేవిస్తున్నారు. విష్ణుమాయచేత ఆవిర్భవించిన వేలకొలది భయంకరములును, మేరు-మందర

పర్వతములవంటి రూపములు కలవియు, మిక్కిలి కోపము కలవియు, సముద్రములన్నిటిని ఒకేసారి త్రాగివేయువారివలె నుండు భూతములన్నీ విష్వక్సేనుని చుట్టు ముట్టియున్నవి.

ఈ విధంగా వీరితోను, ఇతరులతోను ఆ పర్వతమున కూడి యున్నట్టి, ఈటెలను-చిల్లకోలలను ధరించి సుస్వరంగా పాడుతున్న గంధర్వులతోను, కిన్నరశ్రేష్ఠులతోను, చక్కని స్వరములతో పాడుతూ, ఆడుతున్న అప్సరసలతోను, దేవతలు-బ్రహ్మర్షులు-సిద్ధులతోను, అపరనారాయణుడో అన్నట్లు సేవింపబడుతున్న విష్వక్సేనుని చూసి శరీరము గగుర్పాటు చెందగా ఆశ్చర్యచకితుడైన అగస్త్యుడు విష్వక్సేనుని సమీపించి భూమిపై సాష్టాంగముగా నమస్కరించెను. మునులందరూ ప్రియవచనములతో అనుగ్రహించుమని మరల మరల పలుకుతూ సుఖాసీనుడై, ధనుర్ధారియై, అపర నారాయణుడివలె శంఖచక్ర గదాధరుడై, అభయముద్రను ధరించిన విష్వక్సేనునికి నమస్కరించిరి.

అనంతరము నరశ్రేష్ఠుడు, మహావీరుడు అయిన విష్వక్సేనుడు వారితో ఇట్లనెను. 'ఈ పర్వతముపైనే మీరు విశ్వరూపధారి, మహాతేజశ్శాలి, నిర్వికారుడైన శ్రీమన్నారాయణుని దర్శించగలరు. సకల వేదవేద్యుడైన శ్రీమన్నారాయణునకు మేము సేవకులము. పూర్వము మేము జయశీలి, కాంతివంతుడు, దేవాధ్యక్షుడు, శంఖచక్రగదాధారి అయిన శ్రీమన్నారాయణుని ఈ పర్వతముపైననే దర్శించితిమి. ఆ విశ్వాత్మ ఈ పర్వతముపైననే నివసిస్తున్నాడు. మీరంతా పూర్వం వలెనే శ్రేష్ఠమైన ఈ పర్వతముపై సంచరించుడు. శ్రీమన్నారాయణుని అనుగ్రహముతో మేము మున్నెన్నడు చూచియుండని ఆశ్చర్యమును చూచితిమి. ఆ పరబ్రహ్మను చూడగోరి ఈ పర్వతమున తపస్సు- చేయుచున్నవారికి షడ్గుణపూర్ణుడు, దోషరహితుడు, పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుడు దర్శనమిచ్చు చున్నాడు. మీరూ మాతో గూడ ఈ పవిత్ర పర్వతముపై మిక్కిలి భక్తి గలిగి

చరాచరములకు ప్రభువు, సర్వవ్యాపకుడు, పరబ్రహ్మస్వరూపుడు, స్తోత్రప్రియుడు, జగత్సృష్టికర్త అయిన శ్రీమన్నారాయణుని యందు మనస్సు నుంచి నిశ్చలమైన భక్తితో తపస్సు నాచరించండి' అని పరాక్రమవంతుడైన విష్వక్సేనుడు మునులకు తెలిపి దేవతలందరు నమస్కరిస్తుండగా స్వపరిజనముతో అంతర్ధానమయ్యెను. మునులందరు తేజశ్శాలియైన విష్వక్సేనునికి నమస్కరించి సంతోషముతో యథాప్రకారముగా వృక్షసమూహములతో అలంకృతమైన శ్రీవేంకటాచలములో విహరిస్తూ అందమైన గొప్పవైన పుష్పించిన వృక్షములతో అనేక రకములుగ అలంకృతమైన నల్లని మేఘములను పోలిన రంగు కలవియు, తెల్లని మేఘములను పోలినవియు, దేవదానవ గంధర్వయక్షకింపురుషగుహ్యకులు, విద్యాధరులు మొదలైన మహాత్ములచేత సేవింపబడే శిఖరములను చూసిరి. ఈ విధముగా ఒక శిఖరము నుండి మరొక శిఖరమునకు వెడుతూ, ఒక అందమైన శిఖరముపై నిర్మలాంతఃకరణులైన మునులు మహా బలపరాక్రమవంతులై కామరూపధరులై, భయంకరులై, వాయువుతో సమాన వేగము కలవారై, మేరుమందర సమానులైన కిన్నరులను, గంధర్వులను, యక్షులను, వేలమంది దేవతాశ్రేష్ఠులను చూసి ఆశ్చర్యముతో కనులనింతింతవిగా చేసుకొని చూస్తున్నవారిని తాను కూడా అదే భావముతో చూసి అగస్త్యుడు ఓ మునీశ్వరులారా! పూర్వము ఇంద్రుడు బలపరాక్రమోపేతులైన వీరి సహాయముతోనే దేవాసురమహాయుద్ధములో అసురులను జయించాడు. వీరందరు పరాక్రమవంతులు, విచిత్రములైన వస్త్రములు కలవారుగను, అనేక ఆయుధములను ధరించినవారుగను ఆశ్చర్యరూపులుగను కనిపిస్తున్నారు. వీరిని దర్శించిన తరువాత సకల ప్రాణికోటికి ప్రభువు, నిర్వికార స్వరూపుడు అయిన శ్రీమన్నారాయణునికి నివాసస్థానమైన పర్వతశ్రేష్ఠమును చూచుటకు మనస్సులో నిశ్చయించుకొని, మునీంద్రులతో కూడి ఆ బలశాలులైన గంధర్వులను సమీపిస్తుండగా వస్తున్నటువంటి అగస్త్యుని చూచి గంధర్వులందరును బ్రహ్మను దేవతలు గౌరవించినరీతిగా ఎదురెళ్ళి

నమస్కరించి అతని చెంత నిలిచిరి. వారిని చూసి బ్రహ్మర్షియైన అగస్త్యుడు 'గంధర్వులారా! మీరందరు నా మధురవాక్కులను వినండి. మీరెవ్వరివారు? ఎందుకీ పర్వతముపై విహరిస్తున్నారు? చూడదగినది కాని చూచినది కాని యిక్కడాశ్చర్యకరమైనదేమి ఉన్నది? దీనినంతా సంగ్రహముగ తెలుపుడని గంధర్వులను అడిగెను.

ఈ వృత్తాంతమంతయు గంధర్వుల ద్వారా విష్వక్సేనుని అనుచరులద్వారా విన్న అగస్త్యుడు విష్వక్సేనుని ప్రశంసించెను. తపశ్శక్తిసంపన్నులు, నిర్మలాంతఃకరణులైన మునివరులతో కూడిన అగస్త్యుడు శ్రీమన్నారాయణుని భక్తితో నమస్కరించి హరిదర్శనాభిలాషియై యథాప్రకారముగ సంచరించసాగెను.

4.5.5. అగస్త్యుడు శేషాచలమందలి పుణ్యతీర్థములను దర్శించుట :

అగస్త్యమహర్షి పర్వతశ్రేష్ఠము, సుందరమునైన వృషభాద్రిపై సంచరిస్తుండగా పర్వతసమానమైన ఆకారము కల పుష్పించిన వృక్షములను, చక్కని నీరు కలిగి పరిశుభ్రములై నిర్మలమైన నదులను, వృక్ష సమూహాలంకృతములైన పర్వతగుహలను, కృత్రిమమైన గుహాకారమైన పర్వతబిలములను, నల్లని మేఘములవంటి శిఖరములను, నిర్మలమైన నీరు కల సరస్సులను, హంసలచేత, కన్నెలేడి పక్షులచేత వ్యాప్తమైనది, బెగ్గురు పక్షుల అరుపులచే ప్రతిధ్వనించునదియు, చకోరపక్షులతోను, జింకలతోను, మదజలములు స్రవించు ఏనుగులతోను, అందమైన చక్రవాకములతోను, పక్షుల ధ్వనులతో ప్రతిధ్వనించునవి, అనేక విధాలుగా అలంకరింపబడి నిర్మలోదకములు గల దివ్యసరస్సులను దర్శించి మల్లె తీగెలతోను, కడిమిచెట్లతోను, మద్దివృక్షములతోను, టేకు చెట్లతోను, బొట్టుగ చెట్లతోను, సంపెంగ, అశోక, కొండమల్లి, ఎఱ్ఱకాంచనం, వేగిస మొదలగు తీరమునందలి వృక్షములతో విలసిల్లునట్టి సరస్సులలో ప్రీతితో స్నానమాచరించి, యథాశాస్త్రముగా దేవపూజ చేసి అక్కడినుండి మునులతో కలిసి వెళ్ళి ఆ పర్వతంపై సంచరిస్తూ

చూడదగిన మునులను, గుటికపిగుళ్ళను భుజిస్తూ వనంలో అటు యిటు తిరుగుతున్న జింకలను, జింకపిల్లలను, మేఘములను పోలిన తెల్లని దంతములుకల ఏనుగులను, ఒక శిఖరమునుండి మరొక శిఖరమునకు వేగంగా దుముకుతున్న కోతులను, అనేక విధాలుగా ప్రకాశిస్తున్న శిఖరమున చాలా కాలము బ్రహ్మవచనములను తలచుకొనుచు ఋషులతో కూడి శ్రీమన్నారాయణుని చూడాలనే కాంక్ష కలిగి వుండి, అనేక జలాశయాలను, వైడూర్యకాంతి వలె నిర్మలోదకాలైన పుణ్యానదులను, నిర్మల సరస్సులను చూస్తూ, నిర్మల సరస్సులలో స్నానం చేస్తూ భక్తుడైన అగస్త్యుడు శ్రీమన్నారాయణుని పూజించెను.

అగస్త్యుడు మునీంద్రులతో కూడి మనస్సుకు ఆహ్లాదము కల్పించే స్వామిపుష్కరిణిని మినహాయించి మిగిలిన తీర్థములన్నీ చూసి ఆనందించి పవిత్ర తీర్థములైన అన్ని తీర్థములయందు స్నానం చేసి శ్రియఃపతిని పూజించసాగెను. మునులందరు కూడా చాలా సంతోషించారు. మునీంద్రులు పవిత్రమైన నూర్లకొలది వేలకొలది తీర్థములను సేవించి ఆయా తీర్థములలో స్నానపానాలతో పురాణపురుషుని అర్చించసాగినారు. అనంతరము జితేంద్రియుడైన అగస్త్యుడు శ్రియఃపతిని సేవించవలెననే సంకల్పముతో పర్వతశిఖరములో సంచరిస్తూ చిరకాలం పురుషోత్తముడు, సృష్టికర్త ఈశ్వరుడు, సకల ప్రాణులకు ఆధారభూతుడైన ఆదిదేవుని చూడక గొప్ప దుఃఖముతో మునీంద్రులతో కూడి ఒకానొక పర్వతగుహలో కూర్చొని పర్వతం చుట్టు పక్కల చూచి పూర్వం బ్రహ్మ 'చూడగలవు' అని చెప్పిన మాటను చింతించసాగెను. ఈ విధంగా మునీంద్రులు ఆ పర్వతంపై వందలాది సంవత్సరములు నివసించారు. ఋషులు కూడా శ్రీమన్నారాయణుని చూడక దుఃఖసంతప్తులై అగస్త్యుని చేరారు.

అనంతరము మహర్షులు వృక్షసమూహములతో అలంకరింపబడిన పర్వతముపై ఉండగా దేవగురువైన బృహస్పతి, ఆత్మజ్ఞానియైన శుక్రాచార్యులు

వచ్చారు. ఇంకను భగవద్భక్తుడు, పూర్వం బ్రాహ్మణశాపముతో పాతాళలోక పతితుడై, మరల విష్ణువు చేత సంసారసాగరాన్నుండి ఉద్ధరింపబడిన ఉపరిచరవసు మహారాజు కూడా ఆ పర్వతమును చేరాడు.

4.5.6. శంఖాదులు భగవంతుని దివ్య మంగళ విగ్రహమును సేవించుట :

అనంతరం ఉపరిచరవసువు, బృహస్పతి, శుక్రాచార్యులు మేరుపర్వత సమానమై, అనేకములైన గైరికాదిధాతువులచే అలంకరింపబడి మిక్కిలి ప్రకాశించునదై, తన కాంతితో పది దిక్కులను ప్రకాశింపచేయు శిఖరముతో విరాజిల్లుచున్నట్టి, అగస్త్యుడు మొదలైన సూర్యసమతేజులైన మునులతో నిండిన వేంకటాచలమునకు మహర్షులతో కూడి ప్రకాశించుచున్న, అగ్నిహోత్రుని వలె వస్తున్న, సూర్యునివలె అన్ని దిక్కులను తమ తేజస్సుతో ప్రకాశింపచేస్తూన్న ఆ ముగ్గురు అగస్త్యుడు మొదలైన ఋషులందరిని పూజించిరి. అగస్త్యుడు మొదలైన ఋషులంతా ఆ పర్వతముపై దుఃఖిస్తూ ఆసీనులై యుండిరి. వారు అపర భాస్కరుల వలె వస్తున్న ఆ ముగ్గురిని చూసి సంతుష్టులై ఒకరినొకరు పరస్పరము సంభాషించుకొనసాగిరి. 'బ్రహ్మర్షివరేణ్యులారా! మేము మిమ్ములను కలియుటతో మాకు శుభోదయమైంది. రాత్రి శుభమైంది. తిథులన్నీ పవిత్రములైనాయి. మీరు ఈ పర్వతరాజమునకు ఎందులకు విచ్చేసినారు? ఎందుకు దుఃఖిస్తున్నారు? ఎవరిని చూడవలెనని యిక్కడకు వచ్చినారు? ఈ వృత్తాంతం సర్వం యథార్థముగా మాకు తెలియజేయండి' అని వసువు మొదలైనవారు అడిగినదానికి ఋషులు ఈవిధంగా సమాధానం చెప్పారు.

'శంఖచక్రధారి, పీతాంబరధారి, భక్తులను సంసారసాగరంలో పడనీయనివాడు, నారాయణాద్రీశుడు, పురుషోత్తముడు, ప్రపంచాన్ని నియమించేవాడు, సృష్టించేవాడు, శుభాలనిచ్చేవాడు అయిన శ్రీమన్నారాయణుని దర్శించవలెనని వచ్చియున్నాము. ఎంతకాలము వెదకుతూ తిరిగినా

శ్రీమన్నారాయణుని కాంచలేకపోవుటచే దుఃఖిస్తున్నాము. అనాదియైన శ్రీమన్నారాయణుని చూడలేమైతిమను దుఃఖభారముతో మా మనస్సులు చాలా కలత చెందుతున్నాయి. గైరికాది ధాతువులచే అలంకరింపబడిన ఈ పర్వత శిఖరంపై ఈ కారణము వల్లనే దుఃఖిస్తున్నాము' అని చెప్పగా మనువు మొదలగువారు వారి నూరడించి 'హైహయాధిపతి, శ్రుతుని పుత్రుడైన శంఖనృపతి స్వామి పుష్కరిణీ తీరములో శ్రీమన్నారాయణుని అర్చిస్తూ తపస్సు చేస్తున్నాడు. శ్రీమన్నారాయణుడు అతనికి ప్రత్యక్షమగునని విన్నాము. ఆ సమయమాసన్నమైనది. సకలాభీష్టప్రదము, పవిత్రము, దేవతలచే సేవింపదగినది అయిన స్వామి పుష్కరిణిని సమీపించి సర్వవాంఛాప్రదాత, సర్వేశ్వరుడు, సర్వజనవంద్యుడైన శ్రీమన్నారాయణుని సేవించెదము. ఇక్కడ ఒక్క క్షణము కూడా నిలువక వెంటనే వెళ్ళుదము అని చెప్పగా మునిశ్రేష్ఠులు సంతసించి, విగతమోహాలై నిర్మలాంతఃకరణులై బయలు దేరిరి.

మునిగణసేవితమైన స్వామి పుష్కరిణి తీర్థమునకు వెడుతూ, వేంకటాచలమును చూస్తూ సంతుష్టాంతరంగులై పరస్పరం ఇలా భాషించు కొనసాగిరి. ఈ వేంకటాచలము అనేక వృక్షరాజములతో శోభిస్తూ, భూలోకవాసులకు ప్రియమై, శ్రీమన్నారాయణునికి ఆవాసమైనది కదా! ప్రాచీనులైన మునులందరు అనాది పురుషుడు, దేవాధిపతి, అవ్యయుడైన శ్రీహరిని ఈ పర్వతము నుండియే దర్శించినారు. భక్తులు కూడా హరిని స్తుతిస్తూ వేంకటాచలాన్ని అధిరోహించి శ్రీమన్నారాయణుని సేవిస్తున్నారు కదా! శ్రీమన్నారాయణుడు నివసించే స్థలములన్నింటిలోను ఈ వేంకటాచలము మిక్కిలి ప్రీతికరమైనది కదా![17]

---

17. డా.కె. హయగ్రీవ శర్మగారు 'Significance of Seven Hills in Krishna Yajurveda - A Study' అనే పరిశోధనావ్యాసంలో భగవంతుడైన వేంకటేశ్వరుడు శ్రీ వేంకటాచల క్షేత్రంలో నివసించుటకు గల కారణం, ఏడు కొండల పవిత్రత, మాహాత్మ్యం, ప్రాధాన్యతల గురించి వైదిక విషయాధారంతో ఇలా వివరించారు- **Contd**

నారాయణునికి ఈ పర్వతం ప్రియతమమైనందువల్ల నారాయణాద్రిగా పేరొచ్చింది. దీనికంటే ప్రియతరమైన స్థానము మరొకటి లేదు.

ఈ విధంగా వందల కొలది మునిపుంగవులు పరస్పరం సంభాషించుకుంటూ వెళ్ళసాగారు. శ్వేతద్వీపనివాసులైన సిద్ధపురుషులు కూడా క్షీరోదశాయి, భగవంతుడైన శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో దేవ సారూప్యాన్ని పొంది, సదా శ్రీమన్నారాయణుని అనుసరిస్తూ, అతనికి ప్రీతి కలిగిస్తూ, జగత్కర్త అయిన

యజ్ఞస్వరూపుడైన విష్ణువు దేవతలకు కనిపించకుండా భూలోకమునకు వేంచేశాడు. దేవాధ్యక్షుడైన ఇంద్రుడు కూడా విష్ణువును అనుసరించి 'గుహలో ప్రవేశించిన శత్రువును చంపుటకు వచ్చితి'నని పలికెను. అప్పుడు విష్ణువు 'గుహనుండి నీ శత్రువును బయటకు తెచ్చెదను' అని పలికి ఒక కథను వినిపించెను.

"ఒకానొకసమయంలో రాక్షసప్రభావంతో దీక్షాదులైన యజ్ఞ భాగాలు నన్ను వదలి భూలోకానికి విచ్చేశాయి. నాలుగు దీక్షలు, మూడు ఉపసత్తులు,ఒకటి సుత్య, కలిసి ఎనిమిది రోజుల సాధ్యాలైన కర్మలు వామమోషుడనే దేవత 'సుత్య'ను (దైవవిత్తు) అపహరించి రాక్షసులకు ఇచ్చాడు. అతడే వరాహ రూపమును ధరించి పర్వత ప్రాంతాలలో తిరుగుతు సుత్యను రక్షించెను. 'ఓ ఇంద్రా! నీవు గుహలో నున్న శత్రువును వరాహరూపుని చంపెదనంటే నేను అతనిని బయటకు రప్పిస్తాను' అని చెప్పెను. అప్పుడు ఇంద్రుడు దర్భలను గ్రహించి అభిమంత్రించి వరాహరూపునిపై ప్రయోగించెను. భగవంతుడైన విష్ణువు వరాహరూపుడైన శత్రువును దైవవిత్తంతో కూడా బయటకు రప్పించి దేవతలకు ప్రసాదించెను. వేది రూపంలో ఉన్న దైవవిత్తము మరల దేవతలకే లభించడంతో 'వేది'అని చెప్పడమైనది."

పై చెప్పిన ఉపాఖ్యానం ద్వారా తెలిసింది ఏమనగా యజ్ఞ భాగాలు భూలోకానికి వచ్చి పర్వత రూపం పొందాయి. యజ్ఞపురుషుడు స్వయం విష్ణువై యజ్ఞభాగములను వెదుకుతూ భూలోకమునకు ఏతెంచాడు. అందుకే భగవంతుడైన విష్ణువు సప్తగిరులలో నివసించుటకు ఎక్కువ ఆసక్తిని చూపిస్తాడు.

ప్రభువును స్తుతిస్తూ అక్కడికి చేరారు. మహాతపస్సంపన్నులు, పర్వతంపై సంచరిస్తున్న మహర్షులతో కూడిన శ్వేతద్వీప నివాసులను అగస్త్యాదులు అందరూ మిక్కిలి సంతోషంతో పూజించారు. మునులందరు కూడా ఆనందవికసితనేత్రులై, సూర్యసమాన తేజస్సు కలవారై వచ్చినటువంటి సిద్ధులను పూజించారు. అనంతరము వేలకొలది సిద్ధులు, మునీంద్రులు మిక్కిలి సంతోషముతో సకల ప్రాణులకు సృష్టి స్థితి లయ కారుడైన శ్రీమన్నారాయణుని నివాసస్థానమైన, దేవతలచే- రాక్షసులచే సేవించబడుతున్న స్వామి పుష్కరిణీ తీరమును చేరారు.

అక్కడ వారందరు నీలమేఘశ్యాముడు, పద్మపత్రనేత్రుడు అయిన విష్ణువును దర్శించలేదు కాని జితేంద్రియుడు, శ్రీమన్నారాయణుని గూర్చి గొప్పతపస్సు చేస్తున్న శంఖనృపతిని చూశారు. వచ్చినవారిని చూసి రాజకుమారుడైన శంఖుడు పులకితగాత్రుడై, గొప్ప సంతోషముతో తనను కృతార్థునిగా భావించి పూర్వం యజ్ఞస్వరూపుడైన నారాయణుని చేత చెప్పబడిన మునివరులుండగా నన్ను చూడగలవన్న మాటను స్మరించుకొని వెంటనే లేచి జీర్ణమయిన అంగములతో సంభ్రాంతమానసుడై శ్వేతద్వీపనివాసులకు, సిద్ధపురుషులకు, బృహస్పతి, శుక్రాచార్యుడు, ధీమంతుడైన ఉపరిచరవసువుకు అంజలి బద్ధుడై నమస్కరించాడు.

స్వామి పుష్కరిణీతీరంలో పురుషోత్తముని దర్శించవలెనన్న కుతూహలము కలవారందరు కలిసి గోవిందుని, సర్వవ్యాపకుని నాశరహితుని, ఆది మధ్యాంత రహితుని, సకల ప్రాణినివాసిని శ్రీహరిని కానక కఠిన తపస్సుచేస్తూ, జితేంద్రియులై శ్రియః పతిని ధ్యానిస్తూ అక్కడే ఉన్న మంగళప్రదమైన పవిత్రమైన స్వామిపుష్కరిణిలో ప్రతిదినము స్నానం చేస్తూ, పానం చేస్తూ, సంతోషిస్తూ, పరిమళములు వెదజల్లే దివ్యమైన పుష్పములతో శ్రీమన్నారాయణుని అర్చిస్తూ అదృశ్యరూపుడైన మాధవుని చూడాలని మూడు రాత్రులు దీక్షతో ఘోరమైన తపస్సును చేశారు. అనంతరము శుభకరమైన నాలుగవ రోజు సూర్యోదయాన శుభనక్షత్రంలో నిర్మలాకాశంలో

తపోదీక్ష ముగియడంతో పురుషోత్తముడు, లోకనాథుడు, సాక్షాత్ శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై స్వప్రకాశంతో లోకాలన్నిటిని ప్రకాశింపచేస్తూ ప్రత్యక్షమయ్యాడు[18].

4.6. శ్రీ శంకరవృత్తాంతం :

4.6.1. శంకరుడు శ్రీ వేంకటాచలము నుండి కైలాసమునకు వెళ్ళుట :

చంద్రశేఖరుడు, సుఖకరుడు, భగవంతుడైన శంకరుడు వేంకటాచలము నుండి తన నివాసమైన ప్రాకృతమైన కైలాసమునకు ఎట్లు బయలుచేరెను? ఈ వృత్తాంతమును సర్వమును వినగోరుచున్నాను. వినువారికి ఆనందదాయకమైన ఆ అద్భుతచరితమును చెప్పుమని జనకమహారాజు అడుగగా వామదేవుడు శ్రీశంకరవృత్తాంతమును ఈ విధముగా చెప్పెను –

గొప్ప పరాక్రమవంతుడు, మేరు–మందర పర్వతమువలె సమున్నతుడు, రకరకాలైన మణిసమూహములతో కూడిన, మ్రోగుచున్న మణులతో అలంకరింపబడిన మహాకాయుడు, మహాబలుడు, మేఘ సదృశకాంతి గలవాడు, మేఘమువలె గర్జించు శబ్దము కలవాడు, శత్రువులకు దుఃఖమును పెంచువాడు, లోకాలన్నింటిలో ప్రసిద్ధి– చెందినవాడు, సకల రత్నములతో అలంకృతుడైనవాడు, వేగములో వాయుసముడు, ప్రకాశించు మణిగణములతో, బంగారు తాళ్ళతో బద్ధుడై అంతరిక్షమునకు వెళ్ళుచున్నవాడు, గొప్ప పర్వతమును బంగారు మాలతో చుట్టబడినట్లున్న శరీరముతో ప్రకాశించుచున్నవాడు, చూడదగిన శుభస్వరూపుడు, అనేక వందలు–వేల సంఖ్యాకములైన స్వర్ణమయములైన కింకిణీజాల సమూహములతో చుట్టబడిన శరీరము కలవాడు, వదలుతున్న

---

18. అగస్త్యమహర్షిచరితం వరాహ, మార్కండేయ, స్కాంద పురాణాలలో అనేక విధములుగా వర్ణింపబడింది.

ప్రకాశిస్తున్న శుభకిరణములతో కట్టిన దారములతో అలంకరింపబడిన పెద్ద చెవులు గల మహాకాయుడైన మహా వృషభాన్ని అధిరోహించిన భగవాన్ శంకరుడు పరాక్రమవంతులైన ప్రమథగణములతో భేతాళులతో అనేక బాహువులు కలిగిన, ఆకాశచరులు స్తుతిస్తున్న, స్థావరజంగమాత్మకమైన జగత్తు తన కాంతితో ప్రకాశిస్తూండగా నారాయణాదియొక్క కథలు వింటూ మెల్లగా కైలాసపర్వతమునకు బయలు దేరెను. త్రిపురాంతకుడు, త్రిశూలపాణి, భగవంతుడైన శంకరుడు మునీంద్రులతో దివ్యమైన వెండికొండను అనేక రత్నములతో ప్రకాశిస్తున్న పారిజాత వృక్షములతో అలంకరింపబడిన అనేకమంది తపశ్శాలురతో సిద్ధ సంఘములతో కూడిన కైలాసమును చేరెను.

4.6.2. ప్రమథగణవర్ణనం :

వేలకొలది ప్రమథగణములు శంకరుని చుట్టూ చేరాయి. అందులో అనేక రూపములను ధరించినవారు, భయంకరులు, శివుని ఆదేశాన్ని పాటించే అంజనాద్రిసములు, తామరతూడువలె కోమలమైనవారు కొందరు, మరికొందరు సాయంకాల మేఘకాంతిని పోలినవారు, ఇంకొందరు ఏక భుజులున్నారు. ఆ భూతగణములలో కొంతమంది మోకాళ్లలో శిరస్సు కలవారు, మరికొంతమంది అరచేతిలో తల ఉన్నవారున్నారు. వారి వర్ణముకాని, రూపం కాని వర్ణించనలవికాదు. అందులో కొంతమంది గజముఖులు, అశ్వముఖులు, మరికొంతమంది గాడిదముఖములు, కొంతమంది, పులిముఖములు గలవారు. దేవతలు కూడా చాలా కాలము నుండి వారి ప్రమథగణముల రూపములను వివిధాకృతులను చెప్పజాలక పోయారు. ఈ విధమైన అనేక భూతసంఘములతో కూడిన శంకరుడు కైలాసపర్వతమును చేరాడు.

4.6.3. కైలాసనాథుడైన శంకరుని వర్ణన :

దోషహరుడు, శ్వేత పర్వత సముడు, నీలకంఠుడు అయిన శంకరుని రూపము త్రివిక్రమావతారములో లోకనాథుడైన శ్రీమన్నారాయణుని శరీరము

వలె విరాజిల్లినది. దోషవినిర్ముక్తుని, కైలాసప్రభువును, త్రిపురారిని, శాంతమూర్తిని, శివుని చూచి సకల భూతములు సమీపించి శిరసుతో భక్తియుక్తులతో నమస్కరించినవి. భయంకరకర్మను చేయువాడు, పార్వతీపతి, భగవంతుడు అయిన రుద్రుని విలాసముగా మోస్తూ వృషభరాజు ఆకాశమార్గంలో పయనించాడు. ఆ వృషభం ఆకాశంలో సంచరిస్తూంటే, అద్భుతమైన, అందమైన కొమ్ములతో, బంగారు భూషణములతో, హంస, చంద్రుడు, మొల్ల, స్ఫటికములవలె తెల్లని శరీరమును ధరించి, మహామేఘుడువలె విరాజిల్లాడు. దేవతలు, బ్రహ్మర్షులు అంజలి బద్ధులై త్రిపురారిని స్తుతిస్తూ ఆ వృషభమును అనుసరించారు.

కైలాసమునకు వెళ్ళుచున్న శివుని దేవతలు, బ్రహ్మర్షులు, ఈ విధంగా స్తుతించినట్లు వామదేవుడు చెప్పసాగాడు.

గరుడారూఢుడైన శ్రీహరివలె వృషభారూఢుడు, పినాకపాణియైన ఈశ్వరునికి నమస్కరిస్తున్నాము. త్రిపురములను నియమించిన త్రినేత్రుడు, త్రిశూలధారి, విష్ణు భక్తుడు, విరూపాక్షుడు, శ్రీమన్నారాయణునికి ప్రీతి చేకూర్చువాడు, దుష్టరాక్షస సంహారకుడు, కైలాసవాసి, మహేశ్వరుడు, ఇచ్ఛారూపధారి, శంకరుడు, భీకరరూపుడు, మహాదేవుడు, అభేద్యుడు, దురాసదుడు, నీలకంఠుడు, త్రినేత్రుడు, సకల సంహారకర్త, కపిల వర్ణుడు, విశాలనేత్రుడు, జటామకుటధారి, గజ చర్మమును ధరించినవాడు, వృషభధ్వజుడవైన నీకు మేము నమస్కరిస్తున్నాము. నిన్నే శరణు కోరుతున్న మమ్ము రక్షించు. సర్వలోక ప్రభువైన నీవే మాకు అందరికీ రక్షకుడవు అని దేవతలు, బ్రహ్మర్షులు మరొక నారాయణునివలె మహాత్ముడైన శంకరుని అనుసరించిరి.

పశుపతి ఈ విధంగా స్తుతించబడి మహా పవిత్రము, పర్వత రాజమైన కైలాసమునకు వెళ్ళి, సకల భూత సంసేవ్యమానమైన దేవర్షి సిద్ధ మనుజ గంధర్వులచేత సంసేవితమైన అత్యంత పరిమళోపేతమైన దివ్యమైన తన మందిరాన్ని ప్రవేశించాడు. మునీంద్రులు అక్కడివారంతా చూచుచుండగనే

దేవతాశ్రేష్ఠుడు, పరాక్రమవంతుడైన శంకరుడు తన అనుచరులతో కలిసి అంతర్హితుడైనాడు.

4.7. శంఖనృపతి వృత్తాంతం :

పూర్వం హైహయవంశంలో మహాతేజశ్శాలియైన శంఖుడనే రాజు ఉండేవాడు. అతడు స్వధర్మకార్యాచరణలో ప్రసిద్ధిని పొందాడు. అతని తండ్రి పేరు శ్రుతుడు. శత్రు పుర విజేతయైన శంఖుడు పర్వతములతోను, వనములతోను, అడవులతోను నిండిన భూమినంతా పరిపాలించాడు. అతడు భూలోకంలో ప్రహ్లాదునివలె భగవద్భక్తుడు, సకల సద్గుణ సంపన్నుడు, పరమ ధార్మికుడుగా వుండి, ఆర్తత్రాణపరాయణుడు జగదీశ్వరుడు అయిన శ్రీమన్నారాయణుని అశ్వమేధాది యజ్ఞములతో ఆరాధించాడు. ఆ యజ్ఞములలో శ్రీమన్నారాయణుని ప్రీత్యర్థం వేలకొలది దక్షిణలను దాన మిచ్చాడు. భక్త్యతిశయముతో అనుష్ఠించిన యజ్ఞములతో దక్షిణలతో ఆ కమలాక్షుని లౌకికవస్తువులతో పోల్చిచూడరానట్టి భావవికారరహితమైన, ప్రకాశించుచున్న పురాణ పురుషుడైన నారాయణుని దర్శించలేక పోయాడు. అందులకు మిగుల దుఃఖితు డయ్యాడు. అటువంటి పరితాపముతో భక్తి భరిత చిత్తముతో అనేక యజ్ఞములను ఆచరించి కొంతకాలమయిన తరువాత మాధవుని దర్శించాడు.

4.7.1. భగవంతుడు స్వామి పుష్కరిణికి గంగాది అశేషపుణ్య తీర్థములతో సామ్యము చెప్పుట :

ఒకానొకనాడు భగవంతుడైన శ్రీమన్నారాయణుడు శంఖనృపతి దుఃఖమును చూసి అంతర్హితుడై అందరికీ వినిపించునట్లు మేఘ గంభీర వాక్కుతో–

'ఓ రాజా! నీవు నారాయణాద్రిపై భక్తి యుక్తులతో ఘోరతపస్సు ఆచరించినచో నన్ను దర్శించగలవు. అక్కడ నిర్మలమై పాప పరిహారిణియై నూరు ధనువుల నిడివి కలదై వైడూర్యమువలె నిర్మల జలము కలదై, ముల్లోకముల

యందు స్వామి పుష్కరిణియని ప్రసిద్ధి చెంది గంగాది సకల పుణ్యానదులతో సమానముగు నిర్మలోదకము కలదై యున్నది. ఆ పుష్కరిణి యందు స్నానమాచరించిన జనులు పాపవిముక్తులగుదురు. ఆ పుష్కరిణీ తీరములో గొప్ప తపస్సు చేసి నిర్మలచిత్తుడవు కా! వేల సంవత్సరములు గడచిన తరువాత మహా తేజశ్శాలియయిన అగస్త్యుడు అనేకమంది ఋషులతో కూడినవాడైనన్ను చూడాలని పర్వత చరియలలో సంచరిస్తూ నా యందు నిశ్చలభక్తియుక్తుడై రాగలడు. నీవు నా అనుగ్రహంతో కొలది కాలములోనే ఆ మహాత్ములతో కలసి నన్ను దర్శింపగలవు. నీవు చింతించవద్దు. నీవు కోరింది అనుగ్రహించగలను. నీవు ఆ పర్వతమును చేరు'మని దేవాదిదేవుడు, జగత్ప్రభువు శ్రీమన్నారాయణుడు చెప్పాడు.

4.7.2. శంఖుని తపస్సు, భగవంతుని వరప్రదానము :

బుద్ధిమంతుడైన శంఖనృపతి అదృశ్యరూపుడైన శ్రీమన్నారాయణుని మధురవాక్కును ఆనందంతో విని దేవేంద్ర సమవిక్రముడు, శాంత స్వరూపుడు, పురుషశ్రేష్ఠుడు, మరొక దేవేంద్రుడువలె భావిస్తున్న తన కుమారుని రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేసి శ్రీమన్నారాయణుని నివాసమైన నారాయణాద్రికి వెళ్ళి స్వామి పుష్కరిణీ తీరంలో బ్రహ్మ యొక్క ఆజ్ఞానుసారం అన్ని విషయములలో ఆసక్తి లేనటువంటివాడై పరబ్రహ్మఅయిన శ్రీమన్నారాయణుని యందు మనస్సును లగ్నం చేసి, అతనిని యథాశాస్త్రముగా ధ్యానిస్తూ అర్చిస్తూ వేల కొలది సంవత్సరములు తపస్సు చేశాడు.

అనంతరం శ్రీహరి ప్రత్యక్షమైనాడు. హైహయాధిపతి అయిన శ్రుతుని పుత్రుడైన శంఖునితో కేశవుడైన నారాయణుడు 'ఓ రాజా! సంతుష్టుడనైతిని. నీ మనస్సులో ఏముందో అది కోరుకో. నీ అభీష్టమును ప్రసాదించుటకు నేను వచ్చితిని' అని చెప్పగానే సర్వజనరక్షకుడైన అనంతుని, జగత్కర్తఅయిన పురుషోత్తముని మాటలను విని శంఖనృపతి పరమ సంతుష్టుడై, రోమాంచిత దేహుడై,

అవ్యక్తజన్ముడు, దేవాది దేవుడు, పరబ్రహ్మ స్వరూపుడైన విష్ణువుకు ఈ విధంగా విన్నవించు- కొన్నాడు -

'ఓ జనార్దనా! నీ అనుగ్రహంతో నీ పదమును పొందగోరుతున్నాను. నీ నివాసమైన పరమపదములో నివసించుటకు నేను కఠిన తపస్సును ఆచరిస్తాను. అందువలన నీవు నాకు శీఘ్రముగనే నీ పదమును ప్రాప్తింపచేయి. నాకు వేరొక వరము అక్కరలేదు'. శంఖమహారాజు ఈ విధంగా ప్రార్థించగా అచ్యుతుడు తన మధుర వాక్కుతో ప్రాణులకు సంతోషం కలిగించేటట్లు నవ్వి 'సుచరిత్రుడా! ప్రళయాంతం వరకు ఇంద్రలోకములో నివసించే సర్వదేవతల చేత పూజింపబడి స్వర్గలోకములో నివసించెదవు' అని వరమిచ్చెను[19].

4.8. ఉపరిచరవసువు వృత్తాంతము :

ఉపరిచరవసువు బ్రాహ్మణశాపంతో ఏవిధంగా పాతాళంలో పడినాడు? సంసారరూపమైన అరణ్యము నుండి ఉద్ధరింపబడినట్లు హరి చేత ఎందులకు ఉద్ధరింపబడినాడు? ఈ ఆశ్చర్యకరమైన చరితమును వినగోరుచున్నాను. నీవు నారాయణుని ఆశ్రయించినందువల్ల నన్ను అనుగ్రహించమని జనకుడు వామదేవుని ప్రార్థించాడు. సకల శాస్త్రపారంగతుడు, పూజ్యుడైన వామదేవుడు జనకుని వినమని ఈ విధంగా చెప్పనారంభించాడు.

శ్రీమన్నారాయణాశ్రితమైన పవిత్ర చరితము చాలా ఆశ్చర్యకరమైనది. పూర్వము ఋషులు, ఇంద్రునితో కూడిన దేవతలు ధర్మసందేహం కలిగినవారై రాజైన ఉపరిచరవసువును చూచుటకు ఆ ప్రదేశమునకు బయలుదేరారు. అంతలోపల ఎక్కడినుంచో బయలుదేరిన రాజైన వసువు అక్కడికి చేరాడు.

---

19. శంఖనృపతి వృత్తాంతము వరాహ, బ్రహ్మాండ, స్కాంద పురాణములలో విభిన్నరీతులలో వర్ణించ బడింది.

దేవతలు, ఋషులు అతనికి ఎదురేగారు. రాజు సింహాసనము నుండి లేచి, వచ్చినటువంటి ఋషులను, దేవతలను యథారీతిగ పూజించి నమస్కరించి కుతూహలముతో ప్రశ్నించాడు. ముల్లోకాలలో పూజింపబడే వేదపారులైన మీరు నా చెంతకు వచ్చినందుకు నేను కృతార్థుడను. ఈ ఆసనాలపై ఆసీనులు కండి. శుద్ధాంతః కరణులైన దేవతలు, బ్రహ్మర్షులు నన్ను అనుగ్రహించవలెను అని పలికి వారికి మణిమయకాంచన చిత్రములతో ప్రకాశించే ఆసనములు ఇచ్చి మునులతో దేవతలతో ధర్మజ్ఞుడైన ఉపరిచరవసువు సంతుష్టుడై 'మీ రాకకు కారణమేమి? మీకు నాతో ఏమి పని? వివరించవలసింది' అని వినయముతో కోరాడు.

అనంతరము మునీంద్రులు, దేవతలు కలిసి ధర్మసందేహముతో ధర్మతత్త్వమును తెలుసుకొనుటకు సిద్ధమైనారు. తమ ధర్మ సంశయాన్ని పరిహరించవలసిందిగా కోరారు. 'ఓ రాజా! సజ్జనులు పశువుతో యాగం చేయవలెనా? లేక ఔషధములతో యజ్ఞమును ఆచరించవచ్చునా' మాకు ఈ విషయమై యథార్థతత్వమును చెప్పుము. మా సంశయమును పరిహరించుము. మీ మాటే మాకు ప్రమాణము' అని చెప్పినారు. అప్పుడు ఉపరిచరవసువు వారికి నమస్కరించి 'ఋషిపుంగవులారా! ఎవరి అభిప్రాయమేది? సత్యమునే చెప్పండి' అని చెప్పగా ఋషులు 'మా అభిప్రాయములు పరస్పర విరుద్ధములు. ఋషుల అభిప్రాయం ధాన్యముతో యజ్ఞము చేయవలెనని, దేవతలు పశువుతో యజ్ఞము నాచరించవలెననీ రెండు పక్షములు విరుద్ధములుగా నున్నవని చెప్పిరి. వారి మాటలను విన్న వసువు ఈ ప్రశ్నకు సమాధానమిచ్చుటకు కొంత యోచించవలసి వచ్చింది. ఇందులో దేవతలు ఋషుల మధ్య దేవతలు ప్రథమ పూజనీయులు. అందువల్ల దేవతల పక్షమే అంగీకరించవలసిందిగా మనస్సులో భావించి, దేవతలు పశువు ద్వారా యజ్ఞము నాచరించవలెనన్నారు కావున దేవతలు చెప్పిన అభిప్రాయమే స్వీకరించవలసినది అని బదులిచ్చెను.

4.8.1. ఉపరిచరవసువుకు పాతాళలోకప్రాప్తి :

రాజైన ఉపరిచరవసువు చెప్పిన మాటను విని క్రోధతామ్రేక్షణులైన మహర్షులు రాజుతో ఇలా అన్నారు– 'నీవు చెప్పినది ఉత్తమమైనది కాకపోతే నీవు ఇష్టపడకపోయినా నీవు భయంకరమైన పాతాళలోకాన్ని చేరగలవు. ఒకవేళ నీవు చెప్పినది ఉత్తమమైతే మేము ఆ భయంకరమైన పాతాళాన్ని చేరగలము. సకల జగత్స్రష్ట, పూజ్యుడు, సర్వాంతర్యామి, పద్మపత్రనేత్రుడు, కృష్ణుడు అయిన శ్రీమన్నారాయణుడే ఈ ధర్మతత్త్వం తెలిసినవాడు. ఇంకొకరికి తెలియదు లేక బ్రహ్మకు తెలియవచ్చు. అదేవిధంగా సకల జగత్సంహారకర్త, త్రిపురాసుర సంహారి అయిన శంకరునికి తెలుసు' ఈ విధంగా ఋషులు పలుకగనే ఉపరిచర వసువు అయిష్టంగానే భయంకరమైన పాతాళంలో పడ్డాడు.

రక్షకుడు, మధుసూదనుడు అయిన మహావిష్ణువును పరమ భక్తితో మనసున ధ్యానిస్తూ పాతాళంలోకి పడుతున్న వసువును అప్పుడు బిలంలో సంచరిస్తున్న వాయువు ఇతడు విష్ణుభక్తుడని ప్రీతితో పట్టుకొని మెల్ల మెల్లగా అతనిని రాక్షసనివాసమైన పాతాళలోకాన్ని చేర్చాడు. భూలోకంలో ప్రసిద్ధి చెందిన చేదిరాజైన వసువు తన మనస్సులో అచ్యుతుని, సర్వేశ్వరుని, వాసుదేవుని, దేవాధిపతి అయిన శంఖచక్రగదాధరుని సృష్టిస్థితి సంహారకర్తను, అనాయాసముగ కార్యనిర్వహణ చేయువానిని, కృష్ణుని, సకల జగన్నియంత అయిన శ్రీమన్నారాయణుని 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరమంత్రమును జపిస్తూ, జితేంద్రియుడై, అత్యంత భక్తియుక్తుడై పాతాళమును ప్రవేశించినప్పటికీ, విషాదమును, శోకమును, మోహమును, భయమును పొందలేదు.

వసువును చూసి పూర్వము తమకు వసురాజుకు గల శత్రుత్వాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ వందలు, వేలకొలది ఆయుధధారులైన రాక్షసులు, మహాబలులు, మహావీరులు, మహాదంష్ట్రులు, గొప్ప పరాక్రమవంతులు, చేదిరాజును చుట్టి

వెంటనే తమ తమ అస్త్రములతో కొట్టుచూ, బ్రహ్మాస్త్రం మొదలైన అస్త్రములతోను భయంకరమైన శస్త్రములతోను అతనిని చంపలేకపోయారు. శ్రియఃపతి పంపిన చక్రము వసురాజును రక్షించింది. రాక్షసులు వదలిన అస్త్రములు, శస్త్రములు అగ్నిలో పడిన కీటకములవలె చక్రాగ్నిలో పడి భస్మీభూతాలయినాయి. పాపకర్ములైన రాక్షసులు ఎట్లా వచ్చారో అదేవిధంగా స్వస్థానాన్ని చేరారు. ఉపరిచరవసువు శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ, తనకు ఇష్టమైన స్తోత్రములతో స్తుతించాడు. శ్రీహరి చేదిరాజు పాతాళంలో ఉండడం గుర్తించి గరుత్మంతుని స్మరించాడు. స్మరించినంత మాత్రాన వినతానుతుడైన గరుత్మంతుడు విష్ణువు ప్రక్కకు శీఘ్రముగా చేరినాడు. అవ్యక్తరూపుడు, విశ్వాత్ముడు, విశ్వవ్యాపి, స్వయం సుందరుడు, శేషతల్పంలో శయనించేవాడు, మధుసూదనుడు, భక్తవత్సలుడు, దేవాదిదేవుడు, క్షీరసముద్రనివాసి అయిన శ్రీమన్నారాయణుడు వస్తున్న గరుడుని చూచి మేఘగంభీరవాక్కుతో 'వినతానందనా! నాకు అత్యంత ప్రీతికరుడైన వసువు బ్రాహ్మణ శాపంతో భయంకరమైన పాతాళంలో పడి ఉన్నాడు. సచ్చరిత్రుడైన వసురాజు ఈ అవస్థను అనుభవించుటకు అనర్హుడు. ఆ విధంగా పడినా నాపట్ల అత్యంత భక్తియుక్తుడైనాపై మనస్సు లగ్నం చేసి, అహర్నిశలు ధ్యానిస్తున్నాడు. నీవు నా భక్తుడైన వసురాజు ఎక్కడ వున్నాడో అక్కడికి వెంటనే వెళ్ళు. నీవు నా ఆజ్ఞగా అక్కడికి వెళ్ళి, ఆ పాతాళము నుండి అతనిని తన రాజ్యానికి చేర్చు' అని ఆజ్ఞాపించాడు. ఈ విధంగా ఆజ్ఞను పొందిన గరుడుడు 'అలాగే'నని అతివేగంతో పాతాళాన్ని చేరాడు.

4.8.2. వసురాజును తీసుకొని వచ్చుటకు గరుడుడు రసాతలానికి వెళ్ళుట :

మహావేగవంతుడైన గరుడుని రెక్కల గాలికి అనేక మంది నాగేంద్రులు మరణించారు. పాతాళలోకవాసులైన వందలకొలది రాక్షసులు ఆ భయంతో నిర్వీర్యులైనారు. సముద్రాలు కృశించినవై, పర్వతములు కంపించినవై, మహావృక్షములు

సమూలంగా కొమ్మలు విరిగిపడిన్నై. ఆకాశచరులు, దేవయోనిజులు అంతరిక్షాన్ని వదలి స్వర్గాన్ని చేరారు. ఈ విధంగా గరుడుడు పాతాళంలో ప్రవేశించి అక్కడ భగవంతుడైన శ్రీహరిని స్తుతిస్తున్న వసువును చూశాడు. గరుత్మంతుడు వసురాజును చూసి సంతోషిస్తూ ఇలా అన్నాడు – "సృష్టిస్థితి లయ కర్త మహాతేజశ్శాలి అయిన శ్రీహరి 'నీవు పాతాళానికి వెళ్ళి నా భక్తుడైన, నాయందే మనస్సు లగ్నం చేసి స్తుతిస్తున్న వసురాజును పిలుచుకొని రమ్మ'ని ఆజ్ఞాపించాడు. ఈవిధంగా నిన్ను పిలుచుకొని వచ్చే కార్యంలో నియోగింపబడి నేను వచ్చితిని. నాపైన కూర్చొని రమ్ము" అని చెప్పగా వసువు అతిప్రీతితో గరుత్మంతుని చూసి

తవ పృష్ఠం సమారోఢుం న చేచ్ఛామి శుభేక్షణ ।
యత్రారోహతి గోవిందః కృష్ణః శుభవిలోచనః ॥
నాథశ్చ జగతాం ధాతా యస్మింశ్చక్రగదాధరః ।
ఆరోహతి మయా తస్మిన్ ఆస్థాతుం నైవ చోచితమ్ ॥

(32 అ. 84,85)

'వినతానందనా! శ్రీమన్నారాయణుడు అధిరోహించే నీపై కూర్చోవడం నాకు ఇష్టం లేదు. శ్రీమన్నారాయణుడు, జగద్రక్షకుడు, చక్రగదాద్యాయుధ ధరుడు అయిన మాధవుడు కూర్చొనే ఆసనంపై కూర్చోవడం నాకు ఇష్టం లేదు' అన్నాడు. అందులకు 'నీకు తగిన పలుకులనే పలికావు' అని వసువును ఆలింగనం చేసుకొని గొప్పవేగం కలవాడు, మహాతేజస్సంపన్నుడు, మహాదంష్ట్రుడు, మహాహనుడు అయిన గరుడుడు వేగంగా పైకి ఎగిరాడు.

ఎగురుతున్న గరుడుని రెక్కల గాలికి పాతాళలోకవాసులు మిక్కిలి భీతి చెందారు. మహావీరులు, మహానాగులు పది దిక్కులకు పరుగెత్తారు. వేల కొలది రాక్షసులు కృష్ణుడు వస్తున్నాడన్న సందేహంతో ఇటు అటు పరుగెత్తారు. గరుత్మంతుడు పాతాళలోకమును వదలి వసువును అతని దేశమునకు చేర్చి

అక్కడే వుండమని చెప్పి బయలుదేరాడు. రాజశ్రేష్ఠుడైన వసురాజు కూడా తన రాజ్యమును పొంది సకల భోగములను అనుభవించి రాజ్యపాలన చేయసాగాడు. సకలప్రాణుల హృదయస్థుడైన శ్రీమన్నారాయణుని అనుగ్రహంతో చివరికి ముక్తిని పొందాడు. జనకమహారాజా! జగద్రక్షకుడైన, ఆదిమధ్యాంతరహితుడైన శ్రీమన్నారాయణుని పూర్వచరిత్రము చెప్పడమైనది.

ఈ శ్రీమన్నారాయణ చరితమును ఏ మనుజుడైతే పఠించి భక్తితో అచ్యుతునికి నమస్కరిస్తాడో అతడు ఉత్తమగతిని పొందుతాడు. ఈ చరితమును శ్రద్ధగా విన్నవాడు,వినిపించేవాడు భగవద్భక్తిని పొందుతాడు.

నారాయణేతిహాసం యః శృణోతి శ్రావయిష్యతి ।
శ్రద్ధయా భగవద్భక్తిం ప్రాప్నోతి స నరాధిప ॥

అటువంటి మానవులు వాసుదేవుడు దయానిధి జగత్ప్రభువు, సకలాభీష్టదాయియైన విష్ణువు అనుగ్రహం వలన అన్ని కష్టముల నుండి విముక్తిని పొంది చేదిరాజైన వసువు వలె సంసార సాగరము నుండి చేత ఉద్ధరింపబడతారు[20].

ముచ్యన్తే తే నరాః సద్యో దుష్కృతైః సకలైర్నృప ।
ఉద్ధ్రియన్తే చ సంసారాత్ పాతాళా చ్చేదిరాడివ ॥
విభునా వాసుదేవేన కృష్ణేనైవ దయాలునా ।
హరిణా లోకనాథేన సర్వకామప్రదాయినా ॥

---

20. ఈ వృత్తాంతము మత్స్యపురాణంలోని 152వ అధ్యాయంలో యథాతథంగా వివరింపబడింది. మహాభారతంలోని శాంతిపర్వంలో 322-324 అధ్యాయములలో కొంత భేదంతో వర్ణించబడింది.

వాయుకృత శ్రీనివాసస్తుతిః

1. నమస్తే దేవదేవేశ! పురాణ పురుషోత్తమ ।
శ్రీధరాऽనంత! గోవింద! జిష్ణవే విష్ణవే నమః ॥
2. ఏకస్త్వం పురుషః సాక్షాత్ ఆదౌ మాయాసమన్వితః ।
జగదేకార్ణవీకృత్య శేషే సాగరసంప్లవే ॥
3. త్వన్నాభిపంకజోద్భూతో బ్రహ్మా బ్రహ్మవిదాం వరః ।
యేనేదం జగదుత్సృష్టం చరాచరసమన్వితమ్ ॥
4. రజో గుణం సమాశ్రిత్య జగత్సృష్టం త్వయా విభో ।
సత్త్వం గుణం సమాశ్రిత్య రక్ష్యతే హ్యఖిలం జగత్ ॥
5. తమో గుణం సమాశ్రిత్య హ్రియతే చ పునస్త్వయా ।
జాతాస్త్వయి బ్రహ్మరూపే తే ప్రజాపతయో నవ ॥
6. యేభ్యః సంభూతమేతత్తు దేవమానుషరాక్షసమ్ ।
మధుకైటభహంతా త్వం సంప్రాప్తే బ్రహ్మసంకటే ॥
7. తతోऽసురం సోమకాఖ్యం హత్వా వేదం చ తత్కరాత్ ।
గృహీత్వా బ్రహ్మణే ప్రాదాత్ మీనరూపీ మహేశ్వరః ॥
8. నిరాధారే జగత్యస్మిన్ నిరాలంబే చరాచరే ।
ఆధారః కూర్మరూపీ త్వం పురుషోత్తమ! తిష్ఠసి ॥
9. గతాముద్ధృత్య పాతాళం భువం నగిరికాననామ్ ।
వోఢాऽసి పోత్రిరూపేణ త్వం మహాత్మా సనాతనః ॥
10. పునః కృతయుగాదౌ తు హిరణ్యాఖ్యేऽసురే సతి ।
సైంహం ప్రహ్లాదరక్షార్థం నరార్ధతనుముద్వహన్ ॥
11. స్తంభాత్ కాలాయ సాజ్ఞాతో విదార్యాऽథ మహాసురమ్ ।
లక్ష్మీమాలింగ్య భగవన్! రక్షితా త్వం జగత్త్రయమ్ ॥

12. అథ కాలాంతరే విష్ణో! యాగే వైరోచనే ర్విభో! ।
త్వమింద్రచోదితో దేవ! వామనో వాగ్మినాం వరః ॥

13. పదాని త్రీణి యాచిత్వా ప్రతిగృహ్యా మహాబలేః ।
ఆక్రమ్య భూర్భువో లోకాన్ దత్త్వేంద్రాయ జగత్త్రయమ్ ॥

14. చంద్రమండల మాసాద్య పద్మాసనగతో విభో! ।
అమృతాఽన్నాధిపో విష్ణో! జగత్పాసి చరాచరమ్ ॥

15. జామదగ్న్యే మహాబాహో! రాక్షసాన్ రాజరూపిణః ।
హత్వా తద్రక్తకుండేషు కృత్వా పితృజలక్రియామ్ ॥

16. మహీం నిఃక్షత్రియాం కృత్వా యజ్ఞం కృత్వాఽశ్వమేధికమ్ ।
దక్షిణార్థం మహీం దత్వా కాశ్యపాయ జగత్ప్రభో! ॥

17. గత్వా మహోదధిం తత్ర సముద్రేణ కృతాలయః ।
సహ్యాద్రౌ రమణీయే త్వం తపశ్చరసి భార్గవః ॥

18. రావణే రాక్షసే దేవ! సంభూతే దేవకంటకే ।
తత స్త్రేతాయుగే జిష్ణో! రామో దాశరథిః స్వయమ్ ॥

19. లక్ష్మణానుచరో భూత్వా భార్యా హర్తారమాహవే ।
సపుత్రపౌత్రం సగణం సామాత్యం సంహరిష్యసి ॥

20. బలభద్రోఽథ కృష్ణస్త్వం వాసుదేవః సనాతనః ।
కల్యంతే కల్కిరూపీ చ భవితాఽసి త్రిలోకధృక్ ॥

21. ఆదిత్యానాం చ విష్ణుస్త్వం జ్యోతిషాం త్వం ప్రభాకరః ।
వసూనాం పావకశ్చ త్వం రుద్రాణాం శంభురుత్తమః ॥

22. గ్రహాణాం చ బుధోఽసి త్వం దేవానాం బలభిత్ భవాన్ ।
సిద్ధానాం కపిలోఽసి త్వం దేవర్షీణాం చ నారదః ॥

23. యజ్ఞానాం జపయజ్ఞోఽసి తపశ్చాసి తపస్వినామ్ ।
యక్షాణాం చ ధనేశస్త్వం యమః సంయమతాం భవాన్ ॥

24. మత్స్యానాం మకరోఽసి త్వం వరుణో యాదసాం పతిః ।
ఆపగానాం చ గంగా త్వం సరసాం సాగరో భవాన్ ॥

25. వాయూనాం ప్రాణవాయుస్త్వం విధాతౄణాం చతుర్ముఖః ।
వర్ణానాం బ్రాహ్మణశ్చ త్వమాశ్రమాణాం గృహీ భవాన్ ॥

26. తారకాణాం చ చంద్రస్త్వం ఇంద్రియాణాం మనో భవాన్ ।
సింహోఽసి త్వం మృగాణాం చ గజేంద్రోఽసి చతుష్పదామ్ ॥

27. ద్విపదాం బ్రాహ్మణశ్చాసి పక్షిణాం గరుడో భవాన్ ।
వాసుకిస్త్వంతు సర్పాణాం విషాణాం కాలకూటకమ్ ॥

28. నాగానాం త్వమనంతోఽసి మేరుస్త్వం కులభూభృతామ్।
గిరీణాం హిమవాంశ్చ త్వం వేదానాం సామరూపధృక్ ॥

29. ఛందసామపి గాయత్రీ మంత్రాణాం ప్రణవో భవాన్ ।
పశూనాం సురభిశ్చ త్వం హుతభుక్ యజ్ఞభోజినామ్ ॥

30. అచరాణాం గిరిశ్చ త్వం వృక్షాణాం పిప్పలో భవాన్ ।
సేనానీనాం భవాన్ స్కందః క్షమా శౌర్యవతాం భవాన్ ॥

31. బీజానాం అంకురశ్చాసి ప్రాణినాం ప్రాణధృక్ భవాన్ ।
బ్రహ్మర్షీణాం వసిష్ఠస్త్వం చరతాం పవనో భవాన్ ॥

32. మహర్షీణాం భృగుశ్చ త్వం వ్యాసో వేదవిదాం భవాన్ ।
వాల్మీకిశ్చ కవీనాం త్వం జనానాం త్వం జనేశ్వరః ॥

33. యత్సత్త్వం సర్వలోకేషు తేజోబలసమన్వితమ్ ।
తద్భవానితి విజ్ఞేయమితి బ్రహ్మవిదో విదుః ॥

34. సహస్రశిరసే తుభ్యం పురుషాయ నమో నమః ।
భుజాసహస్రయుక్తాయ తే సహస్రపదే నమః ॥

35. నానావిధాని దేవ! త్వదాయుధాని సహస్రశః ।
దీప్యమానాని సర్వాణి ద్యోతయన్తి దిశో దిశ ॥

36. వక్త్రాణి తవ తీవ్రాణి దంష్ట్రాప్రతి భయాని చ ।
బాలార్క మండలాకార కుండలాభ్యాం విభాంతి వై ॥

37. త్వత్పాదాంభోరుహై రేతైః సహస్రై ర్భాతి తే పదమ్ ।
బాలార్కద్యుతి సంభిన్న రక్తాంభోజై రివాంచితమ్ ॥

38. పృథివీ పూరితా పద్భిరాకాశం మూర్ధభిస్తవ ।
బాహుభిశ్చ దిశో వ్యాప్తా మహావిష్ణో! నమోఽస్తుతే ॥

39. వేదాస్తవైవ నిఃశ్వాసాః చంద్రసూర్యౌ తవాక్షిణీ ।
జ్యోతిష్కాణాం చ తారాణి జగద్రూప! నమోఽస్తు తే ॥

40. కలాకాష్ఠా ముహూర్తాది దినరాత్రి శరీరిణే ।
చతుర్యుగాయ కాలాయ నమోఽనంతాయ తే విభో ॥

41. కాలదృక్ కాలరూపీ చ కాలాఽత్మా కాలకారణమ్ ।
కాలవిద్భిరవేద్యస్త్వం విశ్వమూర్తే! నమోఽస్తు తే ॥

42. అనాదిని చ భూతాని మహాంతి మధుసూదన ।
తవ మూర్తాని రూపాణి భూతభావన! తే నమః ॥

43. ప్రాణాత్మా ప్రాణధృక్ ప్రాణీ సాక్షీ త్వం సర్వకర్మణామ్ ।
నిత్యః సర్వగతః స్థాణుః అచలస్తే నమో నమః ॥

44. శరీరభృత్ శరీరీ త్వం శరీరాత్మా శరీరగః ।
శారీరకర్మణా స్పృష్టః శుద్ధమూర్తే! నమోఽస్తు తే ॥

45. అణీయసా మణీయాం స్త్వం మహీయాంశ్చ మహీయసామ్ ।
బృహతాం చ బృహచ్చ త్వం విశ్వమూర్తే నమోఽస్తు తే ॥

46. ఖస్థస్త్వం ఖగుణశ్చాపి ఖగుణాతీత ఏవ చ ।
ఖమూర్తిః ఖగతిశ్చాపి ఖగేశారూఢ! తే నమః ॥

47. జ్ఞానాత్మా జ్ఞానదృగ్ జ్ఞానీ జ్ఞానం జ్ఞానవతాం భవాన్ ।
జ్ఞానవిద్భి రవిజ్ఞేయః తుభ్యం జ్ఞేయాఽత్మనే నమః ॥

48. వేదాత్మా వేదవిత్ వేద్యో వైద్యో వేదవిదాం వరః ।
వేదాంతవేద్యరూపాయ బ్రహ్మరూపాయ తే నమః ॥

49. అక్షరాయ క్షరాద్యాయ హ్యక్షరాకారధారిణే ।
క్షరాక్షరవిభక్తా ద్వాపతీతాయ చ తే నమః ॥

50. నమో నిరంతరానందమూలకందాయ జిష్ణవే ।
ఉష్ణత్వ మగ్నౌ శైత్యం చ జలే పృథ్వ్యాం చ గంధితా ॥

51. స్పర్శిత్వం చ భవాన్వాయౌ నైర్మల్యం ఖే నమోఽస్తు తే ।
ఘనాః కేశేషు నద్యస్తే భగవన్! సర్వసంధిషు ॥

52. కుక్షౌ చ సింధవః సప్త నమస్తే జలమూర్తయే ।
స్తోత్రైః స్తుతాయ స్తోత్రాయ స్తోత్రకృత్ప్రియకారిణే ॥

53. స్తోత్రజ్ఞేయాయ స్తుత్యాయ స్తోత్రరూపాయ తే నమః ।
అద్భుతాకారరూపాయ నమస్తే శార్ఙ్గపాణయే ॥

54. భక్తప్రియాయ శాంతాయ భక్తచిత్తానువర్తినే ।
భక్తపాపవినాశాయ నమస్తే శార్ఙ్గపాణయే ॥

55. రక్షాకరాయ జగతాం రక్షోఘ్నే రాక్షసారయే ।
శ్రీవత్సవక్షసే తుభ్యం శార్ఙ్గపాణే! నమో నమః ॥

56. శ్రియా సరోజకరయా సరోజాంతరవర్ణయా ।
దివ్యాభరణవిద్యోతిదేహయా దివ్యవేషయా ॥

57. పలాశశ్యామయా దేవ్యా ధరణ్యోత్పలహస్తయా ।
సంశ్రితోభయపార్శ్వాయ నమస్తే శార్ఙ్గపాణయే ॥

58. చరాచరాణి భూతాని భీతాని చలితాని వై ।
లభంతే చ స్థితిం దేవ! భీమరూప! నమోఽస్తు తే ॥

59. యుగాంతకాలానలకోటితుల్య! ప్రభాభిరాపూరితలోకజాల! ।
రత్నాంగదాలంకృత బాహుదండ! నమో నమస్తేఽస్తు సహస్రబాహో! ॥

60. నమోఽస్తు దేవా అపి లోకపాలా భూతావిశేషేణ వియాపనేత్ర ।
విమానగాస్తే ప్రణమంతి చైతే ప్రసీద దేవేశ! జగన్నివాస! ॥

61. పశ్యామి దేవేశ తవైవ దేహే చరాచరాణీహ గతాగతాని ।
భూతాని చైతాని చ భూతవాస! తవః ప్రభావాచ్చ భవత్ప్రసాదాత్ ॥

62. అనేక రత్నాన్విత భూషణానాం ప్రభాభిరాదీపితలోకజాల! ।
తడిద్గుణాలంకృత మేఘకాంతే! ప్రసీద దేవేశ! జగన్నివాస ॥

63. త్వదీయవక్త్రాణి మహోద్యుతీని కల్పాంత సూర్యానలసన్నిభాని ।
దంష్ట్రాకరాలాని మహాస్వనాని బిభేమి పశ్యన్ భగవన్! ప్రసీద ॥

64. బ్రహ్మ త్రినేత్ర ప్రముఖాంశ్చ దేవాన్ సయక్షగంధర్వమహోరగాంశ్చ ।
పశ్యామి సర్వాంస్తవ దేవ! దేహే ప్రసీద దేవేశ జగన్నివాస ॥

65. దిశో న జానే న లభే చ శర్మ సీదామ్యహో! దేవవర! ప్రసీద ।
భక్తానుకంపిన్! పరమార్థరూప! ప్రసీద విష్ణో! భగవన్ ప్రసీద ॥

66. ప్రసీదేతి నమస్కృత్య వాయుః ప్రాంజలిరాస వై ।
ప్రీతోఽథ భగవాన్ విష్ణుః శంఖచక్రగదాధరః ॥

67. శ్రీ భూమి సహితో దేవో వరదో వాయుమబ్రవీత్ ।
వరం వృణీష్వ భద్రం తే వాయో యన్మనసేచ్ఛసి ॥

వాయుః -

68. వరం న యాచే దేవేశ! శ్రీనాథ పరమేశ్వర! ।
త్వత్సాన్నిధ్యం మమైవేదం నిత్యమస్తు రమాపతే ॥

69. ఏతచ్ఛ్రుత్వా హరిః ప్రాహ దేవతానాం చ సన్నిధౌ ।

శ్రీ భగవాన్ :-

చతుఃషష్టిం త్వయోక్తానాం శ్లోకానాం యః పఠేన్నరః॥

70. భుక్తిం ముక్తిం స లభతే మత్ప్రసాదాత్ న సంశయః ।
త్రిసంధ్యం యః పఠేత్ భక్త్యా పూజయన్ మామనన్యధీః ॥

71. షణ్మాసాన్మమ సాన్నిధ్యం లభతే స న సంశయః ।
తవాస్తు యద్యదిష్టం తత్ దేవానామపి దుర్లభమ్ ॥

ఉపయుక్త గ్రంథ సూచీ

1. కూర్మమహాపురాణమ్
డా. స్వామినాథన్, సి.ఆర్.
నాగ్ ప్రకాశన్,జవహర్ నగర్, న్యూఢిల్లీ,1986.
2. మత్స్యమహాపురాణమ్
నాగ్ ప్రకాశన్, జవహర్ నగర్, న్యూఢిల్లీ,1983.
3. శ్రీ వేంకటాచల మాహాత్మ్యమ్
తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి,1961.
4. శ్రీ వేంకటాచల మాహాత్మ్యమ్
(భవిష్యోత్తర పురాణాంతర్గతమ్)
తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి,1961.
5. శ్రీమద్భాగవతమ్
చౌఖాంబా విద్యాభవన్, వారాణసి,1993.
6. ఆదిత్యపురాణాంతర్గత శ్రీవేంకటాచల మాహాత్మ్యము
శ్రీ రామమూర్తి శర్మ, ఆర్.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి,1982.
7. తిరుమల సమయాచారములు
అనువాదకులు : డా. నరసింహాచార్యులు, ఎన్.సి.వి.
శ్రీమాన్ కృష్ణమాచార్యులు,టి.ఏ.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి,1988.
8. వరాహపురాణాంతర్గత శ్రీ వేంకటాచల మాహాత్మ్యము
శ్రీ పార్థసారథి భట్టాచార్యులు, ఆర్.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి,1956.

9. శ్రీ వేంకటాచల మాహాత్మ్యము (ఆంధ్రతాత్పర్య సహితము)
(ఆదిత్య, బ్రహ్మ, బ్రహ్మాండ, పాద్మపురాణములు)
శ్రీ పార్థసారథి భట్టాచార్యులు, ఆర్.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి,1962.

10. శ్రీ వేంకటాచల మాహాత్మ్యము
వద్దిపర్తి రాజారావు
కాకినాడ,1998.

11. శ్రీ వేంకటాచలేతిహాసమాల
శ్రీమదనంతార్య గుంభితము
డా. నరసింహాచార్య, ఎస్.సి.వి.
(తెలుగు అనువాదము)
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి,1987.

12. History of Tirupati
Veera Raghavacharya, T.K.T.
Tirumala Tirupati Devasthanams,Tirupati, 1997.

13. The Tirumala Temple
Dr. Ramesan, N.
Tirumala Tirupati Devasthanams,Tirupati, 1999.

14. Significance of Seven Hills in Krishna Yajurveda - A Study
by Dr. Hayagreeva Sarma, K. published in Oriental Journal,
Vol.XLVII,S.V.U. O.R.I., 2004.

